# అమ్మ కోసం

నవల

– పొత్తూరు రాజేంద్ర ప్రసాద్‌వర్మ




శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 194

కౌముది మాసపత్రికలో

జనవరి 2019 సంచిక నుంచి డిసెంబర్ 2019 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

# (ప్రారంభం)

**"అమ్మా.."**

పాంచజన్య బాధగా మూలిగాడు

"అమ్మను అర్జంటుగా ఆసుపత్రికి తీసుకుని వెళ్ళాలి. ఎక్కడున్నావు?"

మామయ్య ఫోనులో చెప్పిన విషయాన్ని విన్న దగ్గర నుంచి మనసంతా విషాదం కమ్ముకుపోయింది. మందుల షాపు మెట్లు దిగడానికి కూడా ఇబ్బంది పడ్డాడు.

పాంచజన్య హృదయం మొద్దుబారిపోయింది.

మందుల షాపులో మెట్లు దిగడానికి కాళ్ళు తడబడ్డాయి.

రెండు నెలల నుంచి అమ్మ అనారోగ్యం కోసం సెలవు పెట్టి ఉంటున్న పాంచజన్యకు చిన్నతనం నుంచీ అన్నీ అమ్మే. అమ్మ తప్ప మరో ప్రపంచం తెలీదు. దేవతలకు అమృతం దొరికితే అందరూ పంచుకుంటారు. అమ్మకు అమృతం దొరికితే ముందు తనకు పెట్టి తర్వాత తాను తింటుంది. అటువంటి అమ్మ అనారోగ్యంతో బాధపడటం తాను చూడలేకపోతున్నాడు.

ఆటోను పిలిచి ఎక్కి కూర్చున్నాడు.

పుట్టినప్పటినుంచి ఏ కష్టం లేకుండా రోజూ అమృతాన్నే పంచింది. తను బాధపడితే ఒక్క క్షణం కూడా ఓర్చుకోలేని అమ్మ ఇప్పుడు జబ్బుతో కష్టాలు పడుతోంది. కొడుకుగా తాను ఏమి చేయలేకపోతున్నానన్న చింత మాత్రం మనసులో పీకుతోంది. క్షీణించిపోతున్న అమ్మను కాపాడుకోవటానికి సెలవు పెట్టి బెంగుళూరు నుంచి విశాఖ వచ్చేసాడు.

ఆటో ఆగీఆగగానే కిందకు గెంతినట్లు దిగాడు.

లిఫ్టులేని అపార్టుమెంటులో నాలుగో అంతస్తు గబగబా చేరుకున్నాడు.

అమ్మ పక్కన మామయ్య మాత్రం ఉన్నాడు.

"అమ్మా.." అంటూ మంచం మీదున్న రమణిని చుట్టుకుని పోయాడు.

వెంకట రమణి ఆయాసంతో రొప్పుతోంది.

"ఆసుపత్రికి వెళదాం నడవగలవా?" అని ప్రశ్నించి ఎందుకు అడిగానా అని మనసులోనే మదనపడిపోయాడు.

రమణి జాలిగా చూసింది.

కిందనున్న వాచ్‌మేన్‌కు ఫోను చేసి మరో ఇద్దర్ని సాయానికి తీసుకుని రావాలని కోరాడు పాంచజన్య.

తల్లిని రెండు చేతులతో ఎత్తిపట్టి కుర్చీలో కూర్చోబెట్టాడు. మామయ్య సాయంతో కుర్చీని మోస్తూ మెల్లగా అపార్టుమెంటు సెల్లార్‌లోకి తీసుకుని వచ్చాడు. సిద్ధంగా ఉన్న అంబులెన్సులోకి ఎక్కించాడు.

"మనం ఈ ఇల్లు మారిపోదాం" రమణి రొప్పుతూ చెప్పింది.

"అమ్మా తప్పకుండా మారిపోదాం. లిఫ్టు లేని ఈ అపార్టుమెంటులో మనం ఉండొద్దు" పాంచజన్య తల్లి తలను నిమురుతూ చెప్పాడు.

అంబులెన్సు ఆసుపత్రికి చేరింది.

పాంచజన్య ఆసుపత్రి రెసెప్షను దగ్గరకు వెళ్ళి వివరాలు చెప్పాడు.

ఫారం నింపి ఇచ్చిన తర్వాత సంతకం చేసి కింద పేరు రాసాడు.

డబ్బులు ఇస్తున్నప్పుడు కౌంటరులో కూర్చున్న అమ్మాయి పాంచజన్య పేరుని మరోసారి చదివి "సార్ పాంచజన్య పేరు గమ్మత్తుగా ఉంది. దీని అర్థం ఏమిటి?" అడిగింది.

బాధలో కూడా పాంచజన్య ఆమె వైపు విచిత్రంగా చూసాడు.

ముందు ఆమెకు జవాబు చెప్పాలని అనిపించలేదు.

అమ్మ ఇష్టపడి తనకు పెట్టిన పేరు. తనకు కూడా ఎంతో ఇష్టమైపోయింది. అడిగిన వారికి చాలామందికి వివరంగా చెప్పేవాడు. ఆ అమ్మాయివైపు చూస్తూ "పాంచజన్యం శ్రీకృష్ణుని శంఖం పేరు. అమ్మకు చాలా దైవభక్తి. అందుకే ఏరికోరి ఆ పేరు పెట్టింది. సాయిబాబా అన్నా ఆమెకు ఎంతో ఇష్టమే. అందుకే నా పేరు ముందు సాయి అని తగిలించింది" అంటూ అమ్మాయి అందించిన రశీదు తీసుకుని ముందుకు కదిలాడు.

అమ్మ ప్రస్తావన రావడంతో కళ్ళలో తడి చేరింది. కన్నీళ్ళు బైటికి రాకుండా రుమాలుతో తుడుచుకున్నాడు.

రూం ఎలాట్‌మెంటు కావడంతో స్పెషల్ రూంలోకి తీసుకుని వెళ్ళారు.

ట్రీట్‌మెంటు ప్రారంభమైంది.

దూరంగా ఆఫీసు పనిమీద వేరే రాష్ట్రం వెళ్ళిన నాన్నకు ఫోను చేసి విషయం చెప్పాడు. వెంటనే బయలుదేరుతున్నానని నాన్న ఫోనులోనే జవాబిచ్చాడు.

రమణి బాధతో మెలి తిరిగిపోతోంది.

పాంచజన్యకు దుఃఖం తన్నుకుని వస్తోంది తల్లి గమనించకుండా కన్నీళ్ళు రాకుండా అదుముకున్నాడు.

"సాయీ ఏడుస్తున్నావా?" అంత బాధలోనూ అడిగింది.

తనను ముద్దుగా సాయి అని పిలుచుకునే అమ్మ పిలుపు ఏదోలా అనిపించింది. సాయీ అని పిలవడం పాంచజన్యకు చాలా సరదాగా ఉండేది.

అమ్మ పిలుపు మనసుకు తగిలింది. "లేదమ్మా ఏడవడంలేదు. ఇక్కడ నీకు ట్రీట్‌మెంటు బాగుంటుంది పేరున్న డాక్టరు ఎంత డబ్బు ఖర్చు అయినా పర్వాలేదు. నీకు తగ్గిపోతుంది" పాంచజన్య తల్లిని అనునయించాడు.

"తల్లి రుణం తీర్చుకుంటున్నావా?"

"అంత పెద్ద మాటలు ఎందుకమ్మా?"

"విద్యార్థిగా ఉండగానే తన ప్రతిభతో మంచి జీతంతో కేంపస్ సెలక్షనులో ఉద్యోగం వచ్చింది. బెంగుళూరులో ఉద్యోగంలో చేరి ఇంకా ఏడాది పూర్తికాలేదు. నెలరోజుల నుంచి సెలవులోనే ఉన్నావు"

డాక్టరు వచ్చి అన్ని వివరాలు కనుక్కున్నాడు.

నర్సు వచ్చి బీపి చూసింది రక్త పరీక్షకు రక్త నమూనా తీసుకుంది రెండు ఇంజక్షన్లు చేసింది తర్వాత "ఈమెను డిస్టర్బు చేయకండి" అంటూ వెళ్ళిపోయింది.

"అమ్మా కాసేపు పడుకో" పాంచజన్య రమణితో అన్నాడు.

"నీతో ఇంకా మాట్లాడాలని ఉందిరా కన్నా" రమణి నెమ్మదిగా అంది. కన్నా అనే పిలుపు పాంచజన్యకు కొత్తగా అనిపించింది.

"నువ్వు తొందరగా రికవరీ అయిపోతే ఇంటికి వెళ్ళిపోవచ్చు."

"ఆ ఇంటికి మరి వెళ్ళవద్దు. ఈలోపే మరో ఇల్లు చూడు. నడవలేని అశక్తురాలిగా ఉన్నాను. నేను ఆ అపార్టుమెంటులో అన్ని మెట్లు ఎక్కలేను. దిగలేను. కుర్చీలో కూర్చుని మీ అందరితో మోయించుకోలేను" రమణి గొంతులో అదోలాంటి విషాదం తొంగిచూసింది.

పాంచజన్యకు ఏమి సమాధానం చెప్పాలో తెలియదు.

బెడ్ మీద దుప్పటి తీసి అమ్మకు నిండుగా కప్పాడు.

రమణి మగతగా తీసి అమ్మకు నిండుగా కప్పాడు.

రమణి మగతగా నిద్రలోకి జారిపోయింది.

"పాంచజన్యా" పిలుపు వినిపించి కుర్చీలో కళ్ళు మూసుకుని కూర్చున్న పాంచజన్య లేచాడు, ఎదురుగా పల్లవి ఉంది.

ఆమెను చూడగానే లేచి నిల్చుని కుర్చీ చూపించాడు.

ఆమె కళ్ళతోనే పలకరించ్చింది.

"అమ్మకు బాగోలేదు"

పల్లవి రెండు నిమిషాలు ఏమీ మాట్లాడలేదు తర్వాత "మరేమీ పర్వాలేదు. అత్త ఆరోగ్యంగా ఇంటికి తిరిగి వస్తుంది" అంది.

"పల్లవీ నాకు చాలా బెంగా ఉంది ఎవరికి చెప్పుకోవాలో తెలియడంలేదు నాన్నకూడా దగ్గరలో లేరు. రేపు ఉదయం వస్తారు."

"నేను ఉంటాను లే అమ్మకు చెప్పి వచ్చాను."

నువ్వు వద్దులే పెళ్ళికాని పిల్లవు ఒక్కదానివి ఇక్కడ ఉండటం బాగోదు."

"అమ్మ రోజు రోజుకూ క్షీణించిపోవడం నాకు ఎంతో బాధగా ఉంది. ఎప్పటికి తగ్గుతుందో తెలియడంలేదు. అసలు తగ్గుతుందో లేదో కూడా అర్థం కావడంలేదు."

"ఎందుకలా అనుకుంటావు?"

"అమ్మ ఎంతో ఏక్టివ్‌గా ఉండేది. స్కూలు టీచరుగా పిల్లలకి ఎన్నో డాన్సులు పాటలు నేర్పించేది. హుషారుగా అన్ని పనులు చేసేది. చుట్టాలు ఇళ్ళల్లో ఏ ఫంక్షను జరిగినా తానే అన్నీ చేసేది. ఇప్పుడు నిస్సత్తుతో ఇలా మంచానికి అంకితం అయిపోవడం ఏదోలా ఉంది. తన వయసు కూడా ఎక్కువేమి కాదు ఇంకా యాభైకి దగ్గరలో ఉంది" అన్నాడు.

"అత్తయ్య గురించి నాకు తెలుసు. అమ్మ రోజూ అత్తయ్య మాటలే."

అంత బాధలోనూ పాంచజన్య పల్లవి వైపు తీక్షణంగా చూసాడు.

"పల్లవీ వరసలు కలపకు. అమ్మ తర్వాతే అన్నీను. నిన్ను పెళ్ళి పెళ్ళి చేసుకోవాలన్నా, మీ ఇంటికి అల్లుడ్ని కావాలన్నా అన్నీ అమ్మ ఇష్టప్రకారమే జరగాలి."

"నేను ఏమన్నానని అలా అంటున్నావు?"

"పల్లవీ నా మనసంతా చికాకుగా ఉంది. ఎవరిపైనా ఆసక్తి లేదు. తగ్గేది లేదు. తగ్గేంత వరకు అమ్మ పక్కనే ఉండాలని ఉంది. కొడుకుగా అమ్మ రుణం తీర్చుకునే రోజు వచ్చింది. నాకోసం అమ్మ ఎన్నో చేసింది. ఆమె సంతోషం కోసం నేను ఏమీ చేయలేకపోయాను."

"ఎందుకలా అనుకుంటావు. అమ్మ కోసం నీలా ఆలోచించే యువకులు చాలా తక్కువ మంది ఉంటారు. కొత్తగా వచ్చిన ఉద్యోగానికి సెలవులు ఇవ్వరు. అయినా అన్నీ వదులుకుని వచ్చేసావు. ఇంతకన్నా ఎవరు చేస్తారు."

"పల్లవీ నాకు అన్నీ అమ్మ తర్వాతే. నువ్వూ నీ ప్రేమ అన్నీ కూడా అమ్మ ముందు చాలా అల్పమైనవి"

పల్లవి విచిత్రంగా పాంచజన్యవైపు చూసింది.

"అమ్మకు తగ్గేంత వరకు నీతో సరిగా మాట్లాడలేను ఏమీ అనుకోవద్దు"

పల్లవి జవాబు చెప్పే లోపల తలుపు తోసుకుని మామయ్య వచ్చాడు.

"డాక్టరు ఏమన్నాడు?"

"ఏమీ చెప్పలేదు రిపోర్టులు రావాలి కదా?"

సంచితో తీసుకుని వచ్చిన పళ్ళను రూంలో టేబిల్‌పై పెట్టాడు మామయ్య.

"భోజనానికి కేరేజీ తీసుకుని వస్తాను"

పాంచజన్య మామయ్యవైపు విచిత్రంగా చూసాడు.

"మామయ్యా.. అమ్మ ఈ పరిస్థితిలో ఉంటే నీకు భోజనం గురించి ఆలోచన ఎలా వచ్చింది? నిన్ను చూస్తుంటే ఏదోలా ఉంది."

"ఇంకా మీ అమ్మ గురించే ఆలోచిస్తున్నావా?"

"అమ్మకోసం ఆసుపత్రికి వచ్చాం. అమ్మకు ట్రీట్‌మెంటు జరుగుతోంది. అమ్మ గురించి కాకపోతే ఎవరి గురించి ఆలోచించను మామయ్యా.. నీకు ఆ ఆలోచన లేదా?"

"ఉంది. కానీ ఏం చేయగలం? జరగవలసింది జరుగుతుంది. మన పనులు కూడా చేసుకోవాలి కదా? అమ్మంటే నీకు ఎంత ఇష్టమో నాకు కూడా మీ అమ్మంటే అంతే ఇష్టం. ఆమె చిన్నప్పుడు నా చేతులతో ఎత్తుకుని తిప్పేవాడిని" మామయ్య నెమ్మదిగా చెప్పాడు.

"మామయ్యా నాకు ఏమీ తినాలని లేదు. ఆకలి కూడా వేయడం లేదు. మంచం మీద నిస్త్రాణగా పడుకున్న అమ్మ ఎంత తొందరగా లేస్తుందా అని ఎదురు చూస్తున్నాను."

"మీ అమ్మ లేచి చెంగు చెంగున తిరగాలని నాకూ ఉంది కానీ తనకు వచ్చిన జబ్బు అటువంటిది. రోజురోజుకూ క్షీణించి పోతోంది. తన పని తాను చేసుకోలేకపోతోంది. ఎన్నాళ్ళు బతుకుతుందో చెప్పలేమని డాక్టర్లు అంటున్నారు."

"మామయ్యా నువ్వు ఎక్కువగా మాట్లాడకు. నీ మాటలు నాకు అసహ్యం వేస్తున్నాయి. అమ్మ ఆణిముత్యం సంపూర్ణ ఆరోగ్యంతో బైటికి వస్తుంది"

మామయ్య పాంచజన్యను జాలిగా చూసాడు.

"నీ ఆలోచనలే మీ పల్లవికి కూడా వచ్చాయి. జీవితాన్ని చాలా ఈజీగా తీసుకుంటారనుకుంటా. ఆత్మీయతలు అనుబంధాలు మీకు తెలియవనుకుంటాను. మంచి ఉద్యోగం ఉందని నన్ను పెళ్ళిచేసుకోవాలని తనకు కట్నం లేకుండా అల్లుడు దొరుకుతాడని నీకు

చాలా ఆతృతగా ఉన్నట్లుంది. నీలాంటి మెటీరియలిస్టులంటే నాకు ఇష్టం ఉండదు. మామయ్యా మీ అమ్మ గురించి కూడా నువ్వు ఇలాగే ఆలోచించేవాడివా?" సాయి పాంచజన్యంలో కోపం.

మామయ్య ఏమి మాట్లాడలేదు. అటువంటి సమయంలో మాటలను పొడిగిస్తే పాంచజన్యకు చాలా కోపం వస్తుందని చిన్నప్పటినుంచీ వాడిని చూస్తుండటం వల్ల బాగా తెలుసు. అందుకే రెట్టించలేదు.

"నీ ఇష్టం రా.."

ఇంతలో రమణి కళ్ళు తెరిచింది. ఆమెకు ఎదురుగా ఉన్న కొడుకు కనిపించాడు. ఆమె పిలవలేదు. కానీ పాంచజన్య వెంటనే అమ్మ పక్కకు చేరిపోయాడు.

"అమ్మా ఎలా ఉంది?"

"కొంచెం నొప్పిగా ఉంది. అయినా పర్వాలేదు. డాక్టరు ఇంజక్షను చేసాడు కదా? తగ్గిపోతుంది. నాన్నా నువ్వు ఏమీ తినలేదు" అంటూ అన్నయ్య వైపు తిరిగి "చిన్నపిల్లవాడు అడగలేడు. నువ్వన్నా ఏదో ఒకటి తేవచ్చు కదా అన్నయ్యా?" అంది.

మామయ్య పాంచజన్యవైపు చూసాడు.

"అమ్మా నాకు ఆకలిగా లేదు. తింటానులే" పాంచజన్య.

నర్సు వచ్చి బీపీ చూసింది. మాత్రను మింగించింది.

"పడుకోవడం విసుగ్గా ఉందిరా సాయీ. నెలరోజుల నుంచి ఇంటిలో కూడా మంచానికి పరిమితం అయ్యాను. ఇప్పుడు ఆసుపత్రిలో కూడా బెడ్‌కే అంకితం కావాల్సి వస్తోంది" రమణి మాటల్లో నిర్వేదం.

"రెండు రోజుల్లో అన్నీ సర్దుకుంటాయి. బెంగుళూరు నుంచి కూడా స్పెషలిస్టు డాక్టరు వస్తున్నారు. నీకు తగ్గిపోయిన తర్వాత మనం రింగు టెన్నీస్ ఆడదాంలే అమ్మా?" అన్నాడు పాంచజన్య.

రమణి చిన్నగా నవ్వింది.

"నాన్నా ఆ రోజులు మళ్ళీ వస్తాయంటావా?"

"తప్పకుండా వస్తాయి. నాకు అన్ని ఆటలూ నువ్వు నేర్పించావు. ఇద్దరం డబుల్‌కాట్ మంచం మీద ఎదురెదురుగా పడుకుని చెస్ ఆడటం నేను ఎప్పటికీ మరిచిపోలేను. మనమిద్దరం రింగు టెన్నీస్ ఆడదాం. నీకోసం షటిల్ బాట్లు కూడా తెప్పిస్తాను"

రమణి కళ్ళల్లో వెలుగు కనిపించింది.

"రమణీ నువ్వు ఎక్సయిట్ కాకు. మీ అబ్బాయితో అన్నీ ఆడుకోవచ్చులే. వాడి ఉద్యోగాన్ని కూడా బెంగుళూరు నుంచి విశాఖకు మార్పిద్దాం."

వాడు దగ్గరుంటే అంతకన్నా నాకు కావల్సింది ఏమిటి? నా ఉద్యోగానికి కూడా వాలంటరీ రిటైర్‌మెంటు ఇచ్చేస్తాను. ఉద్యోగ ఇబ్బందులు లేకుండా నచ్చిన కూరలు వండిపెడుతూ వీడి దగ్గరే ఉంటాను. డాడీని కూడా దగ్గరకు ట్రాన్సఫర్ చేయించుకోమని చెబుతాను. కొడుకుని తండ్రిని చూసుకుంటూ జీవితాన్ని గడిపేస్తాను."

"మనవడ్ని ఎత్తుకోవా?" మామయ్య అడిగాడు.

"మీ పల్లవికి వీడంటే చాలా ఇష్టం. ఇప్పుడే పెళ్ళి ఎందుకంటాడు. కానీ మనవడ్ని ఎత్తుకోవాలంటే వెంటనే జరగాలి కదా? మనవడ్ని నా ఇష్టప్రకారం పెంచుతాను"

"అమ్మా! ఇప్పుడు అవన్నీ ఎందుకు? ప్రశాంతంగా ఉండు."

"అన్నయ్యా చూడు. పెళ్ళి అంటే టాపిక్ మార్చేస్తాడు."

ఇంతలో డాక్టరు వచ్చి రమణికి టెస్ట్‌లు చేసాడు. " అరగంట తర్వాత మరో టెస్ట్ చేయించాలి బిల్లు కట్టి రండి" అంటూ డాక్టరు కాగితాన్ని అందించాడు.

"అమ్మా! ఉండు వచ్చేస్తాను. మామయ్యా.. అమ్మను చూసుకో బిల్లు కట్టి వస్తాను" అంటూ రూం బైటికి వచ్చాడు.

కుర్చీని బెడ్‌కు దగ్గరగా లాక్కున్నాడు రామారావు.

"రమణీ ఎంతోమంది పిల్లల్ని చూసాను. కానీ తల్లిని ఇంతలా ప్రేమించే వీడిలాంటి వాడిని ఎక్కడా చూడలేదు. నువ్వంటే ప్రాణమనుకో. ఇటువంటి కొడుకుని కన్నందుకు నువ్వు గర్వపడాలి" చెల్లితో చెప్పాడు రామారవు.

రమణి కళ్ళు గర్వంతో మెరిసాయి.

"అన్నయ్యా వాడు అమ్మ కూచిరా. వాడికి నా మీద ఎంత ప్రేముందో నాకు కూడా వాడి మీద రెట్టింపు ప్రేమ ఉంది. వాడు కనబడకపోతే నేను ఒక్క క్షణం కూడా ఉండలేను. ఉద్యోగం వచ్చి బెంగుళూరులో నెలరోజులు ఉండిపోయినా రోజుకు రెండుసార్లు ఫోను చేయకుండా ఉండలేను. ఎప్పుడైనా నా గొంతులో చిన్న తేడా కనిపించినా "అమ్మా ఏమైంది?" అంటూ విలవిల్లాడిపోయేవాడు. ఈ మధ్య నాకు అనారోగ్యం వచ్చిన తర్వాత వాడితో మాట్లాడాలని ఉన్నా మాట్లాడితే నా అనారోగ్యం గురించి తెలిసి ఎక్కడ ఉద్యోగం మాని వెనక్కి వచ్చేస్తాడోనని భయపడిపోయేదాన్ని. నాన్న ఉన్నారు చూసుకుంటారని చెప్పినా తన ఉద్యోగానికి సెలవు పెట్టి వచ్చేసాడు" రమణి చెప్పుకుని పోతోంది.

రామారావు చెల్లిని అనునయించాడు.

**అర్ధరాత్రి**

పాంచజన్యకు మెలుకువ వచ్చింది.

మంచం మీద అమ్మ పడుకుని ఉంది.

ఆసుపత్రి రూంలో విజిటర్ల సోఫా మీద నాన్న పడుకున్నాడు.

పాంచజన్య నేలమీద పడుకున్నాడు.

పదకొండు గంటలవరకు నిద్రపోలేదు. డాక్టరు ఇచ్చిన ఇంజక్షనుతో అమ్మ ప్రశాంతంగా పడుకుంది రూంలో ఫాను తిరుగుతున్న చప్పుడు మాత్రం వినిపిస్తోంది. రాత్రి నిశ్శబ్ధంగా ఉంది. రెండు రోజులుగా ఆసుపత్రిలో ఉన్నందువల్ల ఏదోలా ఉంది. సరిగా నిద్రకూడా పట్టడంలేదు. కళ్ళుమూసుకున్నా తెరిచినా అమ్మకళ్ళముందే మెదులుతోంది.

లేచి కూర్చున్నాడు.

రమణి మొహం వైపు చూసాడు. ప్రశాంతంగా ఉంది.

వాటర్ బాటిల్‌తో నీరు తాగాడు. దాహం తీరింది.

రూంలో తన చెప్పులు చిందరవందరగా ఉన్నాయి.

చిన్నతనంలో తనకు అయిదేళ్ళు ఉంటాయేమో. గుడికి వెళ్ళడానికి ఊరిలో ప్రైవేటు సిటీ బస్సు ఎక్కినప్పుడు సీటు ఖాళీలేక అమ్మ తనను ఎత్తుకుని నిల్చుంది. ఆ సమయంలో తన ఒక చెప్పు డ్రైవరు పక్కనున్న గేర్లు వేసే రాడ్డు పక్కనున్న చిన్న కన్నంలో జారి నేలమీద పడిపోయింది. కాలికున్న చెప్పు పడిపోయిందన్న విషయం తెలిసి తాను ఏడుపు లంగించుకున్నాడు.

తన చెప్పు జారిపోయిన విషయం అమ్మ గమనించింది.

వెంటనే సిటీ బస్సుని ఆపింది.

అందరూ విచిత్రంగా చూస్తున్నారు. తను మాత్రం చెప్పుకోసం ఏడుస్తున్నాడు. ప్రయాణీకులంతా విసుక్కుంటున్నారు. ''మరో చెప్పు కొనుక్కోవచ్చులేమ్మా'' అంటున్నారు. అమ్మ క్లీనరుని బతిమిలాడి వెనక్కి పరుగెట్టించి పడిపోయిన చెప్పును తెప్పించింది. తన కాళ్ళకు తొడిగింది. ఆ చెప్పు ఖరీదు పది లేదా పదిహేను రూపాయలు ఉంటుందేమో. కానీ పరుగున వెళ్ళి చెప్పు తెచ్చిన క్లీనరుకు పది రూపాయలు ఇచ్చింది. ఆ విషయం గుర్తుకు రాగానే పాంచజన్యకు మనసు ఏదోలా అయిపోయింది.

తనకు ఉద్యోగం వచ్చిన తర్వాత మొదటి జీతం చేతికి ఇచ్చినప్పుడు. అమ్మ తీసుకోలేదు. ''నీకు ఈ రోజు మంచి ఉద్యోగం వచ్చింది. నువ్వు చాలా సంతోషంగా ఉన్నావు నీలాగే అందరూ సంతోషంగా ఉండాలి''

''నాన్నకి నీకు మంచి పార్టీ ఇద్దామనుకుంటున్నాను.''

''పార్టీ ఎందుకురా? నీకు ఇష్టమైన సున్నుండలు నెయ్యి దండిగా దట్టించి చేస్తాను. నీకు నచ్చిన కూరలతో నచ్చిన విధంగా కడుపు నిండా భోజనం పెడతాను.''

''నువ్వు వండుతావా?''

''ఉద్యోగం వచ్చినప్పటి నుంచి బెంగుళూరులో ఉంటూ కేంటిన్‌లోనే తింటున్నావు. మనమంతా కలిసి తిన్నది కూడా చాలా తక్కువ సార్లు కదా?''

''అమ్మా నీకు మంచి చెప్పులు కొంటాను. నా చిన్నప్పుడు నాకు ఇష్టమైన చెప్పులు బస్సులో నుంచి పడిపోతే నువ్వు ఆ చెప్పుని బస్సు క్లీనరుతో తెప్పించిన విషయం నేను నా జీవితాంతం మరిచిపోలేను.''

''సాయి నాన్నా.. నేను టీచరుగా ఉద్యోగం చేస్తున్నాను. నాకు నెల కాగానే మంచి జీతం వస్తుంది. నాన్నకి కూడా మంచి ఉద్యోగం ఉంది. అందువల్ల మాకిద్దరికి అటువంటివి ఏమీ అక్కరలేదు. మనకన్నా పేదవాళ్ళు ఎంతోమంది ఉన్నారు. వారికోసం ఏమైనా చేయకూడదూ?'' అమ్మ అంది.

అమ్మ చెప్పిన విషయం పాంచజన్యలో ఆలోచనలు రేపింది.

ఉద్యోగం వచ్చిందని తల్లిదండ్రులకు ఏదో కొనాలని ఉంచిన పదివేల రూపాయలతో హోటలుకు వెళ్ళాడు. భోజనం పాకెట్లు పార్సిల్ చేయించాడు. వాటర్ బాటిళ్ళు కొన్నాడు. ఆటో మాట్లాడుకుని వాటినన్నింటినీ అందులో ఎక్కించుకుని విశాఖపట్నంలో అన్ని ప్రాంతాలకు బయలుదేరాడు. రోడ్డు పక్క బిచ్చగాళ్ళు రైల్వే స్టేషనులో కళ్ళులేనివారికి, కాళ్ళు లేనివారికి. అడుక్కున్నవారికి దేవాలయాల ముందు కూర్చున్నవారికి తలో పేకెట్టు పంచారు.

పాంచజన్య ఏమీ తినలేదు. మధ్యాహ్నం మూడు గంటలవరకు నగరమంతా తిరిగి అన్ని పేకెట్లు పంచేసాడు. ఆటో డ్రైవరుకు ఇదంతా విచిత్రంగా అనిపించింది.

ఇరవయ్యేళ్ళ కుర్రవాడు చేస్తున్న ఈ పనిని విస్మయంగా గమనిస్తున్నాడు.

నగరమంతా తిరిగి ఇంటికి వచ్చి ఆటో ఆగినప్పుడు ''మీరు కూడా భోజనం చేయలేదు. ఆలస్యమైంది. ఏమీ అనుకోవద్దు. రండి ఇంటిలో మనమిద్దరం కలిసి భోజనం చేద్దాం'' ఆహ్వానించాడు. పాంచజన్య ఆటో డ్రైవరు అయోమయంగా చూసాడు.

''పర్వాలేదు రా అన్నయ్యా'' అని చేతులు పట్టుకుని తీసుకుని వెళ్ళాడు.

మూడు అంతస్తులు ఎక్కిన తర్వాత తలుపు కొట్టాడు.

తలుపు తీసిన రమణి "ఏరా ఎక్కడికి వెళ్ళిపోయావు భోజనం చేయలేదు." అంటూ పక్కన ఉన్న ఆటో డ్రైవరు వైపు ఆశ్చర్యంగా చూసింది.

"అమ్మా నువ్వు చెప్పిన పని చేసాను. నాకు కడుపు నిండిపోయినట్లుగా ఉంది. ఆకలి వేయడంలేదు. చాలా సంతృప్తిగా ఉంది. ఉదయం నుంచి తన ఆటోలో నగరమంతా తిప్పాడు. అన్నయ్య కూడా ఏమీ తినలేదు. ఇద్దరికి భోజనం పెట్టు" అంటూ డ్రైవరును చేతులు కడుక్కోవడానికి సింకు దగ్గరికి తీసుకుని వెళ్ళాడు.

డ్రైవరుకు అంతా విచిత్రంగా ఉంది.

రమణి ఎవరు ఏమిటీ అని అడగలేదు. ఇద్దరికీ భోజనం పెట్టింది.

తిని వెళుతున్నప్పుడు ఆ డ్రైవరు నమస్కారం చేసాడు.

"మా అబ్బాయికి స్నేహితులు చాలా తక్కువమంది ఉన్నారు. వాడు మిమ్మల్ని భోజనానికి తీసుకుని రావడం చాలా సంతోషంగా ఉంది" చెప్పింది.

"మా అమ్మ కూడా ఎప్పుడూ ఇలా అన్నం పెట్టలేదు. కడుపు నిండిపోయిందమ్మా. దేముడు మిమ్మల్ని చల్లగా చూడాలి" అన్నాడు ఆటో డ్రైవరు చెమర్చిన కళ్ళతో.

"నువ్వూ మా అబ్బాయిలాంటివాడివే"

అపార్టుమెంటు మెట్టు దిగిన తర్వాత అనుకున్న విధంగా ఆటో చార్జి అయిదువందలు తీసి డ్రైవరుకు అందించి "థాంక్సు అన్నయ్యా" అన్నాడు పాంచజన్య.

"బాబూ మీరెవరో నాకు తెలియదు. కానీ పేదవాళ్ళకు సాయం చేయాలన్న మీ మంచితనం నాకు నచ్చింది. మీ వయస్సులో కుర్రవాళ్ళు అల్లరి చిల్లరగా తిరుగుతుంటారు. వారితో పోలిస్తే మీలో ప్రత్యేకత కనిపిస్తోంది. ఆటో చార్జీలు వద్దులెండి" అన్నాడు.

"నేను మంచి ఉద్యోగం చేస్తున్నాను. నువ్వు కేవలం ఆటో ఆధారంగా బతుకుతున్నావు. పర్వాలేదు. తీసుకో" బలవంతం చేసి డబ్బులు అందించాడు పాంచజన్య.

అతను మొగమాట పడుతూ "ఉడతా సాయంగా నేనూ పేదవాళ్ళకు సహాయపడ్డానని అనుకుంటాను. వద్దులే బాబూ మీరు భోజనం పాకెట్లు పంచుతుంటే పేదవారి కళ్ళలో వెలుగును నేను మరిచి పోలేను. వారు సంతృప్తిగా కడుపు నిండా తిన్నారు. వారు అలా కడుపునిండా అన్నం తిని ఎన్ని రోజులు అయిందో? వారికి ఒక్కపూట భోజనం పరమాన్నంతో సమానం."

"నాకు మంచి జీతం వస్తుంది కాబట్టి నా స్థాయిలో సాయం చేసాను. నీ స్థాయికి అయిదువందలు చాలా ఎక్కువ. అంత సాయం వద్దులే. నువ్వు సంపాదించిన వంద రూపాయల్లో ఒక రూపాయి నీకన్నా పేదవారికోసం ఖర్చు చెయ్యిసరిపోతుంది"

"మంచి మాట చెప్పారు బాబూ. అలాగే చేస్తాను."

ఈ మాట నేను చెప్పింది కాదు. మా అమ్మ చెప్పింది. ఎప్పుడూ ఎవరికైనా సాయం చెయ్యాలనే నిరంతరం అందరికీ చెబుతుంది, ఆమె కూడా అలానే చేస్తుంది. చిన్నతనం నుంచి ఆమె మాటల ప్రభావంతోనే నేను పెరిగాను అంతే" అన్నాడు పాంచజన్య గర్వంగా.

"మీ అమ్మగారికి మరోసారి నమస్కారాలు చెప్పండి." ఆటో స్టార్టు చేసి వెళ్ళి అతను పోయాడు.

అవును అమ్మకు తాను ఎప్పటికీ రుణపడి ఉండాలి. తనకు ఇంత మంచి అలవాట్లు నేర్పిన తనను ఎప్పటికీ మరిచిపోకూడదు.

"నిద్రపోలేదా?"

నాన్న మాటలకు ఈ లోకంలోకి వచ్చాడు పాంచజన్యం.

"లేదు నాన్నా నిద్రరావడంలేదు. అమ్మ పదే పదే గుర్తుకు వస్తోంది"

"నువ్వు బాధపడకూడదు. నువ్వు బాధపడినట్లు తెలిస్తే అమ్మ తట్టుకోలేదు. నువ్వు ధైర్యంగా ఉండాలి."

"అమ్మ ఆరోగ్యం రోజూ పాడైపోతోంది. ఒకప్పటి హుషారు కనిపించడంలేదు. నావైపు జాలి చూపులు చూస్తోంది. నాకు పాత అమ్మను చూడాలని ఉంది నాన్నా" పాంచజన్య ఆర్తిగా అడిగాడు.

"తప్పకుండా చూస్తావు. అమ్మకు నువ్వంటే చాలా ప్రేమ. అమ్మా నేను ఒకరంటే ఒకరు ఇష్టపడి ప్రేమించి పెళ్ళి చేసుకున్నాం. నీకు తెలుసుకదా. నువ్వు పుట్టిన తర్వాత నన్ను నిన్నూ తన రెండు కళ్ళు అనేది. తర్వాత నీమీదే తన ధ్యాసంతా"

"అదే నా బాధ నాన్నా. ఈ లోకంలో నాకు ఇష్టమైనది ఏదైనా ఉందీ అంటే అది అమ్మ మాత్రమే. అందుకే నేను తట్టుకోలేకపోతున్నాను"

నాన్న కళ్ళల్లో కూడా కన్నీళ్ళు చిప్పిల్లాయి.

"అమ్మ కోలుకుంటుంది కదా నాన్నా? మళ్ళీ నాతో చెస్ ఆడుతుంది కదా?" పాంచజన్య జాలిగా అడిగాడు.

కొడుకుని దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకున్నాడు.

"అంతా మంచే జరుగుతుంది"

"అమ్మకు ఏమైనా అయితే నేను తట్టుకోలేను నాన్నా"

"అన్నింటికీ భగవంతుడు ఉన్నాడు. అమ్మ ఎంత గొప్ప భక్తురాలో నీకు తెలుసు కదా? దేముడ్ని నమ్ముకున్నవారికి ఎప్పటికీ అన్యాయం జరగదు"

పాంచజన్య కంటినుంచి కన్నీళ్ళు ధారాపాతంగా కారాయి.

అమ్మ పరిస్థితి పాంచజన్యకు ఎంతో దుఃఖాన్ని కలిగిస్తోంది.

వెన్నులో వచ్చిన కురుపు తగ్గడంలేదు. దానికి ఆపరేషను చేస్తే నడుములో కీలకమైన నరాలు తెగిపోయే ప్రమాదం ఉందని వైద్యులు చెప్పారు.

అందువల్ల ఆపరేషను చేయడానికి కుదరడంలేదు.

రోజురోజుకు ఎక్కువ అయిపోతున్న బాధతో అమ్మ విలవిల్లాడిపోతోంది.

విశాఖపట్నంలో ఒక వైద్యుడు ఆపరేషను చేయగలిగితే పర్వాలేదు. ఒకవేళ ఆపరేషను ఫెయిల్ అయితే పరిస్థితి క్లిష్టంగా తయారవుతుంది" అన్నాడు.

"ఏం చేయాలి?"

"నొప్పిని భరించడానికి అవసరమైన పెయిన్ మేనేజ్‌మెంటు చికిత్సలు చేయించాలి. అంతకన్నా ఏమీ చేయలేం" అన్నాడు.

స్పెషలిస్టు డాక్టరు ఆ విధంగా చెప్పడంతో రమణి చాలా నిరాశ చెందింది.

ఆ విషయం కొడుకు పాంచజన్యకు తెలిస్తే వాడు ఎక్కడ విలవిల్లాడిపోతాడో అని మనసులోనే ఉంచుకుంది. "పర్వాలేదు మందులు వాడితే తగ్గిపోతుంది. డాక్టరు చెప్పాడు" అని సర్ది చెప్పేది.

అమ్మ బాధను చూడలేక పెయిన్ మేనేజ్‌మెంటు డాక్టరు ప్రవీణ్‌ని కలుసుకున్నాడు. అతను పాంచజన్యకు అన్ని విషయాలను వివరించాడు.

డాక్టరు మాటలు విన్న తర్వాత పాంచజన్య మనసు మొద్దుబారిపోయింది.

అమ్మను ఎలాగైనా రక్షించుకోవాలన్న పట్టుదల అతనిలో పెరిగిపోయింది.

ఏజన్సీలో చింతపల్లి దగ్గరలో మూలికలతో పసరు మందు ఇస్తున్నారన్న సమాచారం తెలుసుకుని అక్కడికి వెళ్ళాలని అనుకున్నాడు.

కొత్తగా ఉద్యోగం వచ్చింది సెలవులు దొరికే అవకాశం లేదు.

కంపెనీ మేనేజరును కలుసుకున్నాడు. అమ్మ దగ్గర తాను ఉండవలసిన పరిస్థితిని వివరించి చెప్పాడు. సెలవు కావాలి. లేదా ఉద్యోగాన్ని మానేస్తానని" అన్నాడు.

"దగ్గరలో ఎవరూ లేరా?"

"అమ్మ టీచరుగా అక్కడ పనిచేస్తోంది. నేను ఒక్కడినే సంతానం. నాన్న కూడా దూరంగా ఎక్కడో ఉద్యోగం చేస్తూ వారానికి ఒకసారి వస్తుంటారు. అమ్మకు అక్కలున్నారు. కానీ వారి కుటుంబాలు వారికి ఉంటాయి కదా. అనారోగ్యంతో రోజూ బాధపడుతోంది. చాలామంది వైద్యుల్ని సంప్రదిస్తున్నాం. కానీ ఫలితం ఉండటంలేదు. అమ్మ దగ్గర నేను ఉండవలసిన పరిస్థితి ఉంది. అందుకే ఉద్యోగాన్ని మానేయాలని అనుకుంటున్నాను."

మేనేజరు తనకన్నా పై స్థాయిలో ఉన్నవారికి ఫోన్లు చేసాడు.

"మా అమ్మ కూడా నా చిన్నతనంలోనే అనారోగ్యంతో చనిపోయింది. అమ్మ సెంటిమెంటుకు నేను ఏమీ అనలేను. నా స్థాయిలో నేను నీకు చేయగలిగింది. వర్క్ ఎట్ హోం అనే సదుపాయం మాత్రమే"

"థాంక్యూ సార్" అన్నాడు.

"ప్రత్యేక అనుమతితో ఈ సదుపాయాన్ని నీకు కల్పిస్తున్నాం. ఆఫీసులో నువ్వు చేసే పనిని మీ ఇంటిలో చేయాలి. కంపెనీ లేప్‌టాప్ నీతో తీసుకుని వెళ్ళవచ్చు. నువ్వు ప్రతిరోజూ నీ వర్కుని మెయిల్ చేయవలసి ఉంటుంది. ఈ విధంగా చేయడంవల్ల నీ జీతంలో ఎటువంటి తేడా ఉండదు. మూడునెలల్లో నువ్వు వెనక్కి రావలసి ఉంటుంది" అన్నాడు.

పాంచజన్య ఎంతో ఆనందించాడు. "మీరు కల్పించిన అవకాశం చిన్నది కాదు. ఇంటివద్ద నుంచి పని చేసుకోవడానికి అవకాశం కల్పించడం వల్ల మా అమ్మగారిని బాగా చూసుకోగలవన్న నమ్మకం కలుగుతోంది" అన్నాడు.

తర్వాత బేగ్ పట్టుకుని బెంగుళూరు నుంచి విశాఖ వచ్చాడు.

వచ్చినప్పటినుంచి అమ్మ గురించే ఆలోచన.

అమ్మకు బాధలేకుండా చూసుకోవాలి. మంచి డాక్టరుకి చూపించాలి ఇదే ఆలోచనతో నిరంతరం గడిపేవాడు.

ఆ సమయంలో చింతపల్లి పడాల్ గురించి ఎవరో చెప్పారు.

చింతపల్లి అడువుల్లో వెదురుపాకలు అనే గ్రామం ఉంది. ఆ గ్రామంలో గత కొన్నితరాలుగా ఒక గిరిజన తెగకు చెందిన కుటుంబీకులు పసరు మందు ఇస్తుంటారు. చిన్న డబ్బాతో ఆ మందు వంద రూపాయలు మాత్రమే. కానీ మందుకోసం వెళ్ళడం చాలా కష్టం.

ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 2గంటలవరకు మాత్రం ఇస్తారు.

రెండు గంటలలోపు మందు అందకపోతే మరుసటిరోజు ఉదయం వరకు అక్కడే ఉండిపోవాలి. ఆ మందుకు మంచిపేరు ఉంది. చాలామంది వెళ్ళి తెచ్చుకుంటారు.

ఆ రోజు అమ్మతో చెప్పాడు "అమ్మా. రేపు చింతపల్లి దగ్గర. ఏజన్సీలో కొంగపాకలు గ్రామానికి వెళుతున్నాను. అక్కడ కురుపుకు సంబంధించిన నొప్పులు తగ్గడానికి పసరు మందు తీసుకుని వస్తాను."

"అంత దూరం ఎలా వెళతావు?"

"మధ్యాహ్నం రెండు గంటలకు విశాఖపట్నంలో బస్సు ఎక్కితే రాత్రి పదకొండుగంటలకు దిగుతాను. రాత్రి చింతపల్లిలో వుండి ఉదయాన్నే కొంగపాకలు వెళతాను"

"ఎందుకు సాయీ అంత ఇబ్బంది పడటం. డాక్టరు మంచి మందులు ఇచ్చాడు వాటిని వాడుతున్నాను కదా! ఒక్కడివీ ఎలా వెళ్ళగలవు. ఎవరినైనా తోడు తీసుకుని వెళ్ళకూడదూ"

"మా అమ్మ కోసం నేనే వెళతాను" అన్నాడు పాంచజన్య.

"ఫోన్లు చేస్తుంటావు కదూ?"

"ఏజన్సీ ఏరియా కదా  ఫోను సిగ్నల్స్ పనిచేస్తాయో లేదో తెలియదు. అయినా రెండు రోజుల్లో వచ్చేస్తాను కదా?" అన్నాడు.

అమ్మ జాలి కళ్ళతో వీడ్కోలు పలికింది.

ఆ మధ్యాహ్నం చింతపల్లి బస్సు ఎక్కి కూర్చున్నాడు.

కొండల మధ్య నుంచి అడవుల మధ్యలో నుంచి ప్రయాణించి రాత్రి తొమ్మిది గంటలకు చేరింది. చుట్టూ చీకటి. బస్టాండులో చిన్న లైట్లు వెలుగుతున్నాయి. ఎక్కడ ఉండాలో పాంచజన్యకు తెలియలేదు. ఈ రాత్రి చింతపల్లిలో గడిపి తెల్లవారుఝామునే కొంగపాకలు వెళ్ళిపోవాలి అనుకున్నాడు.

పక్కన ఉన్న వ్యక్తిని "కొంగపాకలు ఎక్కడ?" అని అడిగాడు.

ఆ వ్యక్తి పాంచజన్య వైపు ఎగాదిగా చూసి "పసరు మందుకోసమా?" అని అడిగాడు.

"అవును" తలాడించాడు.

"ఉదయం ఏడుగంటలకు బస్సు ఉంది. ఆ బస్సు కూడా కొంగపాకలు వెళ్ళదు. అక్కడికి దగ్గరగా ఉన్న గూడెం వెళుతుంది. అక్కడ దిగి ఆరు కిలోమీటర్లు కొండల వెంబడి నడిచి వెళితే ఆ ఊరు వస్తుంది. అన్నీ దొరికి నడిచి వెళ్ళేసరికి ఉదయం పదకొండు గంటలు అవుతుంది. రెండు గంటల తర్వాత మందు ఇవ్వరు. ఆ రాత్రి అక్కడే ఉండిపోవాలి."

అతని మాటలు నిరాశను కలిగించాయి.

"ఏమి చేయమంటారు?" ప్రశ్నించాడు.

అతను ఆలోచించి  "ఆ గ్రామానికి  గిరిజన కార్పోరేషను వేన్ రాత్రి పదిగంటలకు వెళుతుంది. వారి వేనులో ఎక్కించుకుంటారో లేదో తెలీదు ప్రయత్నించండి" అన్నాడు.

పాంచజన్యకు సముద్రంలో దారి తప్పిన పడవకు దూరంగా మరో పడవకు సంబంధించిన వెలుగు కనిపించినట్లయింది. వేన్ వచ్చేంతవరకూ ఆగి భోజనానికి కిందకు దిగిన డ్రైవరును కలుసుకుని  తనను కొంగపాకలు తీసుకుని వెళ్ళమని అభ్యర్ధించాడు.

యాభై రూపాయలు తీసుకుని వేన్ ఎక్కించుకున్నాడు.

అన్నం తినాలని అనిపించలేదు. బేగ్‌లో బిస్కట్ పేకెట్ విప్పి తిన్నాడు.

వేన్ వెనుకకు ఎక్కి చింతపండు గోనె సంచుల పక్కన చేరబడ్డాడు.

మంచి ఉద్యోగం చేస్తూ నిరంతరం విమానాల్లోనే ప్రయాణించే పాంచజన్యకు ఈ అనుభవం కొత్తగా ఉంది. అమ్మకోసం ఎంత కష్టమైనా భరించాలన్న ఆలోచన అతని మనసుకు ధైర్యాన్ని కలిగించింది.

ఉదయం మూడు గంటలకు కొంగపాకల్లో వేన్ డ్రైవరు దించాడు.

"గెడ్డ దాటుకుని వెళితే పెద్ద తోట కనిపిస్తుంది. ఆ తోటలోనే మూలికలు ఇస్తారు" ఎవర్నీ అడిగే శ్రమ లేకుండానే ముందుకు కదిలాడు.

వాటర్ బాటిల్‌లో నీటితో మొహం కడుక్కున్నాడు.

సెల్‌ఫోనులో ఉన్న చార్జీ ఆధారంగా ముందుకు కదిలాడు.

**దూరంగా** తోట కనిపించింది. తోటలో దీపాలు మినుకు మినుకుమంటున్నాయి. కొంతమంది గిరిజనుల గుడిసెలు దూరంగా కనిపిస్తున్నాయి.

"మందుకోసం లైను. కాని తెల్లవారిన వెంటనే మందుతో బయలుదేరిపోవాలి" అనుకుని ముందుకు సాగాడు.

అప్పటికే ఈ ఆశ్రమం ముందు లైను వుంది. ముందురోజు సాయంత్రం వచ్చిన వారు వరుసగా కూర్చున్నారు. కొంతమంది లైనులోనే దుప్పట్లు కప్పుకుని పడుకున్నారు. వారిని లెక్క వేస్తే ముప్పయి నలభైమంది ఉన్నారు. వారి వెనుకగా తన బేగ్‌ను పెట్టి కూర్చున్నాడు.

కింద గడ్డి ఉన్నప్పటికీ చిన్న చిన్న రాళ్ళు గుచ్చుకుంటున్నాయి.

తన ముందున ఒక వృద్ధురాలు కూర్చుని ఉంది. ఆమె ఒరిస్సా ప్రాంతం నుంచి వచ్చినట్లు చెప్పింది. ఆమె ముందున వున్నవారు కూడా చాలా చాలా దూరప్రాంతాలనుంచి వచ్చినట్లు గుర్తించాడు. అంటే ఈ మందుకు ఎంతో పవర్ వుండటం వల్లే అంతంత దూరం నుంచి వస్తున్నారన్న విషయం పాంచజన్యకు అర్థమైంది. "ఈ మందుతో అయినా అమ్మకు తగ్గిపోతే అంతే చాలు" అనుకున్నాడు.

ఆలోచిస్తుండగానే కళ్ళు వాలిపోయాయి.

చీకటి.. అడవి దోమలు వాతావరణం చాలా ఇబ్బందికరంగా ఉంది. అమ్మ కోసం ఈమాత్రం కష్టపడలేనా అనుకున్నాడు. తన మాతృమూర్తి కోసం ఎటువంటి ఇబ్బందులనైనా అధిగమించాలని అనిపిస్తోంది.

తూరుపు తెలవారుతుండగా తెలివి వచ్చింది.

తమ స్థలాలు ఎవరైనా ఆక్రమిస్తారేమోనని చాలామంది వాటిని తమ ముందువారికి వెనుక వారికి అప్పగించి దూరంగా ఉన్న సెలయేరు వద్దకు కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళుతున్నారు. మళ్ళీ వచ్చి తమ స్థలాల్లో కూర్చుంటున్నారు.

ఆ తర్వాత పాంచజన్య వెనకకు మరికొంతమంది వచ్చిచేరారు.

రెల్లు గడ్డితో కట్టిన చిన్న శాలలో మందులు ఇస్తున్నారు.

పాంచజన్య వంతు వచ్చేసరికి మధ్యాహ్నం పదకొండుగంటలైంది.

అంతవరకూ ఏమీ తినలేదు. ఉదయం తాను తీసుకుని వెళ్ళగా మిగిలిన బిస్కట్లు తిన్నాడు. డికాషన్ మాదిరిగా ఉన్న టీ తాగాడు.

కొండదొరకు అమ్మ గురించి అన్ని విషయాలు చెప్పాడు.

"రాచపుండు అంటారు దొరా! పూర్వం రాజులకు వస్తే తగ్గించుకోవడానికి మూలికల వైద్యం చేసేవారు. మందు ఇస్తాను" అంటూ రెండు పేకెట్లు పొడరును అందించాడు గోధుమ పిండి మాదిరిగా ఉంది. జాగ్రత్తగా అందుకున్నాడు.

"మూలికలను గుండ చేసి తయారుచేసింది. దీనిని వేడినీటిలో మరగనివ్వాలి. చల్లారిన తర్వాత మూడురోజులపాటు రోజుకొక గ్లాసు తాగాలి. అయిపోయిన తర్వాత మళ్ళీ మరిగించుకోవాలి" దొర సూచనలు ఇచ్చాడు.

జేబులోనుంచి అయిదువందల నోటు అందించి ఉంచుకోమన్నాడు.

"వద్దు దొరా వందకన్నా ఎక్కువ తీసుకుంటే పనిచేయదు దొరా" అంటూ నాలుగువంద రూపాయల నోట్లు అందించాడు.

తీసుకుని గ్రామ సరిహద్దు వద్దకు వచ్చాడు.

మూలికల మందు తీసుకున్నవారు. కొంతమంది అక్కడ ఉన్నారు. ఆ రూటులో వేనులు తిరుగుతుంటాయి. వాటికోసం ఎదురు చూస్తున్నారు.

గంట తర్వాత లోడు వేను వచ్చింది. రకరకాల వస్త్రాలు వేసి వున్నాయి.

అందరూ పొలోమని ఎక్కారు. పాంచజన్య కూడా వారితోపాటు ఎక్కాడు.

బట్టలు మాసిపోయాయి. సరైన తిండిలేదు. చింతపల్లి వచ్చిన తర్వాత హోటల్‌లో టిఫిన్ తిన్నాడు అప్పుడు కాస్త నెమ్మదించింది.

రాత్రిపూట బస్సు సర్వీసులు ఉండవని అన్నారు.

ఎలాగైనా ఇంటికి చేరిపోవాలి. అమ్మకు ఈ మందు తినిపించాలి అన్న ఆతృత పాంచజన్య మనసంతా నిండిపోయింది.

రాతి పదిగంటల సమయంలో భద్రాచలంలో బయలుదేరిన లారీ ఒకటి చింతపల్లిలో ఆగింది. నర్సీపట్నం వరకు వెళుతుందని చెప్పాడు. వందరూపాయలు అతని చేతిలో పెట్టి కేబిన్‌లో ఎక్కి కూర్చున్నాడు.

లారీ నర్సీపట్నంలో ఆగేసరికి తెలవారిపోయింది. బస్టాండుకు వెళ్ళి నాన్‌స్టాప్ బస్సుని పట్టుకుని విశాఖ చేరిపోయాడు.

అమ్మ తనకోసం ఎదురు చూస్తోంది.

"నాన్నా! ఎప్పుడు తిన్నావో స్నానం చెయ్యి వడ్డిస్తాను."

"మొన్న మధ్యాహ్నం నువ్వు పెట్టిన అన్నం అంతేనమ్మా" అన్నాడు.

రమణి కళ్ళల్లో కన్నీళ్ళు. "ఎన్ని కష్టాలు వచ్చాయిరా నాయినా?"

"నా గురించి ఆలోచించకమ్మా నీకు మంచి మందు తెచ్చాను. కొండదొర చాలాగొప్పవాడనుకుంటాను. చాలామంది దూరప్రాంతాలనుంచి కూడా వస్తున్నారు."

స్నానం చేయగానే కంచంలో వేడివేడి అన్నం ఎదురుచూస్తోంది.

"నేను తినిపిస్తాలే" అంటూ పాంచజన్యకు ఇష్టమైన పుల్లమామిడి కాయ పప్పు బంగాళదుంప వేపుడుతో అన్నం తినిపించింది.

అమ్మ అలా అనగానే పాంచజన్య ఏమీ అభ్యంతరం చెప్పలేదు.

అమ్మ అన్నం తినిపిస్తానని ఎప్పుడో కానీ అలా అనదు. అప్పుడప్పుడు కలిసి తింటున్నప్పుడు "నీకు ఆవకాయ కలుపుకోవడం రాదు" అంటూ కలిపిన ముద్ద నోట్లో పెట్టేది. అంతే. ఇప్పుడు ఏకంగా మొత్తం అన్నం తినిపించింది.

జీవితం పదేళ్ళ వెనక్కి వెళ్ళిపోయినట్లుగా అనిపించింది.

మధ్యాహ్నం గంట పడుకున్న తర్వాత లేచి మందును కలిపాడు.

దగ్గరుండి అమ్మతో తాగించాడు.

అరగంట తర్వాత "ఎలా ఉందమ్మా? తగ్గినట్లుగా ఉందా?" అడిగాడు.

"మందు వేసుకుని గంట కాలేదు. అప్పుడే తగ్గిపోతుందా?"

మందును నాలుగైదుసార్లు కలిపాడు.

కలిపిన ప్రతిసారీ మూడురోజులకు వచ్చేది.

అమ్మ మంచం ఎదురుగా టేబుల్ పెట్టుకుని అక్కడ లాప్‌టాప్ సెట్ చేసాడు.

పడుకునే అమ్మ కబుర్లు చెప్పేది.

వంట చేయడానికి ఒక మనిషి, అమ్మ అవసరాలు చూడటానికి మరోమనిషిని ఏర్పాటు చేయడం వల్ల ఆమె పనులు చేసుకోవడం సులభం అయ్యేది.

రెండవసారి మందు తెచ్చే అవసరం లేకపోయింది. కొంగపాకలు వెళ్ళాలని అనుకున్నాడు.

"సాయీ నువ్వు అంతదూరం వెళ్ళవద్దురా. నువ్వు ఎదురుగా వుంటే నాకు ఎంతో సంతోషంగా సుఖంగా వున్నట్లుగా ఉంటుంది. ఎందుకో ఆ మందు వేసుకుంటున్నా బాధ బాధ తక్కువగా అనిపిస్తోంది కానీ తగ్గినట్లు ఉండటంలేదు"

అమ్మమాట ఆచరించాలని అనుకున్నాడు.

మందుకోసం మళ్ళీ వెళ్ళకుండానే అమ్మ ఆరోగ్యం మరింత క్షీణించిపోయింది. ఇంతకు ముందు తన పని తాను చేసుకునేది. కానీ అలా చేసుకోవడానికి కూడా అవకాశం లేకుండా మరింత నీరసించి పోయింది.

అమ్మ గురించి ఆలోచిస్తూ నిద్రలోకి జారిపోయాడు.

తెల్లారిపోయింది.

ఆసుపత్రిలో ఒక్కసారి ఉలిక్కిపడినట్లు నిద్రలేచాడు పాంచజన్య. ఉదయం లేచిన తర్వాత చూస్తే అమ్మ తనవైపే చూస్తోంది.

వెంటనే లేచి మంచం మీద పడుకున్న అమ్మను పక్కనున్న బాత్‌రూంకు తీసుకుని వెళ్ళి బ్రష్ చేయించాడు పాంచజన్య.

నిస్సత్తువతో ఉన్నప్పటికీ కొడుకు సాయంతో పనులన్నీ చేసింది.

నర్సు సాయంకోసం రూంలోకి వచ్చింది. ఆమెను చూస్తూ "బాబు ఉన్నాడులే" అంది అమ్మ.

"అమ్మా కాఫీ తాగుతావా? తెస్తాను."

"నువ్వు నా పక్కనే కూర్చోరా సాయీ. డాడీ తీసుకుని వస్తారులే"

నాన్న కుర్చీలోంచి లేచి పక్కనున్న కేంటిన్‌కి వెళ్ళి ఫ్లాస్కుతో కాఫీ తెచ్చాడు.

అమ్మకు కాఫీ తాగించాడు. "బాబూ నువ్వూ తాగకూడదూ..!? బాగుంది" రమణి కొడుకు పాంచజన్యను అడిగింది.

పాలు తప్ప ఏమీ తాగని కొడుకు సంగతి తెలిసి కూడా ఎందుకో అడిగింది. పాంచజన్యకు కాఫీ తాగడం ఇష్టంలేదు. అయినా తల్లి కోరిక మేరకు కొద్దిగా తాగాడు.

"రమణీ ఎలా వుంది? బాగా నీరసంగా కనిపిస్తున్నావు?" నాన్న అమ్మతో అనునయంగా అన్నాడు.

రమణి ఏమీ మాట్లాడలేదు. ఆమె శరీరం బాధపడుతోంది. మనసు కూడా కాస్త బాధపడింది. "అవునండీ బాగా నొప్పిగా వుంది. నడుంని ఎవరో శూలాలతో గుచ్చేస్తున్నట్లుగా వుంది. పగవారికి కూడా ఈ బాధ వద్దు" మెల్లగా అంది. ఆమె మొహంలో తెలియని బాధ.

అమ్మ మాటలు వింటుంటే మనసు వికలం అయిపోయింది.

"కుర్తాళం స్వామి గారిని మరోసారి కలుద్దాంలే అమ్మా."

కుర్తాళం స్వామి ఎవరో ఏమిటో తెలియదు. లలిత పీఠానికి ఆరు నెలలకు ఒకసారి వస్తుంటారు. చాలామంది భక్తులు, శిష్యులు అతనికి ఉన్నారు. ఆయన వచ్చారంటే చాలామంది ఆయన్ని కలవడానికి వెళతారు. స్వామి ఆశీర్వచనం తీసుకుంటారు. ఆయనకు అన్ని విషయాలు తెలుసునని భక్తులు నమ్ముతారు.

మూడు నెలల క్రితం అమ్మ స్వామిని కలిసిన సంగతి గుర్తుకు వచ్చింది.

ఆయన వచ్చినప్పుడు ఏర్పాట్లను చూసే సరస్వతి అనే భక్తురాలిద్వారా వెళ్ళారు. ముందుగా ఏదో యాగం చేయాలని ఆమె అన్నారు. అందుకోసం రకరకాల సామాన్లు కొని పాంచజన్య అందించాడు. ఉదయం ఆరునుంచి మధ్యాహ్నం రెండు వరకు ఏమీ తినకుండా అమ్మ నిష్ఠతో కూర్చుని వారు చెప్పిన విధంగా నిర్విఘ్నంగా చేసింది. దానిని మృత్యుంజయ యాగం అంటారట. తర్వాత స్వామి ఒక మంత్రాన్ని అమ్మ చెవిలో చెప్పారు. లక్షసార్లు దానిని నోటిలో జపించాలని అన్నారు. అలా చేస్తే మంచి జరుగుతుందని కర్మానుభవం తగ్గుతుందని చెప్పారు.

అలా అయిపోయిన తర్వాత స్వామివారితో మాట్లాడాలని అమ్మ అడిగింది.

భక్తులందరూ వెళ్ళిపోయిన తర్వాత స్వామి అవకాశం కల్పించి "చెప్పమ్మా" అని కొంతసేపు ఆగి "నువ్వు దేనిగురించో చాలా ఆందోళన పడుతున్నావు?" అన్నారు. నెమ్మదిగా కుర్తాళం స్వామి.

"అవును స్వామి."

స్వామి రమణి వైపు సాలోచనగా చుస్తుండగా రమణి ఆయనతో "స్వామీ నాకు ఏదో భయం కలుగుతోంది. నేను తొందరగా చనిపోతానని అనిపిస్తోంది. నాకు ఇంకా కొన్నిరోజులు బతకాలని ఉంది" అంది. అలా అంటున్నప్పుడు ఆమె కంటి నుంచి కన్నీళ్ళు జలజలా కారాయి.

పాంచజన్య దూరంగా ఉన్నాడు. కుర్తాళం స్వామి ఏమీ మాట్లాడలేదు. తర్వాత పక్కన ఉన్న సరస్వతివైపు చూసారు.

"ఈవిడకు కొడుకు అంటే పంచప్రాణాలు. తాను లేకపోతే వాడు ఏమైపోతాడో అని బాధపడుతోంది. భయపడుతోంది"

"ఈ లోకంలో కొద్దిరోజులు ఉండటానికి భగవంతుడు ఈ శరీరాన్ని ఇచ్చాడు. చావు అనేది అందరికీ ఉంటుంది. మీరు నేను అందరూ ఎప్పుడో ఒకప్పుడు చనిపోవలసిందే బాధపడకూడదు."

"నా బాధ నా గురించికాదు స్వామీ."

"మరి?"

"మా అబ్బాయి గురించి. వాడికి లోకం పోకడ ఏమీ తెలియదు. అమ్మ తప్ప ఈలోకంలో వాడికి మరేదీ అవసరం లేదన్నట్లుగా ఉంటాడు. నేను లేకపోతే వాడు ఏమైపోతాడో అని ఆందోళనగా ఉంది. అంతే స్వామి. నా జీవితంలో అన్నీ చూసాను కానీ వాడికి నా ప్రేమను మాత్రం పూర్తిగా అందించలేదు" మెల్లమెల్లగా రమణి చెప్పింది. అలా చెబుతున్నప్పుడు ఆమె గొంతులో అదోలాంటి బాధ ధ్వనించింది.

గది బయట ఉన్న పాంచజన్యకు అన్నీ వినిపిస్తున్నాయి. స్వాం ఏమి చెబుతారా అని చెవులు రిక్కించాడు.

కుర్తాళం స్వామి ఏమీ చెప్పలేదు. "మృత్యుంజయ మంత్రం చెప్పాను కదా నిష్టగా లక్షసార్లు మనసులో అనుకో తల్లీ మంచి జరుగుతుంది" అన్నారు.

"రండమ్మా వెళదాం. స్వామి లోపలికి వెళతారు" సరస్వతి చెయ్యిపట్టుకుని లేపి రమణిని బైటకు తీసుకుని వచ్చింది.

"నాన్నా ఎక్కడున్నావు?" రమణి ఆతృతగా అడిగింది.

స్వామితో మాట్లాడిన మాటలు కొడుకు విన్నాడేమోనన్న సందేహం రమణికి కలగకుండా "ఆ పక్కన ఎవరితోనో మాట్లాడుతున్నాను" అన్నాడు పాంచజన్య.

అమ్మ ప్రశ్నకు స్వామి ఎందుకు సమాధానం చెప్పలేదో పాంచజన్యకు అర్థంకాలేదు. ఉద్యోగంలో చేరి బెంగుళూరు వెళ్ళే హడావుడిలో ఆ విషయం మరిచిపోయాడు.

మంచం మీద పడుకున్న అమ్మను చూస్తే ఎప్పుడో జరిగిన విషయం ఇప్పుడు గుర్తుకొచ్చింది. అందుకే కుర్తాళం స్వామిని మరోసారి కలుద్దామని అన్నాడు.

నర్సు వచ్చింది. మళ్ళీ కొన్ని చెకప్‌లు చేసింది. బీపీ చూసింది. ఈసీజీ తీసుకుంది. తర్వాత నాన్నవైపు చూస్తూ "ఈ రోజు మరో రూంలోకి మార్చవచ్చు. డాక్టరుగారు అరగంటలో రౌండ్సుకు వచ్చినప్పుడు చెబుతారు."

"ఈ రూం బాగుంది కదా?" రమణి అడిగింది.

"ఆసుపత్రిలో అన్ని రూములూ బాగుంటాయి. కానీ డాక్టర్లు చెప్పినట్లు మనం వినాలి కదా!" అంటూ బైటికి వెళ్ళిపోయింది.

"అమ్మా నిన్నటినుంచీ ఏమీ తినలేదు. నీరసంగా వున్నావు. టిఫిన్ తీసుకుని వస్తాను" అన్నాడు పాంచజన్య.

"నాకు హోటల్లో టిఫిన్ తినడం అంటే ఇష్టం ఉండదు కదా?"

"ముందు ఆకలి తీర్చుకోవాలి. ఇష్టంలేకపోవడం అనుకోకూడదు. ఆసుపత్రిలో ఉన్నావు కాబట్టి ఇష్టమున్నా లేకున్నా నీరసం రాకుండా ఏదైనా తినాలి."

కొడుకు కోపం చూసి రమణి చిన్నగా నవ్వింది.

"నా మొండితనమే నీకు వచ్చిందిరా" అంది.

"మొండితనం అనుకోవడం ఎందుకు? నువ్వు తినకపోతే మాకు ఎంత బాధగా ఉంటుందో తెలుసా? కాస్త తింటే టేబ్లెట్సు కూడా వేసుకోవచ్చుకదా?" నాన్న మెల్లగా చెబుతూ రమణిని అనునయించాడు.

"నాన్నా అమ్మ దగ్గరే ఉండు. టిఫిన్ తీసుకుని వస్తాను."

"మీరు వెళ్ళవచ్చు కదండీ అన్ని పనులకూ వాడే తిరుగుతున్నాడు. మీరేమో ఉద్యోగం అంటూ ఎక్కడో ఉండి చుట్టపుచూపుగా వస్తుంటారు" అంది కాస్త సీరియస్‌గా.

"బాబూ నిన్ను అమ్మ వదిలిపెట్టదు. నీతో ఏ పనులూ చేయనివ్వదు. నేను వెళ్ళి తెస్తానులే. నువ్వు అమ్మ పక్కనే ఉండు" అంటూ నాన్న బైటికి వెళ్ళిపోయాడు.

నాన్న బైటికి వెళ్ళిన వరకు ఆగి "సాయీ. నా పక్కన కూర్చోవా?"

పాంచజన్య లేచి తల్లి తలపక్కన కూర్చున్నాడు. "అమ్మా నడుం నొప్పి అంటున్నావు కదా పెయిన్ బాం రాయమంటావా?" అడిగాడు.

"వద్దులే నాన్నా. నువ్వు నా పక్కన కూర్చుంటే నాకు జబ్బు సగం తగ్గిపోతుంది"

అమ్మ అలా అంటుంటే చాలా ముద్దొచ్చింది. మంచం మీదకు వంగి నుదుటి మీద ముద్దుపెట్టుకున్నాడు.

"నీ ప్రేమతో ఎక్కడలేని శక్తి వచ్చేసిందిరా. నీకూ శక్తి ఇస్తాను దగ్గరకు రా" ఆప్యాయంగా పిలిచింది.

పాంచజన్య దగ్గరికి వచ్చి తన బుగ్గను అందించాడు. కొడుకుని బలంగా ముద్దుపెట్టుకుంది.

**అమెరికా** నుంచి మాధవి ఫోను చేసింది.

పాంచజన్యకు మాధవి అక్క అవుతుంది.

పదేళ్ళ క్రితం భర్త ఉద్యోగ రీత్యా అమెరికా వెళ్ళిపోయి అక్కడే ఉంటోంది.

తల్లి అనారోగ్యం పెరిగిపోవడం నడుం కిందన ఉన్న కురుపు తగ్గకపోవడం వల్ల అమెరికాలో వైద్యం చేయిస్తే బాగుంటుందేమో అనుకున్నారు.

ఆ విషయం అక్క మాధవితో చెప్పాడు.

"వైద్య రంగంలో ఎన్నో పరిశోధనలు చేసే అంతర్జాతీయ పరిశోధనా కేంద్రం అమెరికాలో మిన్నిసోటా ప్రాంతంలో ఉంది. దాని పేరు మాయో అక్కడ రమణికి వచ్చిన కురుపుకు సంబంధించిన విషయాలు పంపిస్తే ఫలితం ఉండవచ్చు" అంది.

చీకటిలో చిరుదీపం కనిపించినట్లు అయింది.

పాంచజన్య తల్లికి సంబంధించిన రిపోర్టులు ఇతర వివరాలు డాక్టరు రాసిన ప్రిస్కిప్షన్లు రెడీ చేసాడు. నొప్పి వస్తున్న శరీర భాగానికి బయాప్సీ చేయించి ఆ రిపోర్టు కాగితాలు, సీడీని కూడా పంపించాడు.

మాధవి వాటిని ఆ ఆసుపత్రి ఛీఫ్‌ను కలిసి అందించింది.

వారం తర్వాత వారు మాధవికి ఎపాయింటుమెంటు ఇచ్చారు.

"కురుపుకు సంబంధించిన కణం శరీరంలో వ్యాప్తి చెందుతోంది. దీనిని నివారించడానికి ఆ ప్రాంతంలో ఆపరేషను చేయాలి. ఎలా ఉంటుందో తెలియదు. కానీ ప్రయత్నం చేస్తాం" అన్నారు.

"ఆపరేషనుకు పరిశోధనా ప్రక్రియకు రెండు నెలలు సమయం పడుతుంది. భారతదేశ కరెన్సీలో రెండు కోట్లరూపాయలు ఖర్చు అవుతుంది. ఇందుకోసం రమణితో సహా అమెరికా రావాలి. ప్రయత్నం వరకు జరుగుతుంది సక్సెసు మాత్రం 50శాతం మాత్రమే అన్నారు" మాధవి ఈ వివరాలు అన్నీ ఫోనులో చెప్పింది.

వివరాలు విన్న తర్వాత పాంచజన్య మ్రాన్పడిపోయాడు.

తండ్రిని కలిసి పరిస్థితిని వివరించాడు. "ఇల్లూ, భూములు ఆస్థులు అన్నీ కలిపి అమ్మితే 80 లక్షలు వచ్చే అవకాశం ఉంది అది కూడా వెంటవెంటనే జరిగినా మూడు నెలల సమయం పడుతుంది. అమెరికా వెళ్ళడానికి వీసా పాస్‌పోర్టు తీసుకోవడానికి మరో ఆరునెలలు పడుతుంది. అంతవరకు సమయం ఉంటుందా?"

"అమ్మ మళ్ళీ పూర్వపు మనిషి కావాలంటే ఏమి చేయడానికైనా సిద్ధంగా ఉన్నాను. మన ఆస్థులన్నీ అమ్మేద్దాం" అన్నాడు నాన్న.

నాన్నకు అమ్మమీద ఉన్న ప్రేమకు పాంచజన్యకు ఏడుపు వచ్చింది.

అమ్మను ఎలాగైనా బతికించుకోవాలని మనసు తహ తహలాడుతోంది.

ఆ సమయంలో మాధవి మళ్ళీ ఫోను చేసింది. "నేనుంటున్న సిన్స్‌నాటి నుంచి మాయ ఆసుపత్రి చాలా దూరం అయినా వెళ్ళి అన్ని విషయాలు వాకబు చేసాను. పరిస్థితి సీరియస్‌గా ఉందట. రెండు నెలల్లో వచ్చి చేరాలని అన్నారు. ఏం చేద్దాం?" అంది.

"అక్కా నువ్వే చెప్పు. నాన్న తన ఆస్థుల్ని అమ్మడానికి కూడా సిద్ధమని అన్నారు. కానీ అమ్మా నాన్న ఇద్దరూ గవర్నమెంటు ఉద్యోగస్తులు. వాళ్ళు అమెరికా రావాలంటే డిపార్టుమెంటు నుంచి 'నో' అబ్జక్షను సర్టిఫికెటు తీసుకోవాలి. దాని ఆధారంగా వీసా, పాస్‌పోర్ట్ తీసుకోవాలి. సెలవులు పెట్టుకోవాలి ఇవన్నీ ఎలా అన్నదే ఆలోచిస్తున్నాను" అన్నాడు పాంచజన్య.

"తమ్ముడూ డాక్టరు చెప్పింది కూడా ఫిఫ్టీ ఫిఫ్టీ ఛాన్సు అంటున్నారు. రెండు కోట్లు సమకూర్చుకోవడం చాలా కష్టం అవుతుంది రెండు నెలలలోపు అమ్మను తీసుకుని ఇక్కడకు రావడం అసాధ్యం అవుతుంది. అందువల్ల రావాలన్న ఆలోచన మానుకో. నొప్పి తగ్గేందుకు అక్కడ ప్రయత్నాలు చేస్తే మంచిది" అంది.

"అమ్మ నొప్పితో బాధపడుతుండటం నేను చూడలేకపోతున్నాను."

ఫోనులో మాధవి గొంతు మారిపోయింది.

"సాయీ.. అన్నింటికీ ఆ భగవంతుడు ఉన్నాడు. అంతకన్నా మనం చేయగలిగింది ఏముంది?" అంది మాధవి.

మాధవి ఫోనులో చెప్పిన విషయం విన్న తర్వాత కుమిలి కుమిలి ఏడ్చాడు.

అమెరికా తీసుకుని వెళితే అమ్మను కాపాడుకోగలనా లేదా అనే విషయం ఎలా ఉన్నా మనసుకు సంతృప్తి అనేది ఉండేది కదా అనుకున్నాడు తన ఆసక్తతకు మొదటిసారి జాలి కలిగింది అమెరికా తీసుకుని వెళ్ళగలిగితే ఎంత బాగుండేది అనుకున్నాడు.

ఆ తర్వాత మళ్ళీ ఇన్నాళ్ళకు మాధవి నుంచి ఫోను వచ్చింది.

"అక్కా ఎలా ఉన్నావు?" ప్రశ్నించాడు.

"అమ్మకు ఎలా ఉంది?"

"అలాగే ఉంది బాధతో విలవిల్లాడిపోతోంది. ఆసుపత్రిలో చేర్పించాం. ట్రీట్‌మెంటు జరుగుతోంది"

"సాయీ అమ్మని నిరంతరం అంటి పెట్టుకుని ఉండు. ఏ అవసరం వచ్చినా నువ్వు అందిస్తుండు. నీ ప్రెజెన్సుని రమణి కోరుకుంటుంది"

"అలాగే అక్కా"

"డబ్బులు పంపించమంటావా?"

"వద్దక్కా నేను దాచుకున్న డబ్బులు ఖర్చు చేస్తున్నాను. నాన్న దగ్గర కూడా డబ్బులు ఉన్నాయి. బంధువులు కూడా సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. డబ్బులు కోసం కాదు. అమ్మ బాధను నేను చూడలేకపోతున్నాను."

"ఇంత దూరంలో ఉండి నేను ఊరడించలేను. కానీ నువ్వున్న పరిస్థితిని అర్థం చేసుకుంటే నాకు కూడా ఏదోలా ఉంది. బావగారు కూడా బాధపడుతున్నారు. చిన్నతనంలో నీకు ఎంత కష్టం వచ్చిందో అంటున్నారు" అంది.

పాంచజన్య ఏమీ మాట్లాడలేదు.

"తమ్ముడూ జీవితమంటే అన్నీ ఉంటాయి. కష్టాలూ సుఖాలు దుఃఖాలూ మనిషికి కలుగుతాయి. వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి అంతే"

ఫోనులో అక్కమాటలు వింటుంటే ఏడుపు వచ్చింది.

జవాబు చెప్పలేకపోయాడు.

ఫోన్ కట్ చేసాడు.

రమణిని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోకి మార్చారు. డాక్టర్ల బృందం పరీక్షలు ప్రారంభించింది. వివిధ రకాల టెస్టులు చేయడానికి సంతకాలు తీసుకున్నారు.

"నాన్నా అమ్మకు ఏమైంది? సీరియస్‌గా ఉందా? ఎందుకు అన్ని టెస్టులు చేస్తున్నారు" పాంచజన్య అడిగాడు.

నాన్న ఏమీ జవాబు చెప్పలేదు కళ్ళను నులుపుకున్నాడు.

"అడుగుతుంటే చెప్పవేం?" రెట్టించాడు.

"కార్పోరేటు ఆసుపత్రి అంటే ఇటువంటివి అన్నీ మాములే. చేరిన తర్వాత తక్కువ డబ్బులకు వీరు వదిలిపెట్టరు అవసరం లేకపోయినా రకరకాల టెస్టులు అంటారు. అందుకే ఏవేవో చేస్తున్నారు"

"నేను లోపలికి వెళతాను" అంటూ ఐ.సి.యూ రూం వరకూ వెళ్ళాడు. అక్కడున్న నర్సు మాత్రం "ఎవ్వర్నీరానివ్వద్దని డాక్టరుగారు చెప్పారు. మరో గంట తర్వాత వెళ్ళి చూడవచ్చు" అంది.

నిరాశగా వెనక్కి తిరిగి వచ్చాడు. అప్పటికే మామయ్య అత్తయ్య పల్లవి అందరూ అక్కడికి చేరుకున్నారు. నాన్నగారి ఫ్రెండ్స్ కూడా వచ్చారు.

"నాన్నా అమ్మకు ఏమీ కాదు కదా?" ప్రశ్నించాడు.

నాన్న నుంచి జవాబు రాలేదు. శూన్యం వైపు చూస్తున్నాడు.

"ట్రీట్‌మెంటు జరుగుతోంది. పరీక్షలు అయిపోయిన తర్వాత మనం వెళ్ళి చూడవచ్చు" మామయ్య అనునయించాడు.

పాంచజన్య మనసు మనసులో లేదు. ఏదో తెలియని బెంగ కమ్ముకున్నట్లుగా అయిపోయింది. నోటి వెంబడి మాటలు రావడంలేదు. గంట ముందు అమ్మకు పెట్టిన ముద్దు, అమ్మ తనకు పెట్టిన ముద్దు పదే పదే గుర్తుకు వస్తున్నాయి. హృదయమంతా బరువెక్కి పోయింది. విషయం తెలియకపోవడం వల్ల గాబరాగా ఉంది. నాన్న ఎందుకు మాట్లాడటం లేదో అర్థం కావడంలేదు.

ఎదురుగా ఉన్న ఐ.సి.యు తలుపువైపే చూస్తున్నాడు. తెల్లకోటు వేసుకున్న డాక్టరు గదిలోనుంచి బైటికి వచ్చాడు. అతని చేతిలో కాగితాలు ఉన్నాయి. టెన్షనుగా ఉన్నట్టు అతని మొహం చూస్తే తెలుస్తోంది.

"డాక్టరు ఎలా ఉంది?" ఆతృతగా ప్రశ్నించాడు.

డాక్టరు ఏమీ జవాబు చెప్పలేదు. "అమ్మకు తగ్గుతుందా డాక్టర్?" గాబరాగా పాంచజన్య అడిగాడు.

డాక్టరు పాంచజన్య వైపు చూస్తూ "పరీక్షలు జరుగుతున్నాయి. ఇంకా రిజల్ట్స్ రావాలి. వాటిని చూస్తే కానీ ఏమీ చెప్పలేం."

"రిపోర్ట్స్ ఎప్పుడు వస్తాయి?"

"గంటా రెండు గంటల్లో వస్తాయి" అంటూ నాన్నవేపు చూస్తూ "మీ టెన్షన్ అర్థం చేసుకోగలను. కానీ నేను ఏమీ చేయలేను కదా?" అంటూ ముందుకు సాగిపోయాడు.

డాక్టరు చెప్పిన మాటలకు పాంచజన్యకు అర్థం తెలియలేదు.

తండ్రివైపు తిరిగి "నాన్నా డాక్టరు ఏమంటున్నాడు" అడిగాడు.

"రిపోర్టులు వచ్చేంతవరకూ ఏమీ చెప్పలేమని అంటున్నాడు"

పాంచజన్య మనసు మొద్దుబారిపోయింది. పక్కనున్న సోఫాలో కూలబడిపోయాడు. దూరంగా తల్లిదండ్రుల వద్ద నిల్చున్న పల్లవి దగ్గరకు వచ్చి పాంచజన్య పక్కన కూర్చుని చెయ్యివేసింది.

పాంచజన్య అంత బాధలోనూ విసుగ్గా చూసాడు.

మామయ్యకూడా దగ్గరికి వచ్చి "అమ్మ క్షేమంగా బైటికి వస్తుంది. బాధపడకు పాంచజన్యా" అనునయించాడు. తర్వాత కూతురివైపు చూస్తూ "నువ్వు అమ్మ పక్కన కూర్చో" అని అక్కడి నుంచి పంపించివేసాడు.

అప్పుడు పాంచజన్య మామయ్య వైపు చూస్తూ "మామయ్యా" అంటూ చుట్టుకుపోయాడు.

పాంచజన్య ఏడుపు చూసి నాన్న దగ్గరికి వచ్చి మామయ్యను పక్కనుంచి లేపి అక్కడ కూర్చుని కొడుకుని పొదవి పట్టుకున్నాడు. అతని కళ్ళనుంచీ కూడా నీరు వస్తున్న విషయం గమనించి పాంచజన్య మరింత బావురుమన్నాడు.

"అమ్మకు ఏమీ కాదులే. భగవంతుడు మనకు అన్యాయం చెయ్యడు." కొడుకుని మరింత దగ్గరకు తీసుకున్నాడు.

పాంచజన్య తండ్రి గుండెలపై తల వాల్చేసాడు. కొడుకు తలను మరింత హత్తుకున్నాడు. అరగంట తర్వాత పాంచజన్య కాస్త స్థిమితపడ్డాడు. నాన్న ఓ మూలన కూర్చున్నాడు.

పాంచజన్య డ్యూటీ డాక్టరు దగ్గరకు వెళ్ళాడు.

అతను తలెత్తి చూసాడు. పాంచజన్య పరిస్థితి రెండు రోజులుగా గమనిస్తూనే వున్నాడు. అందుకే నెమ్మదిగా "మీ అమ్మగారు ఏమీ తినకూడదు. పరిస్థితి క్రిటికల్‌గా ఉంది. లిక్విడ్ మాత్రం సెలైన్ ద్వారా ఎక్కిస్తున్నాం" అన్నాడు.

"ఏమైంది డాక్టర్?" పాంచజన్యలో అదోలాంటి ఆతృత.

"గాబరా పడవద్దు మీ నాన్నగారికి అంతా చెప్పాం"

"ఏమి చెప్పారు?"

డాక్టరు ఏమీ సమాధానం చెప్పలేదు. రెట్టించి అడిగిన తర్వాత "రిపోర్టులు రావాలి కదా?" అన్నాడు.

నిస్త్రాణగా బైటికి వచ్చాడు.

అమ్మ ఏమీ తినకూడదు, అనే మాట పాంచజన్యకు ఏదోలా ఉంది.

తనకోసం ఎన్నోసార్లు తను తిండి మానేసింది. ఉపవాసాలు చేసింది. తనకు ఆరోగ్యం బాగోలేనప్పుడు చిన్న జ్వరం వచ్చినా ఎన్నో మొక్కులు మొక్కుకునేది. "భగవాన్ బాబుకు త్వరగా జ్వరం తగ్గిపోవాలి. అంతవరకూ ఏమీ తినను" అనుకునేది.

నాన్న ఎంత చెప్పినా వినేదికాదు. "బాబుకు చిన్న జ్వరమే కదా దానికి తినని మొక్కులు ఎందుకు? తగ్గిపోతుందిలే" అనునయించేవాడు.

"ఏమోనండీ వాడికి జ్వరం వచ్చి నీరసంగా పడుకుని ఉంటే నేను చూడలేను. వాడికి అలా వుంటే నాకు తిండి ఎలా సయిస్తుంది" అనేది.

ఆ విషయాలన్నీ పాంచజన్యకు గుర్తున్నాయి.

తన ఆరోగ్యం కోసం ఎన్నో రోజులు తిండి మానేసిన అమ్మ ఈ రోజు ఏమీ తినకుండా ఉండిపోవడం ఏదోలా ఉంది. ద్రవాహారం మాత్రం తినాలని డాక్టర్లు చెప్పడం ఆందోళనకు గురిచేసింది.

అద్దాల్లోంచి చూస్తుంటే అమ్మ పడుకుని కనిపిస్తోంది.

పక్కనుంచి వస్తున్న నర్సు దగ్గరికి వెళ్ళి "అమ్మను ఏమీ తినకూడదని డాక్టరు చెప్పారు. గ్లూకోజ్ నీళ్ళు నోటిలో పోసేదా?" అడిగాడు.

నర్సు పాంచజన్య వైపు ఎగాదిగా చూసింది.

ఆమె ఎందుకలా చూసిందో పాంచజన్యకు అర్థం కాలేదు అప్పుడు ఆమె నెమ్మదిగా అంది. "ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చేర్చారు అంటే ఆమె బాధ్యత అంతా మాదే ఆమెకు సెలైను బాటిల్ ఎక్కించాం. కడుపులోకి ఏమైనా ఇవ్వాలి. డాక్టరుగారు వచ్చి చెబుతారు. ఆయన చెప్పిన ప్రకారం మేం ఫాలో అవుతాం" అంది.

పాంచజన్య నాన్న దగ్గరికి వచ్చి పక్కన కూర్చున్నాడు.

డాక్టరు రిపోర్టులు తీసుకుని గదిలోకి వెళ్ళాడు.

పాంచజన్యకు ఆత్రుతగా ఉంది.

అయిదు నిమిషాల తర్వాత నాన్నకు పిలుపు వచ్చింది. నాన్నతోపాటు తనుకూడా లోపలికి వెళ్ళాడు.

డాక్టరు రిపోర్టులు నాలుగైదు సార్లు అటూ ఇటూ తిప్పి ఇద్దరి వైపు తిరిగాడు. ఇద్దరిలోనూ టెన్షన్ పేరుకుని పోయింది.

"ఆమె గుండె బలహీనంగా ఉంది. లివర్‌లో నీరు చేరింది. అది కిడ్నీలోకి కూడా చేరే అవకాశం ఉంది. మా ప్రయత్నాలు మేం చేస్తున్నాం. కొన్ని గంటలు గడిస్తే కానీ ఏమీ చెప్పలేం సారీ ఏమీ అనుకోవద్దు" డాక్టరు నోటి వెంబడి మాటలు నెమ్మదిగా వచ్చాయి. అవి పాంచజన్య గుండెల్లో గుచ్చుకున్నాయి.

దూరంగా ఉన్న అమ్మ మంచం మీద నుంచి తననే చూస్తోంది.

నోటి వెంబడి మాటలు రావడంలేదు డాక్టరుతో నాన్న ఏమి మాట్లాడుతున్నాడో తెలియడంలేదు. అమ్మ వైపు నడుచుకుని వెళ్ళాడు.

రమణికి దుప్పటి కప్పి ఉంచారు.

సెలైను బాటిల్ ఎక్కించి ఉంది. పల్సు చూడటానికి పక్కన ఏవో వైర్లు తగిలించి ఉన్నాయి. పైన స్క్రీనులో వరుసగా గీతలు వస్తున్నాయి.

అమ్మ పక్కన స్టూలు మీద కూర్చున్నాడు.

రమణి నిస్రాణగా ఉంది. మనిషి నీరసంగా అనిపిస్తోంది మొహంలో ఎటువంటి కళలేదు. అందంగా ఆరోగ్యంగా ఉండే మనిషిని అలా చూడటం ఏదోలా అనిపించింది. కళ్ళనుంచి నీళ్ళు వస్తున్నాయి. అయినా అమ్మకు కన్నీళ్ళు కనిపించకుండా దాచుకుంటున్నాడు.

ఈలోపు నాన్న అక్కడికి వచ్చాడు. రమణి తండ్రిని, కొడుకుని మార్చి మార్చి చూసింది.

నాన్న అమ్మ చేతిని నెమ్మదిగా నిమిరాడు. తన చేతిని ఆమె చేతిలో ఉంచి నీకు తోడుగా నేనున్నాను అనే విధంగా పట్టుకున్నాడు.

"ఊపిరి తీసుకోవడం కష్టం అవుతోంది ఆమెకు వెంటిలేటరు పెట్టాలి" డాక్టరు చెప్పాడు. అందుకోసం సంతకాలు కావాలని పిలవడంతో నాన్న అటువైపు వెళ్ళాడు.

రమణి పాంచజన్యవైపు జాలిగా చూస్తోంది. ఆమె నోరు తడబడుతోంది.

పాంచజన్య ఆమె మొహం వద్దకు మొహాన్ని తీసుకుని వచ్చాడు. ఆమె కళ్ళల్లో భావాలు కనిపిస్తున్నాయి. పెదవులు కదులుతున్నాయి.

"అమ్మా..అమ్మా... చెప్పమ్మా?" బావురుమన్నాడు.

రమణి ఊపిరి తీసుకోలేకపోతోంది. ఆయాసంతో రొప్పుతోంది.

మనసులో భావాలు నోటినుంచి రావడంలేదు. ఆమె మెదడు సంకేతాలు ఇస్తున్నా పెదవులు పలకడంలేదు. ఏదో చెప్పాలని అనుకుంటున్నప్పటికీ చెప్పలేకపోతోందని అర్థం అయింది.

పాంచజన్య కంటినుంచి కన్నీళ్ళు ధారపాతంగా కారిపోతున్నాయి.

తనకి ఊహ తెలిసినప్పటినుంచీ తల్లిని ఆ విధంగా చూడలేదు.

"మాటాడమ్మా.. అమ్మా మాట్లాడవా?" ఒక పక్క ఏడుపు ఆపుకుంటూ ఆమెను కదుపుతూ అడుగుతున్నాడు పాంచజన్య.

రమణి పెదాలు కదులుతున్నాయి కానీ మాటలు రావడంలేదు.

ఆమె పరిస్థితిని చూసి నర్సు దగ్గరికి వచ్చింది. "బాబూ మీరు బైట ఉండండి ఆమెకు వెంటిలేటరు పెట్టాలి. ఊపిరి తీసుకోవడం కష్టం అవుతుంది" అంది.

పాంచజన్య ఏడుస్తూనే ఉన్నాడు.

**ఈలోపు** నాన్న గాబరాగా దగ్గరికి వచ్చాడు. అతనితోపాటు డాక్టర్లు కూడా వచ్చారు.

అమ్మ మంచం చుట్టూ డాక్టర్లు నర్సులు. పాంచజన్యను వెనక్కి నెట్టి వారి పనులు వారు చేసుకుని పోతున్నారు.

పాంచజన్య వారిని తోసుకుని అమ్మ దగ్గరకు రాబోయాడు.

రమణి పెదాలు కదులుతూనే ఉన్నాయి. పాంచజన్యవైపు ఆశగా చూస్తూ కళ్ళను వాల్చేసింది. మూసిన కళ్ళవెంబడి నీరు కారుతూనే ఉంది.

పాంచజన్య మనసంతా వికలం అయిపోయింది. అమ్మ తనకు ఏదో చెప్పాలని అనుకుంది. కానీ చెప్పలేకపోయింది. అందుకే బాధపడింది. బాధ పడుతూ కన్నీళ్ళు కార్చింది. ఈ విషయాలన్నీ పాంచజన్య మనసును పిండేస్తున్నాయి.

"అమ్మా అమ్మా" అంటూ ఏడుస్తూనే ఉన్నాడు.

"ఈ కుర్రాడిని బైటికి తీసుకుని వెళ్ళండి" డ్యూటీ డాక్టరు ఎవరితోనో చెప్పాడు. ఇద్దరు నర్సులు పాంచజన్యను బైటికి తీసుకువెళ్ళారు.

అతని నోటి వెంబడి అమ్మ.. అమ్మ అనే రెండు పదాలు మాత్రం నిరంతరాయంగా జపం మాదిరిగా వస్తున్నాయి.

తండ్రి పాంచజన్య దగ్గరికి వచ్చి తలను గుండెలకు హత్తుకున్నాడు. అతని కంటినుంచి కూడా కన్నీళ్ళు కారుతున్నాయి.

ఇద్దరిలో మాటలు లేవు మౌనం. దుఃఖం ప్రవాహంలా ఉన్నాయి. మామయ్య మరో నలుగురు దూరంగా నిల్చున్నారు.

పాంచజన్యకు ఏమీ కనిపించడంలేదు. అమ్మ మొహమే పదే పదే గుర్తుకు వస్తోంది. ఏదో చెప్పాలన్న పెదాల కదలిక మనసంతా నిండిపోయింది. మామయ్య దగ్గరకు వచ్చాడు కానీ ఏమీ మాట్లాడలేదు.

"వెంటిలేటరు పెట్టారు" నాన్న మామయ్యతో చెబుతున్నాడు.

మామయ్యను పట్టుకుని పాంచజన్య బావురుమన్నాడు.

"ఏమీ కాదులే అన్నీ సర్దుకుంటాయి. అమ్మ ఆరోగ్యంతో తిరిగి వస్తుంది నువ్వు ఏడవకు" అనునయించాడు.

మామయ్య మాటలకు పాంచజన్య మరింత కదిలిపోయాడు.

"అమ్మా" అంటూ అతను ఏడుస్తున్న తీరు ఇతర పేషెంట్ల కోసం వచ్చిన వారిని కదిలించింది. తర్వాత నెమ్మదిగా "మా ఫ్రెండు వాళ్ళ నాన్నగారిని కూడా ఇలానే వెంటిలేటరులో పెట్టారు. తర్వాత ఆయన బతికి రాలేదు" అంటూ మామయ్యను నాన్నను పట్టుకుని ఏడవడం మొదలు పెట్టాడు. పాంచజన్యను ఊరడించడం ఎవరి తరం కావడంలేదు.

రాత్రి ఎనిమిది గంటలయింది

ఆసుపత్రి వాతావరణం నిశ్శబ్దంగా ఉంది. ఐ.సి.యు గది బైట చాలామంది కూర్చుని ఉన్నారు.

ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లోపల ఆరుగురు ఉన్నారు. అందరూ సీరియస్‌గా ఉన్నవారే. వారికి సంబంధించిన బంధువులు చుట్టాలు బైట దూరంగా ఉన్న విజిటింగు రూంలో కూర్చుని ఉన్నారు

రమణి బంధువులు తోబుట్టువులు అందరూ అక్కడే ఉన్నారు. పాంచజన్య చూపులు శూన్యంలోకి చూస్తున్నాయి.

అరగంట ముందు డాక్టరు చెప్పిన విషయం అందరిలోనూ విషాదాన్ని నింపింది. "ఆమె మరికొన్ని గంటలు మాత్రమే బతుకుతుంది. ఆమె అవయవాలు ఒకొక్కటీ పనిచేయడం మానేస్తున్నాయి. కిడ్నీ లివర్ గుండె అన్నీ చివరిస్థాయిలో ఉన్నాయి. ఆమె పరిస్థితి దారుణంగా ఉంది, చివరి ఘడియల్లో ఉంది వెంటిలేటరు ద్వారా ఆక్సిజన్ ఇస్తున్నాం. ఆమెను మాట్లాడించాలంటే గొంతులోనుంచి పెట్టిన గొట్టం తీస్తాం. అలా తీసి మళ్ళీ పెట్టేలోపల ఆమె చనిపోతుంది. లేదా ప్రాణం ఉన్నంత వరకు అలా ఉంచుదామా?" డాక్టరు నాన్నని అడిగాడు.

నాన్నకు నోటిలో నుంచి మాటలు రావడం లేదు. మనసంతా మొద్దుబారిపోయింది. ఏమీ సమాధానం చెప్పడంలేదు. కళ్ళవెంబడి నీళ్ళు ధారాపాతంగా కారిపోతున్నాయి. కొన్ని సంవత్సరాలు తనతో గడిపిన వ్యక్తి మరికొద్ది గంటల్లో ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోతుందన్న ఊహ మనసును నిలువరించడంలేదు. ఆ ఆలోచన భరించలేకపోతున్నాడు.

"రేపు మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత మంచి ఘడియలు. అంతవరకూ బతికి ఉంటే అదృష్టం." మామయ్య చెబుతూ డాక్టరు వైపు తిరిగి "వెంటిలేటరులోనే ఉంచండి" అన్నాడు గద్గదస్వరంతో.

పాంచజన్య రెండుసార్లు లోపలికి వెళ్ళాడు. తల్లి మంచం పక్కన నిలబడి ఆమెనే చూస్తూ ఉన్నాడు. దుప్పటి కప్పి ఉన్న ఆమె శరీరాన్ని నెమ్మదిగా తడుముతూ చేతులను పట్టుకుని రాస్తూ కూర్చున్నాడు.

తనకు జ్వరం వచ్చినప్పుడు రాత్రి పడుకోకుండా అమ్మ శరీరమంతా నెమ్మదిగా నిమిరేది. అలా నిమురుతున్న అమ్మ స్పర్శ తనకు ఎంతో హాయిగా అనిపించేది. అలా ఆమె తన కాళ్ళను నిమురుతూ ఉంటే ఎంతో హాయిగా అనిపించి జ్వరం తగ్గిపోయినట్లే అనిపించేది.

దుప్పటి కిందనుంచి చేతులు పెట్టి ఆమె పాదాలను కాళ్ళను మెల్లగా నిమరడం ఒత్తడం చేసాడు. అలా చేసినప్పుడు ఆమె శరీరంలో స్పందన తన శరీరానికి తెలిసేది. మరి కొద్ది గంటల్లో ఈ శరీరం ఈ భూమి మీద ఉండదు అనే ఊహ భరించలేకుండా ఉంది. అమ్మే జీవితంగా బతికిన తాను అమ్మలేకుండా ఉండగలడా? అమ్మలేని జీవితం తనకు ఎందుకు? ఈ లోకంలో తనకు అమ్మకన్నా ఎక్కువ ఏదీకాదు. అటువంటి అమ్మేలేనప్పుడు ఇంక తాను బతికివుండి ప్రయోజనం ఏమిటి? అమ్మ కోసం మంచి చదువులు చదివాడు. అమ్మ కోసం ఉద్యోగం చేసాడు. ఇప్పుడు అమ్మకోసం తాను చనిపోవాలి. అమ్మకు చావులోనూ తోడుండాలని అనుకున్నాడు.

మనసులో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి.

అన్ని విషయాల్లో అమ్మ తనకు తోడుంది. ఇప్పుడు చావులో కూడా అమ్మకు సాయం ఉండాలి. చనిపోతున్న అమ్మను ఒంటరిగా పంపించకూడదు. అమ్మకు తోడుగా తాను వెళ్ళాలి. అమ్మలేనిది తనకు బతుకెందుకు?. పరిపరివిధాలుగా ఆలోచించాడు.

అలా అనుకున్నదే తడవుగా ఒక నిర్ణయానికి వచ్చేసాడు.

మాట్లాడలేక చెబుతున్న విషయాలను మాత్రం అర్థం చేసుకోగలిగి కొన ప్రాణంతో వున్న అమ్మ చెవిలో నోరుపెట్టి "అమ్మా నాకు ఈ లోకంలో నువ్వు తప్ప మరేదీ లేదు. నువ్వు లేకుండా నేను ఈ లోకంలో ఉండలేను. నీతో తోడుగా నేనూ వచ్చేస్తాను. అమ్మా అమ్మా నీకు తోడుగా నీతోనే ఉంటానమ్మా. నీతో వచ్చేస్తానమ్మా" ఏడుస్తూ చెప్పాడు.

దూరంగా ఉన్న నర్సు పాంచజన్యను గమనిస్తోంది కానీ తల్లితో ఏమి మాట్లాడుతున్నాడో ఆమెకు తెలియడంలేదు.

పాంచజన్య మాటలు రమణిలో చలనం కలిగించాయి.

ఆమె మనసు పనిచేస్తోంది. హృదయం పనిచేస్తోంది. తనకు మృత్యు ఘడియలు దగ్గరపడ్డాయని ఆమెకుకూడా అర్థం అయిందేమో కొడుకు చెప్పిన విషయం విన్న తర్వాత శరీరం భారంగా కదిలించింది. సెలైను బాటిలు కూడా కాస్త ఊగింది.

అమ్మ కాళ్ళకు నమస్కారం చేసి బైటికి వచ్చాడు. పాంచజన్యకు ఎంతో సంతృప్తిగా అనిపించింది. తనకు జన్మను ఇచ్చి ఇరవై సంవత్సరాలు పెంచి ఉద్యోగస్తుడిగా చేసిన అమ్మకు తాను ఇచ్చే నివాళి ఇంతకన్నా ఏమి ఉంటుందని అనుకున్నాడు. మనసులో భారం దిగిపోయినట్లుగా అనిపించింది. దూరంగా ఉన్న కుర్చీలో కళ్ళు మూసుకుని కూర్చున్నాడు. పది నిమిషాల తర్వాత నాన్న గుర్తుకు వచ్చాడు.

నుదుటి మీద చేతులు పెట్టుకుని అంతా కోల్పోయినట్లు కూర్చున్నాడు.

దగ్గరికి వెళ్ళి పక్కన కూర్చుని అతనిపై చేయి వేసాడు.

కొడుకుని చూసి భోరున ఏడ్చాడు.

నాన్న అంతలా ఏడవడం తాను ఎప్పుడూ చూడలేదు. అమ్మను ఎంతో ఇష్టపడి ప్రేమించి అమ్మే లోకంగా బతుకుతున్నాడు. అమ్మకు తాను అంటే ఎంతో ఇష్టమని మరో సంతానం ఎవరైనా పుడితే అంత ప్రేమ అందించలేనని తానుకూడా ఒకే ఒక సంతానంతో ఉండిపోయాడు. తనమీద చెక్కుచెదరని ప్రేమతో ఉన్నాడు.

అటువంటి నాన్నతో ఎలా చెప్పాలి? తానుకూడా అమ్మకు తోడుగా వెళ్ళిపోతున్నానని అసలు చెప్పగలనా అనుకున్నాడు.

"నాన్నా నీకో విషయం చెప్పాలి" ఏడుస్తూ చెప్పాడు.

నాన్న అయోమయంగా తనవైపు చూసాడు.

అమ్మ చెవిలో చెప్పిన విషయాన్ని మెల్లగా చెప్పి "నాన్నా నన్ను క్షమించు నాన్నా! అమ్మ లేకుండా నేను ఉండలేను నాన్నా" గద్గద స్వరంతో చెప్పాడు.

"నేను మాత్రం ఉండగలనా?"

పాంచజన్య ఏమీ మాట్లాడలేదు

" ప్రతి మనిషి ముందు తాను ప్రేమించుకుంటాడు. కానీ అమ్మ ముందు నిన్ను తర్వాత నన్ను తర్వాతే తనను ప్రేమించుకునేది. నాకోసం అన్నీ వదులుకుని వచ్చేసింది. కుటుంబాన్ని ఎదిరించి నన్ను పెళ్ళి చేసుకుంది. ఆమె అంటే నాకు ఎంత ఇష్టమో నేను మాటల్లో చెప్పలేను. కానీ పాంచూ నువ్వు తప్పు చేసావు."

"ఎందుకు నాన్నా?"

"అమ్మ నిన్ను ఎంతో ఇష్టపడింది. ప్రేమించింది. నువ్వు ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తావని ఆశపడింది. నీ ఉన్నతిని చూడలేకపోతోంది. ఫలానా రమణి కొడుకు ఎంతో అభివృద్ధిలోకి రావాలని ఆశపడింది. అటువంటిది నువ్వు అనామకుడిలా అమ్మతోపాటు చనిపోయి తోడు వస్తానని చెప్పడం ఏ మాత్రం సమంజసం?" నాన్న చెప్పలేక చెప్పలేక చెప్పాడు.

పాంచజన్య నాన్నను చుట్టుకుని పోయాడు.

"నువ్వు ఒక్కడివే కాదు అమ్మకు నీతోపాటు నేను కూడా తోడు వస్తాను. కానీ ఆమె కోరుకున్నది అదేనా చెప్పు బాబూ."

"అందుకేనేమో నాన్నా నేను అమ్మ చెవిలో ఆ మాట చెప్పగానే అంత నీరసంలో కూడా కదిలింది. సెలైన్ బాటిల్ కూడా కదిలించింది."

"అంటే నువ్వు చెప్పిన మాట అమ్మకు ఇష్టంలేకపోయింది. అందుకే నీతో చెప్పలేక కదిలింది. తన మనసు ఇష్టపడటంలేదని బాటిల్‌ని కదిలించింది."

అంత బాధలోనూ పాంచజన్యలో అదోలాంటి భావన.

"ఏం చేద్దాం నాన్నా?"

"మళ్ళీ అమ్మ చెవిలో చెప్పు. పద వెళదాం."

ఇద్దరూ మళ్ళీ ఐ.సి.యులోకి వెళ్ళారు. రమణి మంచం వద్దకు వెళ్ళారు.

"అమ్మా...అమ్మా సాయిని వచ్చాను. అమ్మా నీ పక్కనే ఉన్నాను. నాన్న కూడా నా పక్కనే ఉన్నారు. ఇందాక నీతో కలిసి వస్తానని తెలియక చెప్పానమ్మా. నీతోపాటు నేను చనిపోనమ్మా. బాగా చదువుకుంటాను. పెద్ద ఉద్యోగం సంపాదిస్తాను. ఎన్నో మంచి మంచి పనులు చేస్తాను. సమాజంలో మంచి పేరు తెచ్చుకుంటాను. రమణి కొడుకు మంచివాడు ఉత్తముడు వాళ్ళమ్మలా సేవాగుణం కలిగినవాడు అని పేరు తెచ్చుకుంటాను. నన్ను క్షమించమ్మా" ఏడుస్తూ చెప్పాడు. చెబుతున్నప్పుడు మాటలు తడబడ్డాయి.

కొడుకు మాటలు విని రమణి కాస్త కదిలింది.

"పాంచజన్యను బాగా చూసుకుంటాను. వాడిలో నిన్ను చూసుకుంటాను. నువ్వు బాబాను ఆరాధిస్తావు. నీ మనసులో దేముడ్ని ప్రార్థించుకో. మంచి జరుగుతుంది. నీ గురించి నిరంతరం తలుచుకుంటూనే ఉంటాం. నువ్వు మా పక్కనే ఉన్నట్లు భావిస్తాం. భగవంతుడు మన కుంటుంబానికి అండగా ఉంటాడు" నాన్న ఒకోమాట రమణి చెవిలో చెప్పాడు.

తండ్రీ కొడుకులు ఇద్దరూ నిశ్శబ్దంగా నిలుచున్నారు. చేతులు జోడించి దేముడ్ని ప్రార్థించారు.

ప్రాణమున్న రమణి శరీరం కాస్త కదిలింది. ఆమె కళ్ళ వెంబడి కన్నీళ్ళు జాలువారాయి.

అంటే తమ మాటలు ఆమె ఖచ్చితంగా వింది. విని ఆనందించింది. తన ప్రతిస్పందన తెలియజేయలేక కన్నీళ్ళు కార్చింది అనుకున్నారు వాళ్ళు.

చనిపోయి తనకు తోడు వస్తానని చెప్పిన కొడుకు పాంచజన్య మనసు మార్చుకున్నాడని, ఆ మార్పుకు తండ్రే శ్రీకారం చుట్టాడన్న విషయం తనకు పూర్తిగా అర్థం అయింది.

అందుకే రమణి కళ్ళనుంచీ కన్నీళ్ళు కార్చింది. అనుకున్నారు.

ఇద్దరూ మౌనంగా బైటికి వచ్చారు.

రాత్రి పది గంటలు అయింది. ఆసుపత్రి వాతావరణం నిశ్శబ్దంగా ఉంది.

ఐ.సి.యూలో ఉన్న పేషెంట్ల కోసం వచ్చినవారు ఆ గదిలో చతికిలబడ్డారు. రమణి బంధువర్గం స్నేహితులు చాలామంది అక్కడే ఉన్నారు.

పాంచజన్య మనసు స్థిమితంగా ఉంది. అమ్మ ఖచ్చితంగా చనిపోతుంది. చనిపోవడానికి ముందు ఆమెను బాధపెట్టకుండా ఆమె మనసు సంతృప్తికరంగా తాను మాట్లాడాడు. ఆమె కోసం తాను ఏదైనా చేయాలి. వరండాలో ఒక మూల మటం వేసుకుని కూర్చున్నాడు.

చావుతో పోరాటం చేస్తూ చనిపోవడానికి ముందు చావు ఘడియల్లో తనకు స్వర్గ ప్రాప్తి కలిగించడానికి ప్రయత్నం చేయాలి.

అనుకున్నదే తడవుగా కిందన పద్మాసనం వేసి కూర్చున్నాడు. తపస్సు చేస్తున్న మాదిరిగా కళ్ళు మూసుకున్నాడు.

చిన్నతనం నుంచి అమ్మ తనకు నేర్పించిన దైవప్రార్థనలు కీర్తనలు అన్నీ మనసులో ఆలపించడం మొదలు పెట్టాడు. అమ్మ ప్రశాంతంగా చనిపోవాలని మంచి ఘడియల్లో చనిపోయి స్వర్గంలోకి వెళ్ళాలని మనఃస్ఫూర్తిగా ప్రార్థనలు చేసాడు.

ఆసుపత్రిలో ఉన్న కొంతమంది విచిత్రంగా చూసారు.

తల్లి అంటే ఆ అబ్బాయికి ప్రాణం. అందుకే ఆమె కోసం తపస్సు చేస్తున్నాడు అని కొంతమంది అంటున్నారు. పాంచజన్య వాటిని ఏమీ పట్టించుకోలేదు.

పాంచజన్యకు ఉన్న తల్లి ప్రేమ గురించి బాగా తెలుసుకాబట్టి నాన్నగానీ మామయ్యగానీ ఏమీ వారించలేదు. అందరూ నిద్రలేకుండా కుర్చీలపై కునికిపాట్లు పడుతుంటే పాంచజన్యమాత్రం తెల్లవార్లూ ప్రార్థనలు కంటిన్యూ చేసాడు.

ఉదయం నుంచీ ఏమీ తినలేదు. అయినా ఆకలి లేదు. దాహం లేదు.

అలసిపోయిన వారు అలా కళ్ళు మూసుకుని పడుకుంటే నిద్రలోకి జారిపోతారు. కానీ రెండురోజుల నుంచీ ఆసుపత్రిలో తల్లి వెంబడి ఉండి నిద్రలేకపోయినా తెల్లవార్లూ అలాగే కూర్చుని దైవ ప్రార్థన చేసాడు.

రాత్రి పడుకుని ఉదయం లేచిన వారు పాంచజన్యను చూసినవారు ఆశ్చర్యపోయారు. "రాత్రంతా బాబు తపస్సు చేస్తూనే ఉన్నాడు. తల్లి అంటే ఎంత ప్రేమో" అన్నారు.

అయినా చలించలేదు.

పాంచజన్యను మామయ్య, నాన్న వారించారు.

అయినా పూజా కార్యక్రమాన్ని కొనసాగించాడు.

**రైలు** పరుగెడుతోంది. రైలుతోపాటు పాంచజన్య ఆలోచనలు కూడా పరుగులు పెడుతున్నాయి.

తల్లి చనిపోయి ఎన్నో రోజులు కాలేదు. కర్మకాండలు పూర్తయ్యాయి. ఆఫీసుకు సెలవును పొడిగించాడు. కార్యక్రమాలన్నీ నిర్వేదంతో చేస్తున్నాడు. దేనిమీదా మనసు నిలవడం లేదు. పదే పదే అమ్మ గుర్తుకువస్తోంది.

తల్లి అస్థికలు సంచిలో పెట్టి పట్టుకున్నాడు. ఎదురుగా ఉన్న సీటులో నాన్న కూర్చున్నాడు. రైలు కాశీ వైపు పరుగులు తీస్తోంది.

"బాబూ సంచిని పట్టుకుంటాను. నువ్వు కాస్త రిలాక్సు అవ్వు" నాన్న నెమ్మదిగా అన్నాడు.

పాంచజన్య తండ్రికి సమాధానం చెప్పలేదు. సంచిని మరింత గట్టిగా పట్టుకుని ఒడిలో పెట్టుకున్నాడు. "పర్వాలేదు నాన్నా నన్ను ఇరవై సంవత్సరాలు మోసింది. కొద్దిగంటలు మోయలేనా?" అన్నాడు. అలా అంటున్నప్పుడు వాడి కళ్ళల్లో సన్నటి నీటిపొర.

ఆ సమయంలో రెట్టించడం మంచిది కాదని "సరేలే కాఫీ తాగుతావా?" నెమ్మదిగా అడిగాడు.

"కాఫీ, టీలు తాగడం మానేసాను నాన్నా. అమ్మకోసం ఆసుపత్రిలో ఒకసారి తాగాను. మళ్ళీ మరి తాగకూడదని అనుకుంటున్నాను" అన్నాడు.

వాటర్ బాటిల్ తీసి అందించాడు.

అస్థికలు ఉన్న సంచిని పొదిపి పట్టుకుని నీరు తాగాడు.

"ఉదయం పదిగంటలకు కాశీ చేరతాము"

"అవును" అన్నట్లు పాంచజన్య తలాడించాడు.

కానీ పాంచజన్య ఏమీ ఆలోచించడంలేదు. తల్లి గురించే ఆలోచిస్తున్నాడు. చనిపోయే ముందు అమ్మ తనతో ఏమి చెప్పాలని అనుకుందో అతనికి అంతు చిక్కడంలేదు. ఆ విషయాన్ని ఎలా తెలుసుకోవాలి? ఎవర్ని అడగాలి? అనుకున్నాడు.

చనిపోవడానికి ముందు తనతో అమ్మ మాట్లాడటానికి ప్రయత్నించింది. పెదాలు కదిలాయి. మాటలు మాత్రం రాలేదు. తను చనిపోతానని నిర్ధారణకు వచ్చిన తర్వాత తనతో ఏదో మాట్లాడాలని అనుకుంది. ఏమి మాట్లాడాలని అనుకుందో తెలుసుకోవాలన్న ఆసక్తి అతని మనసులో హిమాలయ పర్వతాలంత ఎత్తుకు ఎదిగిపోయింది.

ఎలా? ఎలా? ఎలా? మనసును ప్రశ్నించుకున్నాడు.

కాశీలో చాలామంది సత్సంగులు యోగులు ఉంటారని విన్నాడు. వారితో మాట్లాడితే తెలుస్తుందేమో? చిన్న ఆశ మనసులో మెరిసింది.

అందుకే అమ్మ అస్థికలు గంగానదిలో కలపాలని పట్టుబట్టి మరీ తండ్రిని కూడా తీసుకుని వచ్చాడు..

కాశీలో ఇటువంటి కర్మకాండలు చేయడానికి, పిండాలు పెట్టడానికి కొంతమంది తెలుగు తెలిసినవారు ఉంటారని వారి వివరాలు ఫోను నంబర్లను తీసుకుని వచ్చాడు.

ట్రైను దిగిన తర్వాత గంగానది తీరానికి వచ్చాడు.

"నాన్నా అమ్మకు చేయవలసిన అన్ని కార్యక్రమాలు నేను జరిపిస్తాను. నువ్వు నాకు తోడుగా ఉండు. సరిపోతుంది" అన్నాడు.

నది ఒడ్డున ఇసుకలో కమ్మల పాకతో పందిరి మాదిరిగా ఉంది. అక్కడ పూజారి ఉన్నారు. తెలుగులో బాగా మాట్లాడుతున్నాడు.

పాంచజన్య పంచె కట్టుకుని నదిలో స్నానం చేసి వచ్చి అన్ని కార్యక్రమాలు ప్రారంభించాడు.

మొత్తం కార్యక్రమం పూర్తికావడానికి గంట పట్టింది.

నాన్న పక్కనే కూర్చుని అన్నీ చూస్తున్నాడు. చనిపోయిన రమణి భర్తగా అన్ని కార్యక్రమాలు తాను జరిపించాలి. కానీ పాంచజన్య తల్లిమీద ఉన్న అపారమైన ప్రేమవల్ల తనే చేస్తానని అనడంవల్ల ఊరుకున్నాడు. ఈ విషయాలను గమనించిన పూజా కార్యక్రమాలు చేసే వ్యక్తికూడా ఆశ్చర్యపోయాడు.

"అమ్మ అంటే ఎనలేని ప్రేమ. అందుకే వాడితోనే ఈ కార్యక్రమాలను చేయించండి" అన్నాడు.

పూజారి అడిగిన డబ్బులు ఇచ్చాడు."

కార్యక్రమం పూర్తి అయింది. "పూజ చేసిన అస్థికల్ని త్రివేణీ సంగమంలో కలపండి. పుణ్యం వస్తుంది. నది తీరంలో ఉన్న పడవల వారితో మాట్లాడితే లోపలికి తీసుకుని వెళతారు" అన్నాడు పూజారి.

"నాన్నా పడవని మాట్లాడు. నది లోపలికి వెళదాం."

తల గుండు. పంచె కట్టు. చేతిలో అస్థికల్ని చూసి పడవలు నడిపేవారు అందరూ ఏకం అయిపోయారు. ఒకే మాట చెబుతున్నారు. రెండువేల రూపాయలకు మాట్లాడుకుని త్రివేణీ సంగమం వద్దకు చేరారు.

నదిలో పడవ ప్రయాణం ఒకప్పుడైతే ఎంతో ఆనందాన్ని కలిగించేది. అస్థికల్ని గంగానదిలో కలపడానికి వచ్చినందుకు పడవ ప్రయాణం యాంత్రికంగా సాగింది. అరగంట ప్రయాణించిన తర్వాత నది సంగమం ప్రాంతానికి చేరింది. అక్కడ మూడు నదులు కలుస్తున్నాయి. కలిసినట్లుగా కూడా తెలియడం లేదు. లోతు తక్కువగా ఉంటుందని అక్కడి వారు చెప్పారు. పనిమీద వచ్చిన వారు అక్కడ దిగి స్నానాలు చేస్తున్నారు. మరో పడవను లంగరు వేసి నిలుపుదల చేసారు. దానిమీద కొంతమంది కుప్పలుగా కొబ్బరికాయలు అమ్ముతున్నారు. పాంచజన్య అమ్మ రమణి పేరుతో కొబ్బరికాయ కొట్టి నదిలో విసిరాడు.

తర్వాత తలారా స్నానం చేసాడు.

పాంచజన్యతోపాటు నాన్న కూడా స్నానం చేసాడు.

తర్వాత... "అమ్మా ఈ రోజుతో నీ రుణం తీరిపోయింది. నువ్వు ఏ లోకంలో ఎక్కడున్నా నీ ఆత్మ సంతోషంగా ఉంటుందని అనుకుంటున్నాను. నీకు స్వర్గప్రాప్తి కలుగుతుందని భావిస్తున్నాను. భగవంతుడ్ని కూడా అదే కోరుకుంటున్నాను. నువ్వు ఈలోకంలో బతికిన యాభై సంవత్సరాలలో ఎన్నో మంచి పనులు చేసావు. ఎంతమందికో ఉపకారాలు చేసావు. నాలాంటి పిల్లలకు చదువులు చెప్పి ఎన్నెన్నో సహాయాలు చేసావు. అందువల్ల నీ ఆత్మ ఎంతో సంతృప్తి చెందుతుందని భావిస్తున్నాను" అంటూ నది సంగమంలో అస్థికల్ని కలిపాడు పాంచజన్య.

తర్వాత గంగానదికి నమస్కారం చేసాడు. నాన్న కూడా మనసులోనే ప్రార్ధన చేసాడు.

పడవ బయలుదేరిన ప్రాంతానికి వెళ్ళడానికి వెనక్కి తిరిగింది. ఆ సమీపంలో గంగానదీ తీరంలోనే ఉన్న కాశీ అన్నపూర్ణేశ్వరుని దేవాలయాన్ని చూడాలి. కాశీకి వచ్చినవాళ్ళు తప్పకుండా ఈ దేవాలయానికి వెళుతుంటారు. గుడికి వెళ్ళకుండా ఎలా వెళ్ళిపోతారని పడవ నడిపే వ్యక్తి అన్నాడు. పడవను వెనక్కి తీసుకుని వచ్చి రోడ్డు మార్గంలో వెళ్ళడానికి కూడా అవకాశం ఉందని కానీ ఆలస్యం అవుతుందని అన్నారు. నదిలో కొంత దూరం వెళ్ళిన తర్వాత కూడా గుడికి వెళ్ళవచ్చునని అన్నారు. అలా అన్నపూర్ణేశ్వరుని గుడికి వెళ్ళాలంటే మరో అయిదు వందలు అదనంగా కావాలనివాడు కోరాడు.

కొడుకు కోరికను కాదనకూడదని "పదబాబూ వెళదాం" అన్నాడు నాన్న.

పడవ అన్నపూర్ణేశ్వరుని గుడివైపు మరలింది.

నదిలోంచి పడవ వెళుతుంటే తీరంలో ఎన్నో ఘాట్లు కనిపిస్తున్నాయి.

వాటివద్ద చాలామంది పూజలు చేస్తున్నారు. స్నానాలు చేస్తున్నారు.

హరిశ్చంద్ర ఘాట్ సమీపంలో బహిరంగంగా శవాలను దహనం చేస్తున్నారు. వాటిని చూస్తున్నప్పుడు పాంచజన్య మనసు విచలితం అయిపోయింది.

ఆసుపత్రి నుంచి అమ్మ శవాన్ని ఇంటికి తీసుకుని వచ్చిన తర్వాత పుణ్యస్త్రీగా చనిపోయినందుకు ఎన్నో కార్యక్రమాలను చేసారు. తర్వాత శవాన్ని మహాప్రస్తానం అనే వేనులో వేసుకుని స్మశానానికి బయలుదేరారు.

తను, మామయ్య, నాన్నతోపాటు మరో నలుగురు బంధువులు, బ్రాహ్మలు మాత్రం ఉన్నారు. స్మశానంలో అమ్మ శవం కాలడం దగ్గరుండి చూసాడు. తనను కనిపెంచిన శరీరం బూడిద అయిపోయేంతవరకూ అక్కడే ఉండిపోయాడు.

శవదహనం చూసిన తర్వాత మనసంతా ఏదోలా అయిపోయింది.

శరీరంలో ప్రాణం ఉన్నంతవరకు మనిషి. తర్వాత ఎంత తొందరగా శరీరాన్ని దహనం చేయాలని అనుకుంటారు. ఎంత పెద్ద ఎంత గొప్ప వ్యక్తులు అయినా బూడిద కావాల్సిందేనా? అనిపించింది.

అమ్మ శరీరం మాయమైపోయేంత వరకూ చూస్తూనే ఉన్నాడు.

మనసులో ఒకలాంటి నిర్వేదం చీకటిలో వ్యాపించింది.

ఎవరైనా ఇంతేనా? బతికి ఉన్నంత వరకూ అన్ని వ్యామోహాలు ఆస్థులు సంపాదించుకోవడం, పొలాలు కొనుక్కోవడం, అధికారం చలాయించడం. మనిషి ప్రాణం పోయి ఈ లోకం నుంచి నిష్క్రమించిన తర్వాత ఏమీ ఉండవు. తనతో ఏమీ తీసుకుని వెళ్ళలేడు.

అమ్మ శరీర రూపం మాయం అయిపోయింది.

యాభై కిలోల బరువున్న శరీరం పిడికెడు బూడిదగా మారిపోయింది.

ఆ బూడిద కూడా నదిలో కలిసిపోయింది.

అమ్మ అంటే ఇప్పుడు ఏమీ లేదు. అంతా అయిపోయింది.

జ్ఞాపకాలలో మాత్రమే అమ్మ మిగిలి ఉంది. భౌతికంగా మాయం అయిపోయింది. జీవితం ఎంత విచిత్రమైనది అనుకుంటున్నాడు.

"సాయీ ఏమిటి ఆలోచిస్తున్నావు?" నాన్న ప్రశ్నించాడు.

అప్పుడు ఈలోకంలోకి వచ్చాడు సాయి పాంచజన్య.

"గుడికి వెళ్ళడానికి అరగంట పడుతుందా? నాన్న పడవ నడిపేవాడిని అడిగాడు. జబ్బ సత్తువతో గెడకర్రతో పడవను ముందుకు తీసుకుని వెళుతున్నాడు.

"ఆ కనిపించే మెట్ల దగ్గరికి వెళితే అక్కడినుంచి గుడి దగ్గరే"

గుడికి వెళ్ళడానికి పాంచజన్యకు మరో ఆలోచన ఉంది.

అక్కడ చిదానంద సత్సంగ్ అనే యోగిని కలుసుకోవాలన్నది ప్రధానమైన ఆలోచన. అందుకే గుడి ప్రతిపాదన చేసాడు.

గుడికి సమీపంలో ఉన్న ఘాట్‌లో పడవ ఆగింది.

"ఈ మెట్టు ఎక్కిన తర్వాత కొంత దూరం వెళితే గుడి వస్తుంది. అక్కడ అర్చన సామాన్లు కొనుక్కునే దగ్గర మీ చెప్పులూ, సామాన్లు పెట్టుకోవచ్చు. అక్కడినుంచి క్యూలో వెళితే గంటా రెండు గంటలు పట్టి దర్శనం ఆలస్యం అవుతుంది. గుడిలోకి తొందరగా వెళ్ళాలని అనుకుంటే చాంతాడంత ఉన్న క్యూ లైను మధ్యలో మనల్ని నిలబెట్టేలా చేస్తారు. ఇలా చేసేవారు నాకు తెలుసు. కానీ ఇద్దరికీ అయిదువందలు ఖర్చు అవుతుంది. ఇస్తే వెంటనే దర్శనం అయ్యేలా వారు చేస్తారు. లేదా రెండు మూడు గంటలు క్యూలో ఉండవలసి వస్తోంది." అన్నాడు పడవ నడిపే వ్యక్తి.

"అక్కడ చిదానందస్వామి ఉంటారట తెలుసా?" పాంచజన్య పడవ నడిపే వ్యక్తిని అడిగాడు.

నాన్న మాటలు రానట్లు అన్నీ నిమిత్తమాత్రుడిలా చూస్తున్నాడు.

"స్వామి పేరు తెలీదు కానీ ఒకాయన ఉన్నారు చాలామంది అతని వద్దకు వెళుతుంటారు. దర్శనానికి వెళ్ళే తోవలోనే మీరు అతగాడిని కలుసుకోవచ్చు" పడవ వ్యక్తి సమాధానం చెప్పాడు.

"బాబూ ఎవరతను ఎందుకు కలుసుకోవాలి? ముందు కాశీ అన్నపూర్ణేశ్వరుడ్ని దర్శనం చేసుకుందాం పద" నాన్న.

"నాన్నా ముందు స్వామీజీని కలుసుకోవాలి" తండ్రి జవాబుకోసం చూడకుండా ముందుకు సాగిపోయాడు.

అరగంట వేసి చూసిన తర్వాత స్వామీజీ పలకరించారు.

"స్వామీ చాలా దూరం నుంచి వచ్చాం. మా అమ్మ అంటే నాకు పంచప్రాణాలు ఇప్పుడు ఆమె ఈ లోకంలో లేదు."

"కర్మకాండల కోసం వచ్చావా నాయనా?"

"అమ్మ అస్థికల్ని గంగానదిలో కలిపాను. మీ గురించి విశాఖపట్నంలో విన్నాను. మిమ్మల్ని కలుసుకోవాలని వచ్చాను. అమ్మ కోసం తెలుసుకోవాలి"

"పోయిన వాళ్ళు అందరూ మంచివాళ్ళు."

"స్వామీ చనిపోవడానికి కొద్దిగంటల ముందు అమ్మ నాతో ఏదో మాట్లాడాలని అనుకుంది. కానీ మాట్లాడలేకపోయింది. ఆ విషయం తెలుసుకోవాలి."

కొడుకు ఎందుకు బలవంతంగా అక్కడికి ఎందుకు తీసుకుని వచ్చాడో అర్థం అయింది. ఏమీ అనలేదు.

ఎలాగూ రాత్రికి బయలుదేరాలి. అంతవరకు టైముంది అందువల్ల అన్ని విషయాలు తెలుసుకోవడంలో తప్పులేదు అనుకున్నాడు.

అప్పుడు స్వామి "అందరికీ అన్నం పెట్టే ఈ కాశీ అన్నపూర్ణ తల్లి చాలా గొప్పది. రోజూ వందలాది మంది ఇక్కడ అన్నం తింటున్నారు. అటువంటి తల్లిని ఆరాధించు మంచి జరుగుతుంది"

"అమ్మ లేని జీవితం నాకు ఎందుకు అనిపిస్తుంది. ఎందుకు బతకాలి ఏమి చేయాలి అనే ఆలోచనలు వస్తున్నాయి. నా ఇరవై సంవత్సరాల జీవితంలో అమ్మలేకుండా మిగిలిన జీవితం అంతా ఎలా గడపాలన్న ఆలోచన ప్రతిరోజూ నా మనసును తొలిచేస్తోంది. అమ్మ విషయం తమ నుంచి తెలుసుకోవాలని వచ్చాను"

"తెలుసుకుని ఏం చేస్తావు నాయనా? అమ్మంటే కనిపించే దేవత. అన్నం పెట్టే కన్నతల్లి. అందుకే అమ్మలా తయారవ్వు అంతే"

స్వామి నుంచి మరి జవాబు రాలేదు.

"పద బాబూ గుడిలోకి వెళదాం" నాన్న పాంచజన్యను అక్కడి నుంచి మళ్ళించాడు.

పాంచజన్యలో ఆలోచనల సుడులు తిరుగుతున్నాయి. స్వామి మాటల్లో అంతరార్థం కొంతవరకు తెలిసింది. తర్వాత దేవాలయంలోకి వెళ్ళి దర్శనం చేసుకున్నారు. ఉచిత భోజనాలు ఉన్నాయని అక్కడివారు చెప్పారు. తండ్రీ కొడుకులు ఇద్దరు క్యూలైనులో నిలబడి రెండు ఉచిత భోజనం టోకెన్లు తీసుకున్నారు.

దేవాలయానికి ఆనుకుని ఉన్న సత్రంలో ఒక పద్ధతి ప్రకారం భోజనాలు పెడుతున్నారు. కొసరి కొసరి వడ్డించడం. మంచినీర్లు అందించడం విస్తర్లు తీస్తుండటం అన్నీ ఒక పద్ధతి ప్రకారం చేస్తున్నారు. పాంచజన్య చాలా ప్రాంతాలు చూసాడు. కానీ అక్కడున్నంత పద్ధతి ఎక్కడా కనిపించలేదు. తింటున్న భక్తులు ఎంతో సంతృప్తిగా తింటున్నారు.

భోజనాలు చేసే గదిని ఆనుకుని కార్యాలయం ఉంది. "నాన్నా " అంటూ ఆ గదిలోకి తీసుకుని వెళ్ళాడు.

అక్కడ ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు.

నిత్య అన్నదాన పథకం గురించి వారు చాలా విషయాలు చెప్పారు మనం కట్టిన డబ్బులుకు సంవత్సరంలో ఒకరోజు కాశీలో ఆ అన్నదాన సత్రానికి వచ్చిన వారికి ఉచితంగా భోజనాలు పెడతారు. మనం ఎవరి పేరుతో డబ్బులు కట్టామో వారి పుట్టినరోజు. చనిపోయినరోజు. వారికి ఇష్టమైన రోజు. అలా ఏడాదిలో మూడురోజులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేయించి ప్రసాదాన్ని పోస్టులో ఇంటికి పంపిస్తామని చెప్పాడు.

వారు చెప్పిన విషయాలు పాంచజన్యకు నచ్చాయి.

"నాన్నా నిత్య అన్నదాన పథకానికి అమ్మ పేరుతో డబ్బులు కడదామని అనుకుంటున్నాను. అమ్మ.. అమ్మమ్మ అందరూ భోజనం పెట్టడంలో ఎంతో సరదా పడేవారు. భోజనం చేసే సమయంలో ఇతరులెవరైనా ఇంటికి వస్తే వారిని అన్నం తినమని బతిమిలాడేవారు. ఎంతమంది తింటే అంత ఆనందపడిపోయేవారు. అందువల్ల వారి పేరుతో నిత్య అన్నదాన పథకానికి అమ్మ పేరుతో డబ్బులు కడదామని అనుకుంటున్నాను." అన్నాడు.

కొడుకు మాటలు ఎంతో ఆనందాన్ని కలిగించాయి.

పెద్దవాళ్ళకు కూడా రాని ఆలోచన వాడికి రావడం ఆశ్చర్యం కలిగించింది.

నిత్యం ఎవరికో సాయం చేయాలన్న మంచి గుణం రమణి నుంచి వాడికి అలవడిందని అర్థం అయింది. తర్వాత కొడుకు భుజాన్ని తడుతూ "నువ్వు ఏమి చేసినా అడ్డు చెప్పను. అమ్మకోసం ఏం చేసినా ఎంత ఖర్చుపెట్టినా పర్వాలేదు. నిజంగా ఇటువంటి సత్రానికి దానం చేయడం ఎంతో మంచిది. చనిపోయి ఏ లోకంలో ఉన్నా అమ్మకు తెలిస్తే ఎంతో ఆనందపడుతుంది. నీ దగ్గర డబ్బులు ఉన్నాయా? లేకపోతే ఇస్తాను"

"డబ్బులు నా దగ్గర ఉన్నాయి నాన్నా! అమ్మకోసం ఈ చిన్నపనిని నన్ను చెయ్యనివ్వు" అన్నాడు పాంచజన్య.

తరువాత పర్సులో నుంచి డబ్బులు తీసి జమ చేశాడు.

వారిచ్చిన ఫారంలో తన వివరాలను చిరునామా నింపాడు. రమణి పుట్టినరోజు, చనిపోయిన రోజు, రమణి ఆరాధించిన సత్యసాయిబాబా జన్మదినం తేదీలు వరసగా రాసి ఆ కాగితాన్ని వారికి అందించాడు.

అన్నదాన కార్యాలయం వారు డబ్బులు కట్టినట్లు రశీదుని అందించారు.

దానిని అందుకున్న పాంచజన్య వారికి థాంక్స్ చెప్పాడు.

"మీ అమ్మగారి పేరుతో ఈ విధంగా అన్నదానం కోసం డబ్బులు జమచేయడం మాకు ఆశ్చర్యంగా ఉంది. ఇంకా మీరు స్టూడెంటుగా ఉన్నారని అనుకుంటున్నాం" అన్నారు అక్కడ ఆఫీసులో పనిచేస్తున్న అమ్మాయిలు.

"అమ్మకోసం మంచిపని చేసానన్న సంతృప్తిగా ఉంది" అంటూ లేచాడు.

"నాన్నా నేను చేస్తున్న ఏ పనికీ కూడా నువ్వు అడ్డుచెప్పడంలేదు. నువ్వు నేను చేస్తున్న పనులకు సహకరించడం కూడా నాకు ఆనందంగా అనిపిస్తోంది." అంటూ తండ్రివైపు అభిమానంతో ప్రేమగా చూసాడు.

నాన్న కళ్ళల్లో తడి

"మా అమ్మ మీద కూడా నేను ఇంత ప్రేమ చూపించలేదు. కానీ నువ్వు ఎంతోమంది పిల్లలకు ఆదర్శంగా ఉన్నావు. తల్లి రుణాన్ని తీర్చుకుంటున్నావు"

"నాన్నా నువ్వు అలా అనకు. నాకు ఏదోలా ఉంటుంది. అమ్మకు నేను చేసింది చాలా తక్కువ ఉద్యోగం ద్వారా నేను సంపాదించినదంతా అమ్మకోసం ఖర్చు చేయడంలో ఎంతో ఆనందం ఉంటుందనుకుంటున్నాను" అన్నాడు పాంచజన్య.

"నీలాంటి కొడుకు ఉన్నందుకు నేను ఎంతో గర్వపడుతున్నాను. నాకు లాంటి గర్వాన్ని పొందడానికి అమ్మ లేకపోవడం ఆమె దురదృష్టం" అన్నాడు.

పాంచజన్య నాన్నకు ఏమీ సమాధానం చెప్పలేదు.

నాన్న దగ్గరకు నెమ్మదిగా వచ్చాడు.

నాన్న నడుం చుట్టూ చేతులు వేసి దగ్గరకు లాక్కున్నాడు పాంచజన్య.

**పాంచజన్య** దేముని గదిలోకి వెళ్ళాడు. ఇంటిలో ఒక మూలన ఉంది. పేరుకు దేముని గదిగా ఉన్నప్పటికీ అందులో అనేక రకాల ఫోటోలు ఉన్నాయి. వాటి మధ్యలో రమణి ఫోటో ఉంది. రమణికి సత్యసాయిబాబా అంటే ఎంతో ఇష్టం. ఏ పని ప్రారంభించినా బాబా స్మరణ లేకుండా చేయదు. అందుకే తల్లి చనిపోయిన తర్వాత బాబా చిత్రపటం మధ్యలో బాబా గుండెల్లో అమ్మ ఫోటో ఉన్నట్లు పెద్ద చిత్రపటాన్ని తయారు చేయించాడు. వాస్తవానికి ఆ ఫోటో పాంచజన్య కజిన్ బ్రదర్ శ్రీవాత్సవ దగ్గరుండి తయారు చేయించి ఇచ్చాడు.

రోజూ అరగంట పాటు తల్లిని తలుచుకుంటాడు.

ఆఫీసులో ఎదురైన ఇబ్బందులన్నీ అమ్మతో మనసులోనే చెప్పుకుంటాడు.

అలా ఉండటం ఎంతో సంతృప్తి కలిగిస్తుంది.

ఆ రోజు ఉదయం పూజ చేస్తున్న సమయంలో అతనికి బాబా మీద దృష్టి మళ్ళింది. అమ్మ ఎంతగానో ఆరాధించే బాబా ఆశ్రమానికి తాను ఎందుకు వెళ్ళకూడదు అనుకున్నాడు. అనుకున్నదే తడవుగా ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకున్నాడు.

మనసులో ఏదో సంఘర్షణ ఉంది దాని పరిష్కారం మాత్రం లభించడంలేదు. పరిష్కారం కోసం అన్వేషణ చేయాలని మనసు తహ తహలాడుతోంది. బాబా ఆశ్రమానికి వెళితే ఏదైనా పరిష్కారం లభిస్తుందేమో.

బెంగుళూరు నుంచి పుట్టపర్తి ప్రయాణమయ్యాడు. బస్సులో కూర్చున్నాడన్నమాటే కానీ ఆలోచనలు బాబా చుట్టూ, అమ్మ చుట్టూ తిరుగుతూనే ఉన్నాయి. అమ్మ బాబాను ఎందుకు ఆరాధించింది? బాబాపై ఉన్న అపారమైన భక్తి తోనే తన పేరు ముందు సాయి అని తగిలించిందా అనుకున్నాడు.

ఆశ్రమంలో ఒక రోజు అయినా ఉండాలి. అన్నీ చూడాలి. తెలుసుకోవాలి. పాంచజన్య అలా అనుకోగానే ఒకలాంటి సంతృప్తి కలిగింది. ఆలోచనలతో పాటు బస్సు కూడా ముందుకు కదులుతోంది. పుట్టపర్తి మరో రెండు గంటల్లో చేరుతుందనగా ఇద్దరు బస్సు ఎక్కారు. ఒకాయన అరవై సంవత్సరాలు పైబడిన వ్యక్తి. అతని పక్కన పదిహేనేళ్ళ అమ్మాయి. ఇద్దరూ కలిసి బస్సు ఎక్కారు.

ముగ్గురున్న సీట్లో పాంచజన్య మాత్రం ఉన్నాడు.

"అన్నయ్యా ఖాళీయేనా?" అని అమ్మాయి అడిగింది. తర్వాత తండ్రితో కలిసి అదే సీటులో కూర్చుని వాళ్ళ నాన్నను కూడా కూర్చోపెట్టింది. అరగంట తర్వాత ఆ అమ్మాయి సంచిలో ఉన్న అరటి పెడతీసింది. తొక్క తీసి తండ్రికి తినిపించింది. తాను రెండు పళ్ళు తింది. తర్వాత పాంచజన్య వైపు చూస్తూ "తీసుకో అన్నయ్యా?" అందించింది.

పాంచజన్య తీసుకోలేదు.

"నాకు ఆకలిగా లేదు మీరు తినండి" అన్నాడు.

పెద్దాయన అరటిపళ్ళు తిని తొక్కల్ని పాంచజన్య పక్కనుంచి కిటికీలోనుండి బైటికి విసిరి "ఎక్కడికి బాబూ?" ప్రశ్నించాడు.

"పుట్టపర్తి బాబా గారి ప్రశాంతి నిలయానికి వెళుతున్నాను"

"మేమూ అక్కడికే" అంది ఆ అమ్మాయి. తెలిసిన వారు కనబడినంత సంబర పడిపోయింది.

పాంచజన్య తన బేగ్‌లో నుండి ఒక బిస్కట్ పేకెట్ తీసి అందించాడు.

"వద్దు. ఇంకా అరటి పళ్ళు మిగిలి ఉన్నాయి" అంది.

అమ్మాయి తండ్రి వాటిని తీసుకుని విప్పాడు. కూతురుకు రెండు ఇచ్చి మిగిలిన వాటిలో కొన్ని తిని మిగిలినవి కూతురుకు ఇస్తూ "రామలక్ష్మీ ఇవి సంచిలో ఉంచమ్మా" అని అందించాడు.

ఎంత ఆకలి మీద ఉన్నారో అనుకున్నాడు పాంచజన్య.

బస్సు ముందుకు కదులుతూనే ఉంది.

"పుట్టపర్తి ఎందుకు వెళుతున్నారు?" అడిగాడు.

ఆ వ్యక్తి ఒకసారి గుండెల్ని పట్టుకుని సమాధానం చెప్పేలోపల ఆ అమ్మాయి "నాన్నకు గుండె ఆపరేషను కోసం వెళుతున్నాం" అంది.

"ఎవరో చెప్పారు. ఇక్కడ ఆపరేషన్లు అన్నీ ఉచితంగా చేస్తారని అందుకే బయలుదేరి వచ్చాము" అతను నెమ్మదిగా చెప్పాడు.

వారు చెప్పిన మాటలు విని పాంచజన్యలో ఒకలాంటి ఆసక్తి కలిగింది. ఏమీ తెలియని వీరికి తాను సహాయం చేయాలి అన్నీ దగ్గరుండి చూపించాలి" అనుకున్నాడు.

"ఎవరైనా తెలుసా?"

"ఎవరూ తెలియదు బాబూ. మా ఊరిలో బాబా భక్తుడు ఉన్నాడు. ఆయన చిన్న చీటీ రాసి ఇచ్చారు. దానిని పట్టుకుని వస్తున్నాం" అన్నాడు. అతను తర్వాత తన జేబులో వెతికి చిన్న కాగితాన్ని తీసి పాంచజన్యకు అందించాడు.

విజయనగరం జిల్లాలో గుంకలాం అనే చిన్నపల్లెటూరులో సత్యసాయి బాబా సేవాదళ్ కార్యకర్త రాసిన ఉత్తరం చదివి తిరిగి ఇచ్చేసాడు. తర్వాత వారివైపు తిరిగి "నేను రెండు రోజులు పుట్టపర్తిలోనే ఉంటాను. మీకు తోడు ఉంటాను లెండి" అన్నాడు.

తండ్రీ కూతుర్లిద్దరూ ఎంతో సంబరపడిపోయారు.

"ఏమిటి సమస్య?"

"గుండెలో చిల్లుపడిందట. పెద్దాపరేషను చేయించకపోతే అయ్య బతకడట. ఆడికి నేను తప్ప ఎవరూ లేరు. తినడానికే టికాణా లేని మేం ఏం ఆపరేషన్లు చేయించగలం? అందుకే ఆశలు వదిలేసుకున్నాం. కానీ ఆ బాబెవరో ఈ ఆసుపత్రి సంగతి చెప్పి గొప్ప ఉపకారం చేసి పెట్టారు" అంది

అలా అంటున్నప్పుడు రామలక్ష్మి కళ్ళల్లో సన్నటిపొర.

"నాకేం కాదే ఎందుకిలా ఇదైపోతావు. నీ పెళ్ళి చేసేదాకా బతుకుతానులే" అన్నాడు అలా అంటున్నప్పుడు అతడి కళ్ళల్లో కూడా నీళ్ళు వచ్చాయి.

వారిద్దరిని చూసిన తర్వాత పాంచజన్యకు మనసు ఏదోలా అయిపోయింది. ఎందుకు వీరు కలిసారో తనకు తెలియదు. కానీ వారిని తనకు పరిచయం చేసిన భగవంతుడు చాలా మంచి పని చేసాడు. వారికి అన్ని విషయాల్లో "నేను" సాయంగా ఉంటాను అనుకున్నాడు మనసులో.

బస్సు దిగగానే తానే దగ్గరుండి వారిని తీసుకుని వెళ్ళాడు.

వారి వద్ద సరైన సంచి కూడా లేదు గుడ్డ సంచితో రెండేసి జతల బట్టలు పెట్టుకున్నట్లుగా ఉంది. పాంచజన్య దూరంగా ఉన్న దుకాణంలోకి వెళ్ళి మంచి ఖరీదైన లెదర్ బేగ్ కొని వారికి  అందిస్తూ "మీ బట్టలు ఇందులో పెట్టుకోండి. ట్రీట్‌మెంటు కోసం వచ్చారుగాబట్టి మీరు కొద్దిరోజులు ఇక్కడ ఉండవలసి ఉంటుంది" అన్నాడు.

"బేగ్‌కి మా దగ్గర డబ్బులు లేవు" రామలక్ష్మి జాలిగా అంది.

అమ్మాయి తండ్రి బిక్కమొహం వేసుకుని చూస్తున్నాడు. "పర్వాలేదు. మిమ్మల్ని డబ్బులు ఎవరు అడిగారు ఉంచుకోండి"

"థాంక్స్ అన్నయ్యా" రామలక్ష్మి ఆ బేగ్‌ను అందుకుంది. తర్వాత తన చేతి సంచిని ఆ పెద్ద బేగ్‌లో పెట్టుకుని పాంచజన్యను అనుసరించింది.

కౌంటరులోకి వెళ్ళగానే అక్కడివారు మర్యాదగా విషయాన్ని అడిగారు.

రామలక్ష్మి జవాబు చెప్పేలోపలే పాంచజన్య అందుకుని "గుండెలో రంధ్రం ఉందని చెప్పారట. ఆపరేషను కోసం వచ్చారు"

"మీ డాక్టరు గారి రిపోర్టులు ఉన్నాయా?"

పాంచజన్య ఆ రిపోర్టులను పరిశీలించిన తర్వాత ఆ ఆసుపత్రిలో ఉన్న సంబంధింత వైద్యుల వద్దకు తీసుకుని వెళ్ళాడు. అక్కడ వారు అన్నీ పరిశీలించారు. కూర్చోబెట్టి అతనికి అవసరమైన ప్రాధమిక పరీక్షలు చేసారు. తర్వాత దూరంగా ఉన్న వైద్యుని వద్దకు వెళ్ళి ఆ ఇద్దరికి రూం ఎలాట్ చేశారు.

"ఇన్ పేషెంటుగా చేరడానికి సాయంత్రం లోపల మీకు బెడ్ ఎలాట్ చేస్తారు. వెంటనే చేరిపోండి" అన్నారు.

అద్దంలా ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అక్కడున్న సదుపాయాలను చూసి వారిద్దరూ ఎంతో ఆశ్చర్యపోయారు. ఆనందపడిపోయారు. తమ వంటి పేదవారికి ఇటువంటి ఆసుపత్రిలో ఇంత మంచి ఆదరణ లభిస్తుందని వారు అనుకోలేదు.

ఆసుపత్రి ఆవరణలో చాలామంది సేవాదళ్ కార్యకర్తలు పనిచేస్తున్నారు.

ఎవరిమట్టుకు వారు రకరకాల పనులు చేస్తున్నారు. సేవాదళ్ కార్యకర్తలు ఇంటిలో మనుషుల మాదిరిగా చూపిస్తున్న ఆప్యాయత, ఆదరణ పాంచజన్యకు కూడా ఆశ్చర్యాన్ని కలిగించింది. తన సహాయం లేకపోయినా ఆపరేషను కోసం వచ్చినవారికి అన్ని సదుపాయాలు సమకూరతాయన్న నమ్మకం కలిగింది.

"ఆపరేషను ఎప్పుడు చేస్తారు?" అక్కడున్న సేవాదళ్ కార్యకర్తను అడిగాడు.

"డాక్టర్లు అన్నీ చూసుకుంటారు. మీరు వీరి బంధువులా?" అడిగాడు.

"అవును. మా తండ్రిగారు ఈ అమ్మాయి చెల్లెలు" అన్నాడు.

ఆ మాటలు విన్న వారిద్దరూ ఆశ్చర్యపోయారు.

పాంచజన్యను ప్రేమగా చూస్తుండిపోయారు. ఊరు కాని ఊరులో పరిచయం అయిన వ్యక్తి కేవలం రెండు గంటలు బస్సులో పక్కపక్కన కూర్చుని ప్రయాణించిన వ్యక్తి అంత దగ్గర అయిపోవడం స్వంత మనిషిలా కలిసిపోవడం రామలక్ష్మికి ఎంతో వింతగా అనిపించి మనసంతా ఆత్మీయతతో నిండిపోయింది.

"అన్నయ్యా నాన్నకు అసలు చదువు లేదు. వేలిముద్ర తప్ప ఏమీ వేయలేడు. నేను పదోతరగతి వరకు చదువుకున్నాను. ఎక్కడో విజయనగర్మ జిల్లాలో మారుమూలన ఉన్న గుంకలాం గ్రామం నుంచి ఇంత దూరం రాగలమా అనుకున్నాం. మా ఊరిలో చాలామంది మా పరిస్థితి చూసి అందరివద్దా డబ్బులు వసూలు చేసి మాకు ఇచ్చారు. ఎవరో తెలీని నువ్వు మా మీద ఇంత ఆత్మీయత చూపించడం నాకు చాలా సంతోషంగా ఉంది" అంది కళ్ళు చెమర్చుతుండగా.

"నేను ఎవరో మీకు తెలియదు. నిజమే. కానీ మేరెవరో ఈ ఆసుపత్రిలో ఉన్నవారికి కానీ ప్రశాంతి నిలయంలో ఉన్నవారికి గానీ అసలు తెలియదు. కానీ మీమీద చూపిస్తున్న ఆదరణ ఏమీలేని మీకు ఉచితంగా ఆపరేషను చేయించడానికి వారు చూపిస్తున్న ఉత్సాహం కూడా ఎవరికైనా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇదంతా సత్యసాయిబాబా అందరికీ నేర్పించిన విషయం. ప్రతివారూ తన తోటి వారికి సాయం చేయాలనా దృక్పదం. ఇక్కడ వాతావరణం చూసిన తర్వాత ఈ ప్రాంతంలో సంచరించిన తర్వాత కూడా మనకు కలగకపోతే జీవితం

వ్యర్థం. ఈ ఆసుపత్రి ఒక దేవాలయం ఇక్కడ తెల్లబట్టలతో కనిపిస్తున్న డాక్టర్లు నర్సులు అందరూ దేముళ్ళు దేవతలే వారితో పోలిస్తే నేనెంత?'' పాంచజన్య నెమ్మదిగా చెప్పాడు.

పాంచజన్య మాటలు వారిని కదిలించాయి.

ఇద్దరు చేతులు ఎత్తి నమస్కరించారు.

తన మాటలు వారిమీద చాలా ప్రభావాన్ని చూపించాయన్న విషయం పాంచజన్య గమనించాడు. బాబా ప్రభావం ఇంతలా ఉంటుందా? అనుకున్నాడు.

''మీరు మీకు ఇచ్చిన రూములో ఉండండి. నాకు ఇక్కడ చిన్నపనులు ఉన్నాయి వాటిని చూసుకుని మళ్ళీ మిమ్మల్ని కలుస్తాను'' అన్నాడు.

ప్రశాంతి నిలయం పాంచజన్యకు ఎంతో నచ్చింది. సేవా దృక్పథంతో అక్కడివారు చేస్తున్న పనులు ఎంతో ఆకర్షించాయి.

ఎవరూ ఎవరికి ఏమీ చెప్పడంలేదు. కానీ అన్ని పనులు సక్రమంగా జరిగిపోతున్నాయి. కనిపించని అదృశ్య శక్తి ఏదో వారిని నడిపిస్తున్న మాదిరిగా ఉంది.

చాలా తక్కువ ఖరీదుకు భోజనం లభించింది.

అక్కడ అన్ని ప్రాంతాలను చూసాడు ప్రతి విషయాన్నీ తెలుసుకుంటున్నాడు.

అమ్మ బాబాని ఎందుకు ఇష్టపడిందో కొద్ది కొద్దిగా అర్థం అవుతోంది. అక్కడ సేవా కార్యక్రమాలను చేయడానికి ఎంతోమంది ఉన్నారు. వారంతా నిరంతరం అక్కడే ఉంటున్నారు అనుకున్నాడు కానీ వారు విడతల వారిగా గ్రూపులుగా వస్తున్నారని అక్కడివారు చెప్పారు. ఈ సేవా కార్యక్రమాల వ్యవస్థ కూడా ఎంతో ఆసక్తిగా అనిపించింది.

బాబాని ఆరాధించేవారు సేవ కోసం కార్యక్రమాలను చేస్తున్నారు. వారు ప్రతి గ్రామంలోనూ ఉన్నారు. వారిలో సేవా దృక్పదం ఉన్నవారు ఏడాదికి ఒకసారి ప్రశాంతి నిలయానికి వస్తుంటారు అక్కడ సేవలను అందిస్తుంటారు. ఎప్పుడు ఎవరు ఏ పని చేయాలన్నా చేయడానికి సిద్ధంగా వారు ఉన్నారన్న విషయం పాంచజన్యకు అర్థం అయింది.

సేవాదళ్ విభాగాన్ని చూసే వ్యక్తి ఈ విషయాలన్నీ చెప్పాడు.

అతడితో అమ్మగురించి చెప్పాడు. గ్రామం ఇతర వివరాలు చెప్పగానే అతను సానుకూలంగా మాట్లాడాడు. ''మీ అమ్మగారు సేవ కోసం బాబా దగ్గరకు చాలాసార్లు వచ్చి ఉంటారు. అందుకే మీకు కూడా ఆసక్తి పెరిగింది.'' అన్నాడు.

''ఎటువంటి ప్రతిఫలాన్నీ ఆశించకుండా ఇంత సేవా దృక్పథంతో పనులు చేయడం నాకు ఎంతో ఆశ్చర్యంగా ఉంది'' అని మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నాడు.

చివరి రోజుల్లో అమ్మ తనకు ఏమి చెప్పాలని అనుకున్నదో ఇంకా సస్పెన్సుగా అనిపిస్తోంది. ఆ విషయం అక్కడి వారిని అడగాలని అనుకున్నాడు కానీ అడగలేకపోయాడు.

''రేపటి వరకూ ఇక్కడ ఉంటాను. నేను కూడా ఏదైనా సేవా కార్యక్రమాన్ని చేయాలని అనుకుంటున్నాను'' అడిగాడు.

అతను ఏమీ మాట్లాడలేదు.

పాంచజన్య వివరాలు తీసుకున్నాడు.

తర్వాత అక్కడకు దగ్గరగా ఉన్న తెల్లబట్టలు వేసుకున్న వ్యక్తికి అప్పగించాడు. అతను రెండు మూడు గదులు తిప్పి మరో వ్యక్తి దగ్గరకు తీసుకుని వెళ్ళాడు.

అతను మరో బృందానికి నాయకునిగా ఉన్నాడు. పాంచజన్యను అతను మరో ప్రాంతానికి తీసుకుని వెళ్ళాడు.

అక్కడ భోజనశాల ఉంది. ప్రశాంతి నిలయంలోకి వచ్చిన వారికి తక్కువ ఖరీదుకు భోజనాలు పెడుతున్నారు. ఆ పక్కనే కంచాలను శుభ్రం చేసే సింకు ఉంది. చాలామంది తెల్ల దుస్తులు ధరించిన కార్యకర్తలు ఆ ప్లేట్లు కడుగుతున్నారు. ఆ వ్యక్తి వారిని చూపించి "మీరు కూడా కొంతసేపు ఈ పని చేయండి" అన్నాడు. తర్వాత అక్కడున్న సేవాదళ్ కార్యకర్తలకు నాయకునిగా ఉన్న వ్యక్తితో "ఇతను కూడా మనవాడే" అని పరిచయం చేశాడు.

అక్కడ కంచాలు కడుగుతున్నవారు ప్లేట్లలలో మిగిలిన పదార్థాలను పక్కనుంచి పెద్ద బకెట్టులో వేస్తున్నారు, కొంతమంది కంచాలను కడుగుతున్నారు. కొంతమంది నిండిన బకెట్టును దూరంగా తీసుకుని వెళుతున్నారు.

పాంచజన్య కూడా వారితో కలిసిపోయాడు.

ఎంగిలి కంచాలను ముందు నీటితో కడిగి తర్వాత వాషింగు పౌడరుతో తోమి ఎండలో ఆరబెట్టారు. అక్కడ తింటున్నవారి కంచాలను కొంతమంది సేవాదళ్ కార్యకర్తలు తీసుకుని వస్తున్నారు. వాటిని అక్కడున్నవారు శుభ్రం చేస్తూనే ఉన్నారు. రెండుగంటలపాటు ఈ కార్యక్రమం కొనసాగింది. అంతా పూర్తి అయిన తర్వాత సేవాదళ్ కార్యకర్తలు భోజనాలు చేసారు. వారితోపాటు పాంచజన్య కూడా తిన్నాడు.

అటువంటి కార్యక్రమంలో పాల్గొన్నందుకు అతనికి ఎంతో సంతృప్తిగా ఉంది.

అక్కడకు వచ్చినవారు ఎవరు ఎక్కడివారో ఎవరికీ తెలియదు. కానీ వారు అందరూ కలిసి కట్టుగా చేసిన పని మాత్రం ఎంతో ఫలితాన్ని ఇచ్చింది. ఆనందాన్ని కలిగించింది.

మానవ సేవ మాధవ సేవ అనే మాటకు అర్థం బాగా తెలిసింది. ఏదో తెలుసుకోవాలని అక్కడికి వచ్చాడు కానీ మరేదో తెలుసుకున్నాడు. రమణి చనిపోయేటప్పుడు తనకు ఏమి చెప్పాలని అనుకుందో తనకు తెలియదుకానీ ఆమెను తెలుసుకోవడానికి చేసిన ప్రయత్నంలో తనకు కొత్త విషయాలు తెలుస్తున్నాయి.

పాంచజన్యలో ఆలోచనలు. రెండురోజులు ఉందామని వచ్చినవాడు మరో వారం రోజులు సెలవు పొడిగించాడు. రోజా తండ్రికి ఫోను చేస్తుంటాడు. క్షేమ సమాచారాలు అడుగుతుంటాడు. పుట్టపర్తి వచ్చేముందు నాన్నకు ఫోన్ చేసాడు. తర్వాత మళ్ళీ మాట్లాడి జరిగిన విషయాలన్నీ చెప్పాడు. "నాన్నా ప్రశాంతి నిలయంలో నాకు ఎంతో హాయిగా ఉంది. ఇక్కడికి వచ్చిన బాబా భక్తులు ఎన్నోసేవా కార్యక్రమాలను చేస్తున్నారు. ఎంత పెద్ద ఉద్యోగస్తులైనా ఎవరికీ బేషజాలు లేవు. అందరూ సమానంగా అన్ని పనులు చేస్తున్నారు. సేవ చేయడంతో ఇంతటి సంతృప్తి ఉంటుందా? అనే విషయం నాకు బాగా అర్థం అయింది" అన్నాడు.

" సాయి పాంచజన్యా అమ్మ నీకు పేరు పెట్టే సమయంలో పాంచజన్య అనే పేరు ముందు సాయి అని తగిలించింది. అంటే నువ్వు బాబాలా సేవా దృక్పధాన్ని అలవరుచుకోవాలన్న ఆలోచన కూడా ఉందేమో?" అన్నారు.

"మరో నాలుగురోజులు ఉండాలని ఉంది."

"అమ్మకు కార్యక్రమాలు అన్నీ అయిపోయిన తర్వాత కాశీనుంచి నేను ఇంటికి వచ్చాను. అప్పటినుంచీ నువ్వు ఎలా ఉన్నావనే ఆలోచనతో ఉన్నాను."

"నాన్నా అమ్మ రోజా గుర్తుకు వస్తోంది. నేను ఏ పని చేసినా అందులో అమ్మే కనిపిస్తోంది."

"మనిషితో అనుబంధం ఉన్నంతవరకు తెలియదు. కానీ ఆ మనిషి ఈ లోకం విడిచి పెట్టిన తర్వాత స్పష్టంగా తెలుస్తుంది. నాకు కూడా అదే విధంగా ఉంది. ఉద్యోగానికి వెళుతున్నాను. కానీ అన్నీ యాంత్రికంగా జరిగిపోతున్నాయి."

"బాధపడకు నాన్నా. తల్లి లేక నేను ఎంత బాధపడుతున్నానో భార్య లేక నువ్వు పడే బాధను నేను అర్థం చేసుకోగలను. చిన్నతనం నుంచీ నీ కొడుకుగా నేను పెరగలేదు. నీ స్నేహితునిగా పెరిగాను. అందువల్ల మనసును దిటవు చేసుకో"

"నీకు నేను ధైర్యం చెప్పాలి. కానీ నువ్వే నాకు చెబుతున్నావు."

"నాన్నా నీ ఆరోగ్యం జాగ్రత్త. రోజూ వాకింగుకు వెళ్ళు. నూనె పదార్థాలను తగ్గించు. నేనే రెండు మూడునెలలకు ఒకసారి వస్తుంటాను."

"పాంచజన్యా అమ్మ గురించి అతిగా ఆలోచించకు. మన మధ్య ఉండే మనిషి ఈ లోకం విడిచి పెట్టి వెళ్ళిపోయిందంటే బాధగా ఉంటుంది. కాదనను కానీ మనసు దిటవు చేసుకోవాలి."

"అలాగే నాన్నా"

"అమ్మ చనిపోవడానికి ముందు నాతో ఏదో చెప్పాలని అనుకుంది. అది ఏమిటో తెలుసుకోవాలి అని నిరంతరం ఆలోచించకు."

"ఆసుపత్రి మంచంపై పడుకున్నప్పుడు నోటి వెంబడి మాటలురాని సమయంలో అమ్మ నాపై జాలిగా ఆశగా చూసింది. ఆ చూపులను నేను మరిచిపోలేను. నాకు ఏదో చెప్పాలని అనుకుంది. అదేమిటో తెలుసుకుంటే కానీ నాకు మనసు స్థిమితపడదు. అమ్మ బాబాను ఎంతో ఆరాధించేది. అందువల్ల పుట్టపర్తికి వచ్చాను" అన్నాడు.

"అన్నీ చూసావా? నీకు సంతృప్తిగా ఉందా?"

"అమ్మ గురించి సమాధానం అయితే నాకు దొరకలేదు కానీ నాకు ఎంతో ఆనందంగా ఉంది. గొప్ప రిలీఫ్‌గా ఉంది. నాన్నా మరో పనిచేయాలని అనుకుంటున్నాను."

"చెప్పు."

"పుట్టపర్తి వస్తుండగా బస్సులో తండ్రీ కూతుర్లు పరిచయం అయ్యారు. ఆయనకు గుండెలో కన్నం పడిందని ఆపరేషను చేసారు. కోలుకుంటున్నారు. వారికి అసలు ఏమీలేదు. నిరుపేదలు. ఆ అమ్మాయి తప్ప ఎవరూ లేరు. ఆ తండ్రి చనిపోతే ఆమెకు దిక్కు కూడా లేదు. ఈలోపే ఆమెకు పెళ్ళిచేయాలని అతను అనుకుంటున్నాడు."

"డబ్బులు ఏమైనా ఇస్తావా? కావాలా?"

"డబ్బులు నా దగ్గర ఉన్నాయి. నా జీతంలో ఖర్చు అయ్యేది తక్కువ మిగిలేది ఎక్కువ కానీ నీ నుంచి అనుమతి కావాలి."

"మంచి పని అనిపిస్తే తప్పకుండా చెయ్యి. నువ్వు ఎవరికీ జవాబుదారి కాదు. నీ మనస్సాక్షికి నచ్చింది చెయ్యి. నన్ను కూడా అడగవలసిన అవసరంలేదు. అమ్మ ఉద్యోగం చేసేది కాబట్టి తనకు రావల్సిన డబ్బులు కూడా నాకు వచ్చాయి. నీకు కావల్సిన డబ్బులు పంపడానికి సిద్ధంగా ఉన్నాను" అన్నాడు నాన్న.

"థేంక్యూ నాన్నా"

ఫోన్ పెట్టేశాడు.

**తర్వాత రామలక్ష్మి** రూం దగ్గరికి వెళ్ళాడు.

"ఆపరేషన్ అయిపోయింది. ఈ వారం వెళ్ళిపోతున్నాం అన్నయ్యా"

ఆపరేషను సమయంలో డాక్టర్లతో మాట్లాడటం వారికి ఎటువంటి అవసరాలు ఉన్నాయో చూడటం వల్ల పాంచజన్యకు వారి గుండె ఆపరేషను గురించి అన్ని విషయాలు తెలుసు. అందుకే ఆ రోజు వారి వద్దకు వచ్చాడు"

"బాబూ నీ దయవల్ల అన్నీ సక్రమంగా జరిగిపోయాయి"

"నా దయ ఏమీలేదు. అంతా బాబాదయ. మీలాంటి నిరుపేదలు ఎటువంటి డబ్బులు కట్టలేనివారు ఉంటారని ముందుచూపుతో బాబా ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేసారు. ఈ రోజు ఈ లోకంలో సత్యసాయిబాబా లేకపోవచ్చు.. కానీ ఆయన చేసిన పనులు మాత్రం అందరికీ ఉపయోగపడుతున్నాయి. ఇటువంటి పనులు చేసినందుకే కృతజ్ఞులై ఉండాలి."

రామలక్ష్మి దూరంగా వెళ్ళిన తర్వాత అతనితో "అమ్మాయి పెళ్ళి గురించి ఏమి ఆలోచించారు?" అడిగాడు పాంచజన్య.

"మా మేనల్లుడు వున్నాడు వాడు కూడా మాలాంటివాడే కట్నాలు ఏమీ ఇవ్వనవసరంలేదు. అయినా పెళ్ళి ఖర్చులు ఉండాలి కదా వాటి గురించి చూస్తున్నాం."

పాంచజన్య ఏమీ మాట్లాడకుండా జేబులోంచి చెక్‌బుక్ తీసి చెక్ రాసి వారికి అందించాడు.

"లక్షరూపాయలు" రామలక్ష్మి చెక్‌ను చూసి అరిచింది.

"చెల్లీ నీ పెళ్ళికోసం ఇస్తున్నాను" అన్నాడు.

వారిద్దరికీ నోటివెంబడి మాటలు రాలేదు.

వారం రోజులు పరిచయంతో తమ గురించి తెలియకపోయినా అంతటి సాయం చేసిన ఆ కుర్రవాడిని చూసి ఇద్దరూ ఏడ్చేసారు.

పాంచజన్య ఏమీ మాట్లాడలేదు. ఆ వ్యక్తి పాంచజన్య చేతుల్ని పట్టుకుని కుదిపేసాడు. రామలక్ష్మికి మాటలు రావడంలేదు.

"నాకు చెల్లెళ్ళు ఎవరూ లేరు. ఉంటే ఇంకా ఎక్కువ ఖర్చు అయ్యేది కదా?"

"ఎవరి పిల్లవాడివో ఎక్కడివాడివో తెలీదు. మాకు ఇచ్చిన ఈ డబ్బులు పెళ్ళికోసం ఖర్చు చేస్తామో లేదో కూడా తెలియదు. కానీ సహాయం చేయాలన్న నీ గుణం గొప్పది. బాబూ నిన్ను కన్న తల్లిదండ్రులు చాలా పుణ్యాత్ములు"

పాంచజన్య కంటినుంచి కూడా అప్రయత్నంగా కన్నీళ్ళు వచ్చాయి.

పర్సు తీసి అందులో అమ్మ ఫోటోను తదేకంగా చూశాడు.

"మీ అమ్మగారా బాబూ?" అతను అడుగుతున్నాడు.

"అవును" అంటూ ఫోటోను వారికి చూపిస్తూ "ఇప్పుడు ఈ లోకంలో లేరు" అన్నాడు గద్గద స్వరంతో.

రెండు నిమిషాలు వారి మధ్య నిశ్శబ్దం రాజ్యమేలింది.

తర్వాత ఆ వృద్ధుడు "చనిపోయి ఈ లోకంలో లేకపోవచ్చు. కానీ మంచి చేయాలన్న అలవాటు నీకు నేర్పిన ఆమె ఎప్పటికీ ఉంటుంది బాబూ. నీలో ఉంది ఆ బాబాలో కూడా ఉంది" అంటూ ఎదురుగా తగిలించిన బాబా ఫోటోను ఆర్తిగా చూసారు.

పాంచజన్యకూడా అమ్మ ఫోటోవైపు, బాబా ఫోటోవైపు మార్చిమార్చి చూశాడు.

అతనుకూడా బెంగుళూరులో వేరే కంపెనీలో పనిచేస్తున్నాడు.

వారానికో పదిరోజులుకో ఇద్దరు కలుస్తుంటారు ఒకరి గురించి మరొకరికి బాగా తెలుసు. అతను విజయవాడ నుంచి వచ్చాడు.

అతని మాటలకు పాంచజన్య ఏమీ సమాధానం చెప్పలేదు.

చిన్న చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

"జీవితం ఎవరికీ శాశ్వతం కాదు. పోయిన వారి గురించి బాధపడుతూ ఉండటంవల్ల మనకు దుఃఖం వస్తుంది తప్ప ప్రయోజనం లేదు"

"రాజేష్ నేను బాధపడుతున్నది అమ్మ చనిపోయిందని కాదు ఆమె లేని లోటు ఎవరూ తీర్చలేనిది. నాకు చిన్నతనం నుంచి ఎక్కువమంది స్నేహితులు కూడా లేరు. దాదాపు నా చదువంతా హాస్టళ్ళలోనే సాగింది."

"మరి"

"అమ్మతో నా ఎటాచ్‌మెంటు ఎక్కువ. నాన్నతో కూడా నేను ఫ్రీగా ఉండలేను కానీ అమ్మ దగ్గర ప్రతి విషయాన్ని షేర్ చేసుకుంటాను. అన్ని విషయాలు నాకు అమ్మ చెబుతుండేది, చివరిలో చనిపోయినప్పుడు కూడా నాతో ఏదో మాట్లాడాలని ప్రయత్నించింది. ఆమె ఏమి మాట్లాడాలనుకున్నదో నాకు తెలియదు. కానీ తెలుసుకోవాలని ఉంది"

రాజేష్ పాంచజన్య వైపు విచిత్రంగా చూసాడు.

"నీకు నా బాధ చెప్పినా అర్థంకాదు. అలా అర్థం చేసుకోవడానికి కూడా కొంత పరిజ్ఞానం కావాలి" అంటూ రూం బైట ఉన్న కుర్చీ దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు.

రాజేష్‌కు పాంచజన్య అంటే ఒకలాంటి జాలి కలిగింది. "రెండు నెలల్లో నేను రూం మారిపోతున్నాను. ఎందుకంటే నా పెళ్ళి ఫిక్సు అయింది. నా భార్య వస్తే ఇంతకన్నా పెద్ద రూం అవసరం ఉంటుంది కదా" అని పాంచజన్య కళ్ళల్లోకి చూస్తూ.

"అవును. నువ్వుకూడా పెళ్ళిచేసుకుంటే చాలా ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పడుతుంది కదా?" అన్నాడు.

"పెళ్ళి సంగతి తప్ప మరేమన్నా చెప్పు" అన్నాడు.

"సరేలే ఉద్యోగం వచ్చిన తర్వాత మొదటి జీతం వస్తుంది కదా? మీ తల్లిదండ్రులకు ఏమి కొన్నావు" అడిగాడు రాజేష్.

"వారిద్దరూ మంచి ఉద్యోగాలు చేస్తున్నారు నా నుంచి వారు ఏమీ ఆశించలేదు. నా జీతం నాకు నచ్చిన విధంగా ఖర్చు పెట్టుకునే అవకాశం కల్పించారు. అయినా నేను చదువుకుంటున్నప్పుడే వారికి రెండు లక్షల ఫీజు కట్టవలసి ఉంటుంది. కానీ మంచి మార్కులు వచ్చిన వారికి ఫ్రీ సీటు ఇస్తారు అర్ముగం సార్ అందరికీ అదే చెప్పారు. మీరు టెన్తులో మంచి మార్కులు సంపాదించి ఫ్రీ సీటు సంపాదించండి. మీ అమ్మా నాన్నలకు ఫీజు కట్టవలసిన రెండు లక్షలు ఫీజు మిగల్చండి. విద్యార్థి తల్లిదండ్రులకు ఇంత పెద్ద గిఫ్టు ఎవరూ ఇవ్వలేరు. మీరు ఇవ్వడానికి ప్రయత్నించండి అని చెప్పారు."

"నువ్వు ఫ్రీ సీటు సంపాదించావా?"

"అవును. ఈ విషయం ఎవరికి చెప్పలేదు. చాలా కష్టపడి చదివాను. స్కూలులో నాకే అత్యధిక మార్కులు వచ్చాయి. ఫ్రీ సీటు లభించింది. కానీ అప్పటికే అమ్మానాన్నా నన్ను అదే కాలేజీలో చేర్పించడానికి ఫీజు సిద్ధం చేసారు. నేను ఈ విషయం చెప్పగానే వారు ఎంతో ఆనందపడిపోయారు. వారి కళ్ళల్లో కనిపించిన మెరుపులు నాకు ఎంతో సంతోషం కలిగించాయి. పదహారేళ్ళ వయస్సులో నేను వారికిచ్చిన గిఫ్టు చిన్నది కాదు"

"యూ ఆర్ గ్రేట్ పాంచజన్యా నేనూ చిన్నతనంలో ఉద్యోగం సంపాదించినా నాకు ఇవ్వడానికి అమ్మానాన్నా ఇద్దరూ లేరు. అందుకే ఒకేసారి బాధపడుతుంటాను."

"సారీ రాజేష్" అనునయించాడు పాంచజన్య.

"పాంచజన్యా నువ్వు అమ్మగురించి చాలా ఆలోచిస్తున్నావు. కని పెంచకపోయినా అమ్మలా సాకే అమ్మలు ఎంతోమంది ఉన్నారు తెలుసా?"

"నిజమా?"

"నిజంగా ఉంది. నువ్వుంటున్న విశాఖపట్నం సమీపంలోనే సముద్రతీరంలో ఉన్న భీమిలీలో అటువంటి ఆశ్రమం ఒకటి ఉంది దానిని ఎస్.ఓ.ఎస్ చిల్డ్రన్స్ విలేజీ అంటారు నువ్వు తప్పకుండా వెళ్ళు. అనాథలను అక్కడ అమ్మలు ఎంత ప్రేమగా చూస్తారో తెలుస్తుంది" అన్నాడు.

"విశాఖపట్నంలో నివాసం ఉన్నప్పటికీ నేను ఎప్పుడూ అమ్మా నాన్నలకు దూరంగా ఉండేవాడిని. హాస్టల్ చదువులతోనే కాలం గడిచిపోయింది. అందుకే భీమిలీ ఆశ్రమం గురించి తెలియలేదు."

"అక్కడ అమ్మలు స్వంత మ్మలు కన్నా ఎక్కువగా చూస్తారు. నేను నా మేరేజ్‌కి అక్కడికే వెళ్ళాలి"

"నీది విజయవాడ కదా నీ ఉడ్‌బీది భీమిలీయా?"

"ఏమో తెలియదు. కానీ భీమ్లీ ఎస్.ఓ.ఎస్‌లోనే చదువుతోంది. "

"అమ్మాయి అనాధా?"

"అవును తల్లిదండ్రులు చనిపోయిన తర్వాత వారి బంధువులు అమ్మాయిని అందులో చేర్పించారు. అక్కడే చదువుకుంది. ఇప్పుడు విజయవాడలో ఉద్యోగం కూడా చేస్తోంది" అని చెపుతూ "అది పేరుకే అనాధాశ్రమం. కానీ అక్కడ ఎవరూ అనాధలుగా ఉండరు. అందులో పదిమంది అమ్మలు ఉంటారు. ఒకో అమ్మ దగ్గర పదిమంది పిల్లలు ఉంటారు ఇంటివాతావరణంలా ఉంటుంది" అన్నాడు.

"ఈ నెలలో నాన్న దగ్గరికి వెళ్ళాలని అనుకుంటున్నాను. విశాఖపట్నంలోనే అమ్మకు సంబంధించి నెలవారి కార్యక్రమాన్ని చెయ్యాలి. ఆ సమయంలో తప్పకుండా వెళతాను"

"నా పెళ్ళికూడా అక్కడే జరుగుతుంది. నువ్వూ రావాలి"

"తాను పెరిగి చదువుకున్న విద్యాలయంలోనే పెళ్ళికావడం ఆనందంగా ఉంటుంది. ఆమె అదృష్టవంతురాలు."

"అమ్మ అంటే ఇంత ప్రేమ చూపించే నీలాంటివాడికి ఆ ఆశ్రమం గుడిమాదిరిగా అనిపిస్తుంది. ఎటువంటి చార్జీలు కట్టకుండా సంరక్షణ బాధ్యత అంతా వారే చూసుకుంటారు. నువ్వు అక్కడ అమ్మలను తప్పకుండా కలుసుకోవాలి. "

"రాజేష్ ఇన్ని విషయాలు నీకు ఎలా తెలుసు?"

"ఆ అమ్మాయి పేరు స్వప్న అది కూడా ఎస్.ఓ.ఎస్ ఆశ్రమంలో ఉన్న ఒక అమ్మ పెట్టిన పేరు. స్వప్నతో నాకు పెళ్ళి చేయాలని అనుకున్నది కూడా ఆ అమ్మే"

"ఆమెకు నీ గురించి ఎలా తెలుసు?"

"అందులో చేరి పెద్దవారు అయిన వారందరి గురించి వివరాలు ఉంటాయి. అందులో చదివినవారు ఎక్కడున్నా, ఎంత పెద్ద ఉద్యోగాలు చేస్తున్నా అమ్మలను మరిచిపోరు. వారే అక్కడ చదివిన అమ్మాయిలకు సంబంధాలు కుదురుస్తారు"

"వారికి నువ్వు ఎలా తెలుసు రాజేష్?"

"పాంచజన్యా నేను కూడా ఎస్.ఓ.ఎస్‌లోనే పెరిగాను. నాకు కూడా చిన్నతనంలోనే అమ్మా నాన్నా చనిపోయి అనాధగా ఉన్నాను కదా?" అన్నాడు.

రాజేష్ మాటలు పాంచజన్యను కదిలించాయి.

"రాజేష్ నీ వ్యక్తిత్వం నాకు తెలుసు. అందుకే నీ రూంలో ఇన్ని రోజులు ఉండగలిగాను. నువ్వు పెరిగిన ఆశ్రమాన్ని చూడాలని అనుకుంటున్నాను. అక్కడ అమ్మల్ని చూస్తే నా సమస్యకు ఏదో పరిష్కారం లభిస్తుందేమో అనిపిస్తుంది. సెలవు దొరకగానే వెళతాను. నీ పెళ్ళికి కూడా తప్పకుండా వస్తాను" అన్నాడు.

పాంచజన్యలో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

భీమిలి నుంచి విశాఖపట్నం వెళుతున్న బీచ్‌రోడ్డులో ఎస్. ఓ. ఎస్ ఆశ్రమం ఉంది.

పదకొండు ఎకరాల్లో చుట్టూ ప్రహరీ నుంచి మధ్యలో పదకొండు గృహాలు కార్యాలయం కలిసి ఉన్నాయి. లోపలకు ప్రవేశిస్తే కొత్త లోకంలోకి వెళ్ళినట్లుంది.

పాంచజన్య అనుమతి తీసుకుని వెళ్ళాడు.

కార్యాలయంలో సిబ్బంది ముందు ఆ ఆశ్రమం గురించి చాలా విషయాలు చెప్పారు. అనాథ పిల్లలకోసం ఏర్పాటు చేసిన విషయాన్ని దాని ఏర్పాటు కోసం అంతర్జాతీయ స్థాయిలో జరిగిన కృషిని వివరించారు.

ఆ ప్రాంగణంలో పదకొండు ఇళ్ళు ఉన్నాయి. ప్రతి ఇంటిలో పదిమంది పిల్లలు ఉన్నారు. వారిని చూడటానికి అమ్మ ఉంది. అటువంటి అన్ని ఇళ్ళు చూసిన తర్వాత ఒక ఇంటిలోకి వెళ్ళాడు.

చుట్టూ పిల్లల్ని కూర్చోపెట్టుకుని అమ్మవారికి కథ చెబుతోంది.

ఆ దృశ్యం చూడగానే పాంచజన్యకు అమ్మ గుర్తుకు వచ్చింది.

ఇతర పిల్లలవైపు చూస్తూ కథ చెబితే తనకు ఎంతో కోపం వచ్చేది. దగ్గరగా జరిగి అమ్మను ఆనుకుని కూర్చునేవాడు. పక్క పిల్లలవైపు చూస్తుంటే ఆ విషయం గుర్తుకు వచ్చింది.

అమ్మ తనను తాను సౌజన్యగా పరిచయం చేసుకుంది. పాంచజన్యకు ఆమె కుర్చీ చూపించింది. కూర్చునేటప్పుడు పిల్లల్ని విష్ చేశాడు.

"గుడ్ మార్నింగ్ బ్రదర్" అన్నారు వాళ్ళు ముక్తకంఠంతో

ఏడుగురు ఆడపిల్లలు అయిదుగురు మగపిల్లలు ఉన్నారు.

అందరూ సంతోషంగా ఆరోగ్యంగా ఉన్నారు. పిల్లల్ని పేర్లు అడిగి వారు ఏ ఏ తరగతులు చదువుతున్నారో తెలుసుకున్నాడు. "నేను బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నాను. మీ కోసం చాక్లెట్లు తెచ్చాను" అంటూ ఖరీదైనా చాక్‌లెట్లను అందించాడు.

పిల్లలు ఎవరూ తీసుకోలేదు.

పాంచజన్య వారిపై సందేహంగా చూశాడు.

"పై వాళ్ళు ఇచ్చినవి వీరు తీసుకోరు. స్నాక్స్ తినే సమయంలోనే తింటారు. నాకు ఇవ్వండి నేను ఇస్తాను" సౌజన్య సౌమ్యంగా చెప్పి వాటిని అందుకుంది.

పాంచజన్య అప్రయత్నంగా చాక్‌లెట్లు సౌజన్యకు అందించాడు.

"ఈ ఇంటిలో ఉన్నంత వరకు వీరికి ఎవరూ లేదన్న భావన కలగకూడదు. తాము అనాథలమన్న భావన కూడా రానీకూడదు. ఇతరులు చూపించే జాలిని కూడా వీరు స్వీకరించలేరు. అందుకు అనుగుణంగానే ఇక్కడ రూలు ఫ్రేమ్ చేయబడ్డాయి. "

సౌజన్యకు నలభై సంవత్సరాలు ఉంటాయి. తెల్లచీర కట్టుకుని పవిత్రంగా ఉంది. "మిమ్మల్ని అమ్మ అని పిలవచ్చా?"

"ఇక్కడ పెద్దవారైనా చిన్నవారైనా అందరూ అమ్మా అని మాత్రమే పిలవాలి. మీరు అడిగారు గాబట్టి నా పేరు సౌజన్య అని చెప్పాను" సౌజన్య అంది.

"అమ్మా మీరు అమ్మగా మారడానికి కారణం ఏమిటి?"

సౌజన్య సాలోచనగా చూసింది.

కూర్చున్న పిల్లలకు వర్కు అప్పగించి దూరంగా కూర్చోబెట్టింది.

"బెంగుళూరు నుంచి మీరు వస్తున్నారని సార్ చెప్పారు. రెండురోజులనుంచీ మీకోసం చూస్తున్నాం. మీరు మా సంస్థ గురించి తెలుసుకోవడానికి వస్తున్నారని చెప్పారు."

"నా గురించి అలా చెప్పారా?" పాంచజన్య స్వగతంలో అనుకున్నాడు.

తర్వాత సౌజన్య వైపు తిరిగి "ఈ సంస్థలో చదివిన నా ఫ్రెండు రాజేష్ చెప్పడం వల్ల ఈ ఆశ్రమానికి వచ్చాను. అతను కూడా ఇక్కడే చదువుకున్నానని అన్నాడు. నాకు ఇక్కడకు రావాలన్న ఆతృత కూడా అతనివల్లే కలిగింది. వచ్చిన తర్వాత ఇక్కడ వాతావరణం చూసి చాలా ఆనందపడ్డాను" అన్నాడు పాంచజన్య.

"ఆనందం ఎందుకు?" సౌజన్య అడిగింది.

"మా అమ్మ అంటే నాకు ఎంతో ఇష్టం. నన్ను ఎంతో ప్రేమించింది. నాన్నకన్నా నేనంటేనే తనకు ప్రేమ. ఆమె అనారోగ్యంతో చనిపోయింది. ఆమె పోయిన తర్వాత నాకు జీవితమంతా శూన్యం అయిపోయింది. ఆమె జ్ఞాపకాలతో బతుకుతున్నాను. ఇక్కడకు వచ్చిన తర్వాత ఈ పిల్లల్ని తల్లి కాకపోయినా తల్లిలా సాకుతున్న మిమ్మల్ని చూసిన తర్వాత మళ్ళీ మా అమ్మ గుర్తుకు వచ్చింది"

పాంచజన్య మాటలు సౌజన్యలో అభిమానాన్ని నింపాయి.

"నేను కూడా మా అమ్మను ఎంతగానో ప్రేమించాను. ఆమెతోనే లోకంగా బతికాను. ఆమె చనిపోయిన తర్వాత లోకం అంతా శూన్యం అయిపోయింది. నాకు పెళ్ళి చేయాలన్న ఆమె కోరిక తీరకుండానే చనిపోయింది. అప్పటి నుంచీ పెళ్ళి చేసుకోవాలని అనుకోలేదు. ఆ సమయంలో ఈ సంస్థలో అమ్మ ఉద్యోగం కోసం ప్రకటన పడింది. దరఖాస్తు చేస్తేవారు నన్ను నా వివరాలను తెలుసుకుని ఉద్యోగాన్ని ఇచ్చారు. పెళ్ళికానివారు విదవ స్త్రీలు ఈ ఉద్యోగానికి కావాలని వీరి ప్రకటనలో చెప్పారు. నాకు సరిగా సరిపోయింది."

"ఇక్కడ చేరి ఎన్ని సంవత్సరాలు అయింది?"

"పదిహేను సంవత్సరాలు అయింది. ఈ ఎస్.ఓ.ఎస్ సంస్థలో అందరు అమ్మలకన్నా నేనే సీనియర్‌ను. అందుకే మా సార్ మిమ్మల్ని ఈ ఇంటికి పంపించారు."

"ఈ పిల్లలు అంటే మీకు ఇష్టమేనా?"

"ఈ పిల్లలు అందరూ అనాథలు. వీరి తల్లిదండ్రులు ఎవరో వీరికి తెలియదు. కొంతమంది పెంటకుప్పలో పారవేయబడిన వారు. వీరికి ఎవరూ లేరని అనుకుని మా దగ్గరకు తీసుకుని వచ్చి చేర్పించారు. వారికి చిన్నతనం నుంచి మేమే అన్నీ చూస్తుంటాం.."

పాంచజన్య వింటుండిపోయాడు.

"ఈ ఇంటిలో ఉన్న ఈ పదకొండు మంది పిల్లలు వారికి ఊహ తెలిసిన దగ్గర నుంచీ నా వద్దే ఉంటున్నారు. వారికి నేనే అమ్మా నాన్నా అన్నీను."

"ఇంతమందికి మీ ప్రేమను ఎలా చూపించగలుగుతున్నారు?"

"ఎందుకలా అడిగారు?"

పాంచజన్య ఒక నిమిషం ఏమీ మాట్లాడలేకపోయాడు. తర్వాత "మా అమ్మకు నేనంటే ఉన్న ఇష్టం చూసి మా నాన్న కూడా నాకు తమ్ముడో చెల్లెలో కావాలని అనుకోలేదు"

"నిజమా?"

"నిజం సౌజన్యమ్మా. మా అమ్మ అంటే నాన్నకు ఎంతో ప్రేమ. వారిద్దరూ ఒకరంటే ఒకరు ఇష్టపడి ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. అమ్మ ఇష్టం కోసం ఏమి చేయడానికైనా నాన్న సిద్ధపడేవారు. మనం మంచి చదువులు చదివించాలన్నా సంపూర్ణమైన ప్రేమను అందించాలన్నా ఒక్క బాబు చాలు అంది. నాన్న కూడా దానికి కట్టుబడి ఉండిపోయారు. అందుకే మా ఇంటిలో నేను ఒక్కణ్ణే ఉన్నాను" అలా చెబుతున్నప్పుడు పాంచజన్య గొంతు మారిపోయింది.

***

**"మీ అమ్మ** మీ మీద చూపించిన ప్రేమ ఎక్కువైపోయిందా?'

సౌజన్య మాటలకు పాంచజన్య చిన్నగా నవ్వాడు.

లంచ్ బెల్ కొట్టారు. పిల్లలందరూ పుస్తకాలు సర్దుకున్నారు. తర్వాత వరుసగా వచ్చి అమ్మ దగ్గర నిల్చున్నారు.

సౌజన్య లేచి నిల్చుంది. "ఈ పక్కనే లంచ్ రూం ఉంది. మీరు కూడా మాతో రండి భోజనం చేద్దాం"

పాంచజన్య వారిని అనుసరించాడు.

వంటశాలలో అందరూ కలిసికట్టుగా కూర్చున్నారు. ముందు ప్రార్థన చేసి భోజనాలు మొదలుపెట్టారు.

భోజనాలు చేస్తున్నంతసేపూ వారినే గమనిస్తూ ఉండిపోయాడు.

తర్వాత మళ్ళీ ఇంటిలోకి తీసుకుని వెళ్ళి సౌజన్య మరిన్ని విషయాలు చెప్పింది. అక్కడ చదువుతున్న పిల్లలకు సంబంధించిన వ్యక్తిగత రికార్డులను చూపించింది.

"అమ్మ జ్ఞాపకాలే పదే పదే గుర్తుకు వస్తున్నాయి. నేను ఏ పని చేసినా చేస్తున్నా ప్రతి పనిలో అమ్మ మదిలో మెదులుతోంది. కారణం తెలియడం లేదు"

పాంచజన్యకు ఏమి సమాధానం చెప్పాలో సౌజన్యకు తెలియలేదు.

"మీ ఇంటిలో మీరొక్కరే సంతానం కాబట్టి మీకు అమ్మ తప్ప మరొక విషయం తెలియదు. మీ అమ్మగారికి కూడా మీరు తప్ప పిల్లలు మరెవరూ లేనందువల్ల మీతోనే నిరంతరం గడిపే వారనుకుంటాను. అందువల్ల అమ్మతో ఈ ఎటాచ్‌మెంటు ఎక్కువగా ఉందని అదే నువ్వు పదే పదే ఫీల్ అవుతున్నావని అనుకుంటున్నాను."

"ఏమో ఇదమిద్దంగా నాకు తెలియడంలేదు. అది కూడా ఒక కారణం కావచ్చునేమో. నేను బెంగుళూరులో మంచి కంపెనీలో పెద్ద ఉద్యోగం చేస్తున్నాను. కానీ నాలో తీవ్రమైన అసంతృప్తి ఏర్పడిపోయింది. ఆఫీసులో పనులు యాంత్రికంగా చేస్తున్నాను. అమ్మలేని లోటువల్ల ఏ పనిమీదా ఆసక్తి ఉండటంలేదు."

"మనం బాధ పడుతున్నప్పుడు ఆ బాధను మరిచిపోవడానికి మనం చేస్తున్న పనిలో మరింత నిమగ్నం కావాలి."

"అంటే?"

"మా అమ్మ చనిపోయినప్పుడు నేను కూడా చాలా బాధపడ్డాను. ఆ సమయంలో ఈ అమ్మ ఉద్యోగం వచ్చింది. కొద్దిరోజులు అమ్మ జ్ఞాపకాలతో సతమతమయ్యేదానిని. తర్వాత దాని నుంచీ బైటపడ్డాను. మా అమ్మను ఎంతలా ప్రేమించానో అంతకన్నా ఎక్కువగా నా పనిని ప్రేమించడం మొదలుపెట్టాను. ఈ ఆశ్రమంలో తల్లిగా నేను చేయవలసిన పనులు అందరికన్నా నిబద్ధతతో చేసాను. ఇప్పుడు మా అమ్మ అంతగా గుర్తురావడంలేదు. కాలం గడిచిన కొద్దీ ఈ ఆశ్రమంలో పిల్లల్లో మా అమ్మను చూసుకుంటున్నాను."

పాంచజన్య వెంటనే కలగజేసుకుని "నేనూ అదే విధంగా చేసాను, నేను చేయవలసిన పని ఎనిమిది గంటలు అయితే కార్యాలయంలోనే ఉండిపోతూ ఎనిమిది గంటలకు పైగా చేసాను. ఒకోరోజు రూముకు కూడా వెళ్ళేవాడిని కాదు. పనిలోనే ఎక్కువ సమయం ఉండేవాడిని. అయినా నాకు అమ్మ గుర్తుకు వస్తూనే ఉంది."

"ఏం చేసారు?"

"నేను పనిచేసే ఆఫీసు మల్టీనేషనల్ కంపెనీ. నా పని ప్రాజెక్టులు డిజైన్ చేయడం సాయంత్రం ఆరు ఏడు గంటలకు నా పని అయిపోతుంది తర్వాత ఇంటికి వెళ్ళిపోవచ్చు. రూంకి వస్తే అమ్మ జ్ఞాపకాలు వెంటాడతాయని ఆఫీసులోనే ఉండి పోతున్నాను. ఒకోసారి ఆఫీసులో నా చాంబర్‌లోనే ఉండిపోయి రాత్రి పడుకుండిపోతున్నాను. ప్రైవేటు కంపెనీలకు నావంటివారే అవసరం. అందుకే వారు నా పనిని మెచ్చుకుంటున్నారు. ఇద్దరు చేయవలసిన పనిని ఒక్కణ్ణే చేస్తున్నానని ప్రశంసలు కూడా అందించారు."

"అది నీకు సంతృప్తి కలిగించలేదా?"

"వృత్తిపరంగా నాకు ఎంతో సంతృప్తి కలిగించింది. కానీ నా మనసులో మాత్రం ఏదో వెలితి ఉండిపోయింది. ఎందరు నన్ను మెచ్చుకుంటున్నా అమ్మ ఉంటే ఎంతో సంతోషించేది కదా అనిపిస్తుంది."

"మీ నాన్నగారితో మీ ఆలోచనలు పంచుకోవచ్చుకదా?"

"పంచుకోవచ్చు. కానీ నిరంతర పనుల ఒత్తిడిలో ఉండే నాన్నకు ఈ విషయాలు చెప్పడం నాకు ఇష్టం ఉండదు. ఈ వయసులో నాన్నకు ఎంతో కష్టం వచ్చింది. అమ్మ చనిపోవడంతో తనను చూసుకోవడానికి కూడా అక్కడ ఎవరూ లేరు. అమ్మలేని లోటు నాన్నకు ఎక్కువగా ఉంటుందని తెలుసు. అందుకే నా ఆలోచనలన్నీ చెప్పి నాన్నను మరింత బాధపెట్టడం నాకు ఇష్టం అనిపించడంలేదు.

సౌజన్య సమాధానం ఏమీ చెప్పలేదు. ఆ గదిలో మూలన ఉన్న బీరువా తలుపు తెరిచి అందులో ఉన్న ఆల్బంని తీసుకుని వచ్చి పాంచజన్యకు ఇచ్చింది. ఆతృతగా విప్పాడు.

చిన్నప్పటి ఫోటోలు అమ్మతో కలిసి ఉన్న ఫోటోలు చాలా ఉన్నాయి. సౌజన్య అమ్మగారితో కలిసి ఉన్న ఫోటోలు ఎక్కువగా ఉన్నాయి.

"మా అమ్మగారు గుర్తుకు వస్తుంటారు. ఆ సమయంలో ఈ ఆల్బం చూస్తుంటాను. జరిగిపోయిన రోజులు గుర్తుకు తెచ్చుకుంటుంటాను."

ఆమె మాటలకు పాంచజన్య వెంటనే సమాధానం చెప్పలేదు తర్వాత. "నాకు మా అమ్మ ఫోటోలు చూస్తుంటే ఏడుపు వచ్చేస్తుంది. ఆ ఫోటోల సందర్భాలు అన్నీ సినిమా రీళ్ళలా కళ్ళముందు తిరుగుతుంటాయి. అన్నాడు.

"ఇక్కడకు ఎందుకు వచ్చారు?"

"రాజేష్ నాతో మాట్లాడినప్పుడు ఎంతోమంది మంచి హృదయం కలిగిన అమ్మలు ఉంటారని అన్నాడు. మా అమ్మను మరిచిపోవడానికి కొత్త అమ్మలను చూడటానికి వచ్చాను. మా అమ్మ నాతో ఏదో చెప్పాలని, లేదా నన్ను ఏదో అడగాలని అనుకుంది.

అమ్మ మనసులో ఏముంటుందో అమ్మలకే తెలుస్తుంది కదా? మీలాంటి అమ్మలను కలుసుకోవటం వల్ల తెలుస్తుందేమో అన్న ఆశకూడా నన్ను ఇక్కడకు రప్పించింది"

"మీ అమ్మగారు మీతో మాట్లాడాలనుకున్నారా?"

"అవును. అమ్మ చనిపోవడానికి ముందు నాతో ఏదో చెప్పాలని అనుకుంది. కానీ ఆ రోజు ఆమె నోటి వెంబడి మాటలు రాలేదు. నావైపు జాలిగా చూస్తూ చనిపోయింది. అప్పటినుంచీ నా మనసులో సందేహం ఉండిపోయింది. అమ్మ చివరలో నాకు ఏదో చెప్పాలనుకుంది. అది ఏమిటో తెలుసుకోవాలనిపించింది."

"పాంచజన్యా మీ అమ్మగారిని ఎక్కువగా ప్రేమించడం వల్ల మీ మనసులో సందేహం ఉండిపోయింది. తల్లి తన కొడుక్కి చెప్పే రహస్యాలు ఏముంటాయి. జాగ్రత్తగా ఉండమని చెబుతుంది.. అంతేకదా?"

"ఎవరితో మాట్లాడినా అందరూ అదే అని అంటున్నారు. కానీ నాకు అదికాదేమో అనిపిస్తోంది. కొంతమంది ఆత్మలతో మాట్లాడుతుంటారని ఎవరో అంటే అటువంటి వారిని కుడా కలుసుకున్నాను. కానీ ఫలితం కనిపించలేదు. కనీ సైన్సు చదివిన నాకు అది సాధ్యంకాదేమో అనిపించింది. తర్వాత ఆ ప్రయత్నాలను కూడా మానుకున్నాను" అన్నాడు.

"తల్లిని ప్రేమించినట్లుగా ఈ ప్రపంచాన్ని ప్రేమించండి. లోకమంతా ప్రేమమయమన్న విషయం గుర్తుంచుకోండి. వంద సంవత్సరాలు ఎవరూ జీవింజలేరు. ఈ లోకంలో మనిషి మహా అయితే డెబ్బయ్యో ఎనభయ్యో సంవత్సరాలు బతుకుతాడు. ఈ విధంగా జీవించే సమయంలో వీలైనంత మందికి మంచిని పంచండి. అందరిలోనూ మంచిని పెంచండి. అంతకన్నా మనిషి జీవితానికి పరమార్థం లేదు. అప్పుడు మన జీవితానికి సార్ధకత ఉంటుంది.రు  మనిషిగా పుట్టినప్పుడు మన తోటి వారికి సాయపడటంలో ఉన్న ఆనందం అంతా ఇంతాకాదు. అంతకన్నా నేను ఏమీ చెప్పలేను" సౌజన్య చెప్పింది.

పాంచజన్య లేచి నిల్చున్నాడు.

"నీలాంటి పిల్లలు ఉండాలని ప్రతి తల్లీ కోరుకోవాలి. తల్లిని ప్రేమించిన వాడు లోకాన్ని ప్రేమించగలడు. నేను మా అమ్మను ప్రేమించాను. కానీ నువ్వు చెప్పిన మాటలు విన్న తర్వాత నా ప్రేమ అనీ అంత గాఢమైనది కాదేమో అనిపిస్తోంది. ఈ ఆశ్రమంలో ప్రతిపిల్లవాడు నీలాంటి ప్రేమమూర్తి కావాలని కోరుకోవడం తప్ప ఏమి చెయ్యగలను నేను" అంది సౌజన్య.

"ఈ ఆశ్రమానికి కానీ మీకు కానీ డబ్బులు సాయం చేయాలని అనుకుంటున్నాను కాదనకండి" పాంచజన్య అభ్యర్థించాడు.

"ఈ ఆశ్రమ నిబంధనల ప్రకారం విరాళాలు తీసుకోరు. దీనిని నిరంతరాయంగా నిర్వహించడానికి కావల్సిన ఆర్థిక ప్రతిపత్తులు ఉన్నాయి. ఇంక నాకా... అన్నీ వదులుకుని ఆశ్రమంలో ఉంటున్నాను. నా ఖర్చులు తిండి అన్నీ ఈ ఆశ్రమం వారే చూసుకుంటా పెద్దగా నాకు కోరికలు లేవు. ఇంక నాకు నీ ఆర్థిక సాయం ఎందుకు? వద్దు నీ దగ్గరున్న డబ్బులు మరో మంచి పనికి వినియోగించు" సౌజన్య ప్రేమగా చెప్పింది.

తర్వాత బీరువా దగ్గరకు వెళ్ళి అందులోనుంచి చిన్న సంచి తీసింది. ఆ సంచిలో మూట కట్టి ఉన్న చిన్న వెండి నాణెం బైటికి తీసి పాంచజన్యకు ఇస్తూ "మా అమ్మ తన ప్రేమకు గుర్తుగా చాన్నాళ్ళ క్రితం ఇచ్చింది. దీనిని నా దగ్గర ఉంచుకున్నాను. కానీ అది నా దగ్గరకన్నా నీవద్ద ఉంచుకుంటేనే బాగుంటుందని అనుకుంటున్నాను. నీ వంటి కొడుకుని కన్నా మీ అమ్మ అదృష్టవంతురాలు.. నువ్వు నా కొడుకువి కాకపోయినా అమ్మ మీద నీకున్న ప్రేమ చూస్తుంటే అంతకన్నా ఎక్కువ అనిపిస్తున్నావు. కాదనకుండా తీసుకో. ఇది పెద్ద ఖరీదేమీ కాదు. కానీ ప్రేమతో ఇస్తున్నది. తల్లి ప్రేమకు గుర్తుగా ఉంటుంది. నీ అమ్మ ఇచ్చినదే అనుకో. తీసుకో" అంది.

ఆ నాణాన్ని అందుకున్నప్పుడు పాంచజన్య చేతులు వణికాయి.

"సౌజన్యమ్మా ఇక్కడికి వచ్చిన వరకు మీరెవరో నాకు తెలియదు. నేను ఎవరో మీకు తెలియదు. కానీ అమ్మ ప్రేమను మరోసారి గుర్తుకు తెచ్చారు. మా అమ్మ రమణి ఎలా ప్రవర్తిస్తుందో మీరుకూడా అలానే ప్రవర్తించారు. పిల్లలంటే ఎంతో ప్రేమను చూపించే మా అమ్మ పిల్లల కోస్మ ఎన్నో మంచి పనులు చేసింది. పేద పిల్లల్ని చదివించింది. పుస్తకాలు కొంది. ఫీజులు కట్టింది. మీరు మా అమ్మలా అనిపిస్తున్నారు. మా అమ్మ మళ్ళీ మీ రూపంలో కనిపించిందని అనుకుంటున్నాను" ఈ మాటలు మెల్లమెల్లగా చెబుతున్నప్పుడు పాంచజన్య కళ్ళనుంచి కన్నీటి బొట్లు చెంపలమీదకు జాలువారాయి. గొంతు జీరబోయింది.

సౌజన్య తన తెల్లని చీర కొంగుతో పాంచజన్య కన్నీళ్ళు తుడిచింది.

"అమ్మ దగ్గర ఏడవొచ్చా? తప్పుకదూ" అనునయించింది.

పాంచజన్య కిందకు వంగుని ఆమె కాళ్ళకు నమస్కారం చేసాడు.

తర్వాత బేగ్ తీసుకుని ముందుకు కదిలాడు. వెళుతున్నప్పుడు జేబులోంచి పర్సు తీసి అమ్మ ఫొటో ఉన్న పౌచ్‌లో సౌజన్య ఇచ్చిన వెండి నాణాన్ని అందులో పెట్టుకున్నాడు. పెట్టుకున్నప్పుడు చూసాడు బిడ్డను ఎత్తుకున్న తల్లి చిత్రం స్పష్టంగా కనిపిస్తోంది.

పాంచజన్య కళ్ళు మరోసారి చెమర్చాయి. పాంచజన్యలో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. ఉద్యోగం చేయడం నిరాశను కలిగిస్తోంది. ఉదయం టిఫిన్ చేయడం, ఆఫీసువారు పంపించే కేబ్‌లో ఆఫీసుకు వెళ్ళడం, అక్కడ రాత్రివరకూ రెస్టులేకుండా పనిచేయడం.. తర్వాత రాత్రి కేంటిన్‌లో భోజనం చేసి ఏ రాత్రికో రూముకు చేరుకోవడం నిత్యకృత్యంగా ఉంది. ఈ పనులు రొటీన్‌గా అనిపిస్తున్నాయి. ఏదో తెలియని అసంతృప్తి మనసులో పేరుకుని పోయింది.

అమ్మ గుర్తుకు వస్తున్నప్పుడల్లా ఏడుపు తన్నుకుని వస్తోంది. అయినప్పటికీ నిగ్రహించుకుంటున్నాడు.

నాన్నకు రోజూ ఫోను చేసి క్షేమసమాచారాలు అడుగుతున్నాడు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని జాగ్రత్తలు చెబుతున్నాడు. మామయ్య రెండుసార్లు ఫోను చేసాడు. ఎక్కువగా మాట్లాడాలని అనిపించలేదు.

అమ్మ లేకపోవడం చాలా లోటుగా అనిపిస్తోంది. ఉద్యోగం వచ్చిన తర్వాత రోజూ అమ్మతో నాలుగుసార్లు మాట్లాడేవాడు.

ఫోనులో అమ్మ చెప్పే కబుర్లు జోకులు ఇంకా గుర్తుకు వస్తూనే ఉన్నాయి.

అమ్మ అనారోగ్యం పాలయ్యేంతవరకూ రోజూ కనీసం రెండుసార్లు అయినా మాట్లాడి సంతృప్తి పడేవాడు. ఏ విషయాన్నయినా అమ్మతో చెప్పనిదే నిద్రపట్టేదికాదు. మనసులో బాధపడినా సంతోషం కలిగినా ఆ విషయం చెప్పేవాడు.

ఎన్.ఐ.టి కురుక్షేత్రలో ఇంజనీరింగు చదివేటప్పుడు రాగింగు జరిగింది. సీనియర్లు చెప్పిన విషయం తాను చేయలేదు. ఆ పద్ధతి మంచిదికాదని వారికి సలహా కూడా ఇచ్చాడు. దాంతో అందులో సీనియర్ విద్యార్థి ఒకడు ఈడ్చి పెట్టి పాంచజన్య చెంప పగలగొట్టాడు. ఈ విషయం లెక్చరర్లకు ఫిర్యాదు చేయవచ్చో లేదో కూడా తెలీదు. ఆరోజు రాత్రి ఆ విషయం అమ్మతో ఏడుస్తూ చెప్పాడు.

మర్నాడు సాయంత్రం క్లాసులో ఉండగా ప్రిన్సిపాల్ ఫోన్ చేసి తనను పిలిపించాడు. ఎన్.ఐ.టి వంటి ప్రతిష్ఠాత్మకమైన విద్యాసంస్థలో డిపార్టుమెంటు హెడ్‌లతో మాట్లాడటమే భయంగా ఉంటుంది. ఏకంగా ప్రిన్సిపాల్ నుంచి పిలుపు రావడంతో గాబరా పడిపోయి భయపడ్డాడు.

అతని గదిలోకి వెళ్ళి భయంగా నిల్చున్నాడు.

"మీ అమ్మగారి పేరు రమణిగారా?"

ప్రిన్సిపాల్ అమ్మ పేరు ఎందుకు ప్రస్తావించాడో అర్థంకాలేదు, భయంకూడా వేసింది. "అవునుసార్. ఎందుకు?" నెమ్మదిగా అడిగాడు.

"ఉదయం విశాఖనుండి ఫోను చేసారు"

"ఏమైంది సార్?" గాబరాగా అడిగాడు పాంచజన్య.

"మగవాళ్ళలోలేని ధైర్యం మీ అమ్మగారిలో ఉంది. ఎంతవరకూ చదువుకున్నారు ఆమె?" "బి.ఎస్.సి, బి.ఇడి చదివారు. టీచరుగా పనిచేస్తున్నారు."

"నిన్న నిన్ను సీనియరు ఎవరో కొట్టారట తనపై పిర్యాదు చేసారు. జరిగింది నిజమేనా? నువ్వు నాకు ఎందుకు చెప్పలేదు? ఎక్కడో విశాఖలో ఉన్న మీ అమ్మగారి నుంచి హర్యానాలో ఉన్న కురుక్షేత్రకు ఫోను వచ్చింది" అన్నారు.

నిన్న అమ్మతో ఫోనులో మాట్లాడిన విషయం గుర్తుకు వచ్చింది.

ఈలోపు నిన్న రాగింగు చేసిన నలుగురు సీనియర్ విద్యార్థులు వచ్చారు.

ప్రిన్సిపాల్ ఎదురుగా తలొంచుకుని నిల్చున్నారు.

"మీ తల్లిదండ్రులు మీరు ఎంతో ప్రయోజకులు అవుతారని ఎంతో దూరంనుండి ఇక్కడికి పంపారు. మీరు మీ జూనియర్ని ఏడిపించి సంతోషిస్తున్నారు. మిమ్మల్ని కాలేజీ నుంచి డిబార్ చేస్తున్నాను" అన్నారు.

ముందురోజు ఎంతో పౌరుషాన్ని చూపించిన వారు బిక్కమొహం వేసారు.

నేనే వారిపై పిర్యాదు చేసానని వారు అనుకుంటున్నారు. వారిలో ఇద్దరు నావైపు కోపంగా చూసారు.

"పాంచజన్య అమ్మగారు ఫోను చేసారు. నిన్న జరిగిన విషయాన్ని పోలీసు కమీషనరుగారికి కూడా పిర్యాదు చేస్తామని అంటున్నారు. రాగింగుకు ఎటువంటి శిక్షలు ఉన్నాయో మీకు తెలుసుకదా నేనేమీ చేయలేను" అన్నారు.

వారికి మద్దత్తుగా క్లాస్ లీడరు వచ్చాడు. రాజీ ప్రయత్నాలు మొదలయ్యాయి.

పాంచజన్యకు అంతా అయోమయంగా ఉంది. విశాఖ నుంచి హర్యానా వచ్చి చదువుతున్న తనకు ఆంధ్రాకు చెందిన నలుగురు విద్యార్థులు మాత్రం తన సెక్షనులో ఉన్నారు. వారితో కూడా తనకు మంచి రిలేషను లేదు. ఈ గొడవ తర్వాత తనకు ఏమైనా అవుతుందా అని భయం పట్టుకుంది.

ప్రిన్స్పాల్ వైపు తిరిగి "సార్ నేను వీరిమీద పిర్యాదు చేయలేదు. కాలేజీలో జరిగిన ప్రతివిషయం మా అమ్మకు చెప్పడం నాకు అలవాటు. నిన్న నన్ను కొట్టిన విషయం అలా చెప్పాను అంతే" అన్నాడు భయం భయంగా.

"వాడు పుట్టినప్పటినుంచి తల్లిదండ్రులుగా వాడి శరీరం మీద మేమే ఎప్పుడు ఒక దెబ్బకూడా వేయలేదు. ఎవడో సంబంధం లేని కుర్రాడు మా అబ్బాయిని కొట్టడమేమిటని నిలదీస్తున్నారు. దీనికి సమాధానం చెప్పండి. ఏం చెయ్యమంటారు?" అడిగాడు ప్రిన్సిపాల్.

సీనియర్ విద్యార్థులు క్షమించమని పదే పదే కోరారు.

"సార్ అన్నయ్యలను క్షమించండి సార్" పాంచజన్య అభ్యర్థించాడు.

"ఈరోజు ఏదో సంగతి చెప్పకపోతే ఫాక్స్లో పిర్యాదు పంపిస్తామని అన్నారు. మిమ్మల్ని ఆవిడే క్షమించాలి" ప్రిన్సిపాల్ తిరిగి సమాధానం చెప్పారు.

సీనియర్ విద్యార్థులు పాంచజన్య పక్కకు చేరారు. రాగింగు చేస్తున్నప్పుడు ఉన్న ధైర్యం వారిలో మచ్చుకు కూడా కనిపించడం లేదు. కళ్ళల్లో భయం స్పష్టంగా కనిపిస్తోంది. కలేజీనుంచి ఇంటికి పంపించివేస్తే తల్లిదండ్రులకు ఏమి సమాధానం చెప్పాలో వారికి అంతు చిక్కడం లేదు.

"మీ అమ్మగారితో విత్‌డ్రా చేసుకోమని చెప్పవా?" ఒక విద్యార్థి.

అక్కడి పరిస్థితి చూసిన తర్వాత ప్రిన్సిపాల్ తానే చొరవతీసుకోవాలని అనుకుని రమణి సెల్‌ఫోనుకు ఫోన్ చేశాడు. అటునించి "నమస్తే సార్" అమ్మ అంటోంది.

ఫోనులో స్పీకర్ ఆన్ చేసారు.

"మేడం. మీరు చెప్పిన గొడవకు కారణమైన సీనియర్ విద్యార్థులు వచ్చారు. తప్పయిపోయింది క్షమించమని అంటున్నారు"

రమణి మొదట ఏమీ మాట్లాడలేదు. తర్వాత "ఈ ఫోను మా అబ్బాయిని కొట్టిన విద్యార్థికి ఇవ్వండి" అంది.

ఆ విద్యార్థి భయం భయంగా ఫోను అందుకున్నాడు.

"నువ్వు చెప్పిన పని చేయలేదని నీ మాట వినలేదని కొట్టేస్తావా? చిన్నవాడని నిన్ను ఏమీ చేయలేడని సీనియర్సుకు జూనియర్సు అణిగి మణిగి ఉంటారని దౌర్జన్యం చేస్తారా? కొట్టడానికి మీకు చేతులు ఎలా వచ్చాయి? తప్పు చేసినవారిని కొట్టినా అర్థముంది. వాడు ఫోనులో చెప్పిన మాటలన్నీ రికార్డు చేశాను. వాటి ఆధారంగా మీమీద చర్యలు తీసుకోవాలని అనుకుంటున్నాను" తుటాల్లా మాట్లు పేల్చింది.

ఆ కుర్రవాడు బిక్కచచ్చిపోయాడు. అమ్మ మాటలకు సమాధానం చెప్పలేకపోయాడు. తర్వాత నెమ్మదిగా "తప్పు జరిగిపోయింది. మరోసారి అలా చేయను" అన్నాడు నెమ్మదిగా జాలిగా.

"మ అబ్బాయిని కొట్టిన దెబ్బను వెనక్కి ఎవరు ఇస్తారు. వాడు పడిన మానసిక వేదన ఎవరు తీరుస్తారు?"

"సారీ మేడం."

"తప్పు చేయనివాడిని దండించడం గొప్పకాదు. తప్పుచేసిన వాడిని కూడా క్షమించడం నేర్చుకోండి. మరెప్పుడూ ఇటువంటి పనులు చేయకండి. ఎంతో దూరంలో ఉన్న మీ అమ్మానాన్నలు మీరు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లోకి వస్తారని ఆశ పడుతుంటారు కానీ మీరు వారి ఆశలను వమ్ము చేస్తుంటారు. బాగా చదువుకోండి" అంది.

తర్వాత ఫోను అందుకున్న ప్రిన్సిపాల్‌తో "సార్ ఇబ్బంది కలిగిస్తే మన్నించండి ఆ పిల్లల్ని వదిలేయండి. వారిలో మార్పురావాలని నా ప్రయత్నం" అంది.

తర్వాత సీనియర్ విద్యార్థుల వద్ద మొదటి తప్పుగా క్షమించమని క్షమాపణ కాయితాన్ని రాయించుకున్నారు. "ఇక్కడితో ఈ విషయం మరిచిపొండి. మిగిలిన వారికి చెప్పి ఈ విషయాన్ని పెద్దది చేస్తే మీరు ఈ ఇనిస్టిట్యూట్‌లోనే ఉండరు వెళ్ళండి" అని పంపించారు.

పాంచజన్యను కొట్టిన సీనియర్ విద్యార్థి తర్వాత నుంచి అతనికి మంచి స్నేహితుడయిపోయాడు. సెలవల్లో బీహార్‌లో తన గ్రామానికి రమ్మని ఆహ్వానించాడు.

అమ్మ మాటలకు అంత ప్రభావం ఎలా ఉంటుందో అర్థం కాలేదు.

"**తప్పు చేసిన** వ్యక్తిని కూడా క్షమించడంతో వాడిలో పరివర్తన వచ్చింది. నిజంగా ఆ రోజు సీనియర్లపై పిర్యాదు వెనక్కి తీసుకోకపోతే వారంతా జీవితాంతం పాంచజన్యకు విరోధులుగా తయారయ్యేవారు" అనుకున్నాడు.

అమ్మ విషయాలు గుర్తుకురాగానే పాంచజన్యకు కళ్ళు చెమర్చాయి.

అటువంటి అమ్మలేకుండా తను ఇన్ని రోజులు ఎలా గడిపానా అనే విషయం తలచుకుంటేనే ఆశ్చర్యం కలిగిస్తోంది.

అంతటి ప్రేమమూర్తిగా ఉన్న అమ్మ తన జీవితం గురించి ఏదో చెప్పాలని అనుకుంది. ఆ విషయం ఏమిటో తనకు తెలియడం లేదు. ఎంతోమంది వద్దకు వెళ్ళి అడిగినా తగిన సమాధానం రావడంలేదు.

అమ్మ చివరి మాటలు తాను తెలుసుకోవాలి.

అమ్మని ఇష్టపడి అమ్మను ప్రేమించి అమ్మ మాటను విని ఆచరించే తాను అమ్మ సందేశం తెలుసుకుని దానిని నెరవేర్చడానికి ప్రయత్నించాలి. అందుకోసం ఏమి చేయాలో అర్థంకావడంలేదు. తన మనసుకు సమాధానం చెప్పే వ్యక్తి ఎవరు ఉంటారా అనే విషయం తెలియడంలేదు.

శక్తి పీఠాలలో ఉంటున్నవారు నియమ నిష్ఠలతో ఉంటారని విన్నాడు.

అటువంటి వారిని కలిస్తే ఏమైనా ప్రయోజనం ఉంటుందా?

ఇంటర్‌నెట్‌లో వెతికి శక్తి పీఠాలను తెలుసుకున్నాడు.

తాను ఉద్యోగం చేస్తున్న బెంగుళూరు ఉన్న కర్ణాటక రాష్ట్రంలోనే శృంగేరి శక్తి పీఠం ఉన్న విషాయాన్ని తెలుసుకున్నాడు ఎలాగైనా అక్కడికి వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు.

తన సెలవులు అన్నీ అయిపోయాయి. టీం మేనేజరు ఆశ్చర్యంగా చూసాడు.

అమ్మకు బాగోలేదని రెండు నెలలు సెలవు పెట్టి విశాఖపట్నం వెళ్ళడం తల్లి చనిపోయిన తర్వాత తరచూ వివిధ ప్రాంతాలు వెళ్ళడం ఎక్కువ సెలవుల్ని వినియోగిస్తుండటం అన్నీ ఆ మేనేజరుకు తెలుసు. మానసికంగా పాంచజన్య ఎంతో బాధపడుతున్నాడు. తల్లికోసం ఎంతో ఆలోచిస్తున్నాడు. అందువల్ల అతనికి అడిగిన మేరకు సెలవులు మంజూరు చేయాలనే ఆలోచన చేస్తున్నాడు.

సెలవు మంజూరు అయిపోయింది.

రూముకి వచ్చి శృంగేరి శక్తిపీఠానికి వెళ్ళడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు.

ఆ రోజు మగతగా నిద్రపట్టింది.

భీమిలిలో ఎస్ ఓ ఎస్ అనాధాశ్రమానికి వెళ్ళమని రాజేష్ ఎలా సలహా ఇచ్చాడో మళ్ళీ శృంగేరీ శక్తి పీఠానికి వెళ్ళమని కూడా అతనే సలహా ఇచ్చాడు.

"శక్తి పీఠానికి ఎందుకు?"

"శక్తి పీఠంలో ఉన్నవారికి ప్రత్యేకమైన శక్తులు ఉంటాయి. వారి మాటలకు ఎంతో విలువ ఉంటుంది. నీ సమస్యను తెలుసుకోవడానికి అక్కడికి వెళ్ళడం మంచిది, అక్కడ అన్నీ తెలిసిన వేదాంగ పండితులు ఉంటారు."

అతను చెప్పిన ప్రకారం బస్సులో బయలుదేరాడు.

బెంగుళూరు నుంచి ఎనిమిది గంటలు ప్రయాణిస్తే శృంగేరి శక్తి పీఠం వస్తుంది.

సాయంత్రం బయలుదేరిన బస్సు కొండలు అడవుల మధ్య నుంచి ప్రయాణించి మర్నాడు తెల్లవారు ఝామున అక్కడికి చేరింది.

చుట్టూ కొండలు పర్వతాలు అడవుల మధ్యలో చిన్న పల్లెటూరు మాదిరిగా ఉంది. బస్సులు ఆగడానికి ఉన్న ప్రాంతం ఆధారంగా చాలామంది అక్కడికి వస్తుంటారన్న విషయం అర్థం అయింది. చాలా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకోసం అక్కడ విశ్రాంతి మందిరాలు, కాటేజీలు ఉన్నాయి. వాటి పేర్లు కూడా పవిత్రంగా ఉన్నాయి.

పాంచజన్య వాటిని పరిశీలించాడు. వాతావరణం అతనికి ఎంతో నచ్చింది.

కాస్త బాగున్నట్లుగా ఉన్న సచ్చిదానంద విలాస్‌లో దిగాడు. చాలా తక్కువగా ఎనభై రూపాయలతో అద్దెతో రూం దొరికింది.

రూంలో బేగ్‌ను పెట్టి స్నానం చేసాడు.

బస్సు ప్రయాణం వల్ల రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు. అయినా అలసట అనిపించలేదు. ప్రయాణ బడలిక కూడా కనిపించలేదు.

ఉదయం లేచి తలకు స్నానం చేసాడు.

అంతవరకు శక్తిపీఠాల గురించి విన్నాడు కానీ శృంగేరి పీఠం గురించి వినలేదు. రాజేష్ చెప్పిన విషయాలు మాత్రం గుర్తున్నాయి.

ఆ విలాస్‌లో చాలామంది భక్తులు విడిది చేసారు.

కేవల ఆ చిన్న గ్రామం. అక్కడ పీఠం కోసం ఏర్పడినట్లుగా ఉంది. చుట్టూ కొండలు వాటిని ఆవరించి ఉన్న పెద్ద పెద్ద వృక్షాలు అడవి మాదిరిగా ఉంది.

ఆ కాటేజీలో పనిచేస్తున్న సిబ్బంది కూడా ఆశ్రమానికి చెందినవారుగా ఉన్నారు. డబ్బులు కోసం పనిచేస్తున్న మాదిరిగా కాకుండా సేవ కోసం పనులు చేస్తున్న మాదిరిగ పాంచజన్యకు అనిపించారు. వారిమీద గౌరవభావం ఏర్పడింది.

కౌంటరులో కూర్చున్న వ్యక్తి పవిత్రంగా అనిపించాడు. అతని వద్దకు వెళ్ళిపాంచజన్య తనను తాను పరిచయం చేసుకున్నాడు. అతని పేరు అడిగితే విరించి అని చెప్పాడు.

సాధారణంగా అటువంటి ప్రాంతాలకు వచ్చే వారు భక్తులు, ఆశ్రమవాసులు, వృద్ధులు వంటి వారు వస్తుంటారు. పిల్లలు ఎవరైనా వస్తే వారు తల్లిదండ్రులతోనూ, బంధువులతోనూ కలిసి వస్తుంటారు. కానీ ఎవరూ లేకుండా బేగ్‌ను తగిలించుకుని ఒంటరిగా వచ్చిన పాంచజన్యను చూసిన విరించికి ఆశ్చర్యం కలిగించాడు. ఇటువంటి యువకులు విహార కేంద్రాలకు మాత్రం వస్తుంటారు కానీ ఇటువంటి పుణ్య క్షేత్రానికి రావడం విస్మయం కలిగించింది.

పాంచజన్య దగ్గరికి వచ్చిన తర్వాత "ఇక్కడకు ఎందుకు వచ్చావు?" అడిగాడు.

"శక్తిపీఠంలో స్వామిని కలుసుకోవాలని వచ్చాను."

విరించి ఆశ్చర్యంగా చూసాడు. రాజకీయ నాయకుడ్ని దర్శనం చేసుకుంటానన్నంత ఈజీగా చెబుతున్న పాంచజన్య వైఖరి ఆసక్తి కలిగించింది.

"కలుసుకుని ఏమి చేస్తావు?"

"స్వామితో కొన్ని విషయాలు మాట్లాడాలని ఉంది. నాలో ఉన్న అనేక సందేహాలను తీర్చుకోవాలనుకుంటున్నాను."

విరించి పాంచజన్య వైపు జాలిగా చూసాడు. తర్వాత "ఇది పవిత్రమైన శక్తి పీఠం ఇతర ఆశ్రమాలలో ఉన్న స్వాములతో మాట్లాడినట్టు ఈ పీఠంలో ఉన్నవారితో మాట్లాడటం కుదరదు. చాలా కష్టమైన పని. నీకు ఎవరు చెప్పారో కానీ వారికి ఈ పీఠం గురించి అంతగా అవగాహన ఉండి ఉండదు."

"నిజమా ఎందుకలా అంటున్నారు?" సందేహాన్ని వ్యక్తం చేసాడు.

"స్వామి నీతో మాట్లాడవచ్చు లేదా మాట్లాడకపోవచ్చు."

"అదేంటండీ అలా అంటున్నారు?"

"భారతదేశంలో ధర్మాన్ని పరిరక్షించడానికి నాలుగు దిక్కుల్లో నాలుగు పీఠాలు చాలా సంవత్సరాల క్రితం ఏర్పాటు అయి ఉన్నాయి. వాటిలో తూర్పున గోవర్ధన పీఠం, ఉత్తరాన బద్రికాశ్రమ పీఠం, పడమరాన ద్వారకా పీఠం, దక్షిణాన ఈ శృంగేరి పీఠం

ఉన్నాయి. భారత దేశంలో నాలుగువైపులా హైదవ ధర్మాన్ని నిలబెట్టడం కోస్మ ఈ పీఠాలు పనిచేస్తున్నాయి" విరించి పాంచజన్యకు వివరంగా చెప్పాడు.

"అవును ఈ పీఠాల గురించి వీటి ప్రాధాన్యతను గురించి కొంత విన్నాను."

"ఈ నాలుగు పీఠాల మధ్య వచ్చే విబేధాలు. సందేహాలు సమస్యలువంటివి తీర్చడానికి ఈ శృంగేరీ పీఠాన్ని అధిష్టాన పీఠంగా గుర్తించారు. అందుకే ఇతర పీఠాలకన్నా ఈ పీఠానికి ఎంతో ప్రతిష్ట గొప్పతనం ఉంది.

"అంత గొప్పదా?"

"అవును దీని చరిత్ర కూడా ఎంతో పురాతనమైనది. పూర్వకాలంలో రుష్యశృంగుడు అనే రుషి ఉండేవాడు. అతడినే శృంగి అని కూడా పిలిచేవారు. ఆయన ఈ ప్రాంతంలో తపస్సు చేసినట్లు కథ ప్రచారంలో ఉంది. ఆది గురువుగా చెప్పుకునే శంకరాచార్యులు కాశీ వెళుతున్న సమయంలో ఒక విచిత్రమయిన దృశ్యాన్ని చూసారట. ఈ అటవీ ప్రాంతంలో గర్భంతో ఉన్న కప్పపై వర్షపు నీరు పడకుండా ఒక పాము తన పడగతో గొడుగులా పడగను పట్టిందట. ఆ దృశ్యం ఆయన కంట పడిందిట. దానిని చూసిన శంకరాచార్యులవారు రెండు విరుద్దమైన ప్రాణుల మధ్య ఈ సఖ్యత ఉండటం ఎలా సాధ్యమని ఆశ్చర్యపోయారట. అందువల్ల ఈ ప్రాంతానికి ఎంతో పవిత్రత ఉందని భావించి ఈ అటవీ ప్రాంతంలో అమ్మవారి శక్తిపీఠాన్ని ఏర్పాటు చేసారు. ఈ ప్రాంతంలోనే సరస్వతి దేవిని అమ్మవారిగా ప్రతిష్టించారని ఇక్కడ దేవాలయం నిర్మాణాన్ని చేసారని చెబుతారు. ఇది కథగా కూడా ప్రచారంలో ఉంది." ఆ విలాస్‌లో ఉన్న విరించి వివరంగా పాంచజన్యకు చెప్పారు.

పాంచజన్యకు వింటుంటే మనసంతా అదోలా అయిపోయింది.

తాను ఎంతటి పవిత్రమైన స్థలానికి వచ్చాడో అర్ధమైంది.

"ఇటువంటి పీఠానికి అమ్మను తీసుకుని వస్తే భక్తితో పులకించి పోయి ఎంతగానో ఆనందపడిపోయేది" పాంచజన్యలో ఆలోచనల పరంపర.

అమ్మ గుర్తుకురాగానే మనసు విచలితం అయిపోయింది.

అమ్మ గురించి పీఠాధిపతిగా ఉన్న స్వామిని అడిగి తెలుసుకోవాలి తన ప్రశ్నలకు సమాధానం చెబుతారా? అసలు స్వామిని కలవడానికి వీలవుతుందా? అదే విషయాన్ని విరించిని అడిగాడు.

"కలుసుకుని ఏమి మాట్లాడతావు?"

"అమ్మ గురించి కొన్ని విషయాలు తెలుసుకోవాలి."

"ఈ పీఠానికి అధిపతిగా ఉన్న భారతీ తీర్థస్వామి డెబ్బయి సంవత్సరాల వ్యక్తి. ఎన్నో సంవత్సరాలుగా పీఠాధిపతిగా ఉంటున్నారు. ఎంతో జ్ఞాన సంపన్నుడు. ఆయనకు తెలియని విషయం లేదు. వేదవేదాంగాలు ఔపోసన పట్టారు. ఏ విషయానికైనా ఆయన వద్ద సమాధానం లభిస్తుంది. అయితే నీవు అడిగే చిన్న చిన్న ప్రశ్నలకు స్వామి సమాధానం చెబుతారో లేదో నాకు తెలియదు. స్వామి పరిస్థితి అంచనా వేయలేం" విరించి వివరించాడు.

ఈ వివరాలు తెలుసుకున్న తర్వాత పాంచజన్య మనసు తేలిక పడింది.

ఈ పీఠానికి వెళ్ళమని రాజేష్ తనకు మంచి సలహా ఇచ్చాడని అర్థం అయింది.

"అమ్మ చనిపోయిన తర్వాత చాలారోజులుగా తాను మధన పడుతున్న విషయాలను స్వామి ద్వారా తెలుసుకోవాలి. తన మనసులో సంఘర్షణకు తెరదించాలి" అనుకున్నాడు.

"నేను ఈ శృంగేరిలో రెండురోజులు ఉందామని వచ్చాను. కనీసం మరో రెండు మూడు రోజులు అయినా ఉండవలసిన అవసరం పడుతుంది. అంతవరకు ఈ కాటేజీలో ఉండటానికి అవకాశం ఉంటుందా? పర్వాలేదు కదా?" సత్యానంద విలాస్‌లో విరించిని అడిగాడు.

"పర్వాలేదు. రూముని నీకోసం ఉంచుతానులే" అన్నాడు విరించి.

పాంచజన్య అక్కడి నుంచి బైటికి వచ్చాడు.

సరస్వతీ దేవి ఆలయం ఎంతో పవిత్రంగా ఉంది.

పాంచజన్య ఆలయంలోకి వెళ్ళి అమ్మవారిని దర్శించుకున్నాడు.

పరమ గురువు శంకరాచార్యతో ప్రతిష్ఠింపబడిన దేవతగా ఆ గుడికి ఎంతో విశిష్టమైన చరిత్ర ఉంది. దేవాలయంలోకి వెళ్ళగానే శరీరమంతా పులకరించిపోయి ఎంతో పవిత్రమైన ప్రదేశంలోకి వచ్చానని అనిపించింది. మనసు చాలా ప్రశాంతంగా అయిపోయింది. అమ్మవారి విగ్రహం వైపు చూస్తుంటే గొప్ప రిలీఫ్‌గా అనిపించింది.

పాంచజన్య గుడిలో గంట సమయం గడిపాడు.

అమ్మవారి దగ్గర ఉన్న సమయంలో అమ్మ రమణి గుర్తుకురాలేదు.

సరస్వతి అమ్మవారిలో అతనికి అన్నీ కనిపించాయి.

అమ్మవారి గుడిలో పూజా కార్యక్రమాలను నిర్వహించాడు. అర్చనలు చేసారు. అక్కడి అర్చకులు అన్నీ దగ్గరుండి చేయించారు.

దేవాలయాల్లో అంత పవిత్రత ప్రశాంతత ఉంటుందా అనిపించింది. ఇతర దేవాలయాలకన్నా అమ్మవారి దేవాలయం భిన్నంగా కనిపించింది. నిర్మలమైన మనస్సుతో దేవాలయంలోనే గడిపాడు.

తర్వాత అక్కడకి దగ్గరలోనే ఉన్న చందమౌళీశ్వర లింగాన్ని కూడా భక్తితో దర్శించుకున్నాడు. ఆ లింగాన్ని చూడగానే ఏదో పవిత్రమైన భావన మనసంతా నిండిపోయింది. లింగం చుట్టూ ప్రదక్షిణలు చేసి దణ్ణం పెట్టుకున్నాడు.

కొన్నిరోజులుగా మనసులో ఉన్న ఆందోళన అంతా ఎవరో చేతితో తీసి అవతల పారవేసినట్లుగా అనిపించింది. దేవాలయాల్లో ముఖ్యంగా పురాతనమైన దేవాలయాల్లో ఇటువంటి ప్రశాంతమైన వాతావరణం ఉంటుందని మొదటిసారి గుర్తించాడు.

ఆ సమీపంలో ఉన్న తుంగ నది వద్దకు వెళ్ళాడు.

ఓ పక్కనున్న కొండలపై నుంచి జాలువారుతున్న జలపాతం ఎంతో ఆకర్షణీయంగా ఉంది. అక్కడికి వెళ్ళి ఆ నది నీటిలో పవిత్ర స్నానం చేసాడు. గంటపాటు జలపాతం వద్ద ఉండిపోయాడు. చాలా దూర ప్రాంతాల నుంచి ఎంతోమంది భక్తులు ఆ ప్రాంతానికి వచ్చారు. చాలామంది భక్తులు ఆ జలపాతం వద్ద స్నానాలు చేస్తున్నారు.

తర్వాత స్వామి వారి ఆశ్రమం గురించి అడిగాడు.

"ఆ సమీపంలోనే తుంగ నది మీద పెద్ద వంతెన ఉంది. ఈ వంతెన పై నుంచి ప్రయాణించి దానిని దాటుకుని అవతల వైపుకు వెళితే అక్కడ భారతీ తీర్థస్వామి ఆశ్రమం ఇతర దేవాలయాలు చాలా ఉన్నాయి" అన్నారు అక్కడున్న భక్తులు.

వంతెన దాటుతున్నప్పుడు ఏమీ అనిపించలేదు.

ఆశ్రమానికి చేరుకుంటున్న సమయంలో శరీరంలో ఏదో అలజడి అనిపించింది. కాళ్ళు తడబడ్డాయి. తాను ఏదో పవిత్రమైన ప్రదేశానికి వచ్చిన ఫీలింగు పాంచజన్యకు కలిగింది.

ఆశ్రమంలో ప్రవేశించాడు పాంచజన్య. అక్కడ చాలామంది భక్తులు ఉన్నారు. వారిలో చాలామంది స్వామిని దర్శించుకోవడానికి వచ్చారు. మరి కొంతమంది ఆ ప్రాంతాన్ని చూడటానికి వచ్చినట్టుగా ఉన్నారు. అక్కడ పూల మొక్కలతో ఉన్న ఉద్యానవనం ఇతర కట్టడాలు ఎంతో అందంగా పవిత్రంగా అనిపించాయి.

ఆశ్రమంలో ప్రవేశించిన తర్వాత స్వామి మందిరం దూరంగా ఉంది. స్వామిని కలుసుకోవాలంటే ఆ మందిరంలోకి ప్రవేశించాలి. ఎంతో విశాలంగా వందల మంది పట్టే విధంగా ఉంది లోపలికి వెళ్ళగానే చల్లనిగాలి శరీరాన్ని తాకింది. శరీరంలో కొత్త అలజడి కలిగినట్లుగా పాంచజన్యకు అనిపించింది. స్వామిని కలుసుకోవడానికి క్యూలైనులోకి వెళ్ళాడు.

స్వామి పీఠంపై ఆశీనులై ఉన్నారు.

అతని చుట్టూ కొంతమంది శిష్యులు ఉన్నారు.

వరుసగా లైను కట్టి భక్తుల్లను ఆశ్రమంలో ఉన్న శిష్యులు ముందుకు పంపిస్తున్నారు. చాలామంది స్వామిని దర్శించుకుని ఆయనకు నమస్కారాలు చేసి ఏమీ మాట్లాడకుండా వెనక్కి వస్తున్నారు. మరికొంతమంది భక్తులు స్వామిని కలుసుకుని నమస్కారం చేసిన తర్వాత ఏవో ప్రశ్నలు అడుగుతున్నారు. కొన్నింటికి ఆయన సమాధానం చెబుతున్నారు అలా వస్తున్న భక్తులు ఎక్కువ సమయం తీసుకోకుండా అక్కడున్న స్వామి వారి శిష్యులు జాగ్రత్తలు తీసుకుంటూ వస్తున్న వారికి వేరే మార్గం ద్వారా బైటికి పంపిస్తున్నారు.

"తనకు స్వామి వారితో మాట్లాడటం కుదురుతుందా?" అనుకున్నాడు.

పాంచజన్య మనసులో అమ్మ రమణిని ప్రార్థించుకున్నాడు. "అమ్మా నువ్వు లేని లోటును నేను భరించలేకుండా ఉన్నాను. అమ్మ అనే మహత్తరమైన మాటకు నువ్వు ప్రతిరూపం. నువ్వు ఈ లోకంలో లేకుండా వంటరిగా నేను ఇన్నిరోజులు ఎలా ఉన్నానో నాకే అర్థం కావడంలేదు. స్వామిని కలుసుకోవడానికి శృంగేరీ పీఠానికి వచ్చాను. నాకున్న సందేహాలన్నీ ఆయన తీర్చేలా ఆశీర్వదించమ్మా" అని మనసులోనే కోరుకున్నాడు.

లైనులో నడుచుకుని స్వామి దగ్గరకు వెళ్ళాడు పాంచజన్య.

భారతీ తీర్థస్వామిని చూసిన తర్వాత నోటి వెంబడి మాటలు రాలేదు.

ఆయన మొహంలో వర్చస్సు ఒకలాంటి తేజస్సు పాంచజన్యను విచలితుడ్ని చేసాయి. స్వామిని ఏమి అడగాలో ఆయనతో ఎలా మాట్లాడాలో తెలియలేదు. ఆయన కాళ్ళకు నమస్కారం చేసి కళ్ళప్పగించి చూస్తుండిపోయాడు. నోరు పెగలలేదు. మనసంతా మొద్దుబారిపోయింది. అచేతనుడిలా అయిపోయాడు.

పాంచజన్యను స్వామి తేరిపార చూసారు. ఆయన మనసులోనే అంచనా వేయగలిగాడు. వేదవేదాంగ పారంగతుడైన స్వామికి అర్థమైందనుకుంటాను.

"ఏమి నాయనా? ఏమి కావాలి?" ఆయనే ప్రశ్నించారు.

స్వామి మాటలకు పాంచజన్య ఈ లోకంలోకి వచ్చాడు.

"స్వామీ నేను చాలా దూరం నుంచి తమ కోసం వచ్చాను. ఎన్నో ప్రాంతాలు తిరిగాను. ఎంతోమందిని కలుసుకున్నాను" మెల్లమెల్లగా చెప్పి ఆగిపోయాడు.

స్వామికి పాంచజన్య పరిస్థితి అర్థం అయింది. "చెప్పు నాయనా! ఏమైనా బాధలో ఉన్నావా?" అడిగాడు.

అతని మాటలు పూర్తికాకముందు పాంచజన్యకు కంటి నుంచి నీరు కారిపోతుంది. గొంతులో నుంచి దుఃఖం తన్నుకుని వచ్చింది. కష్టం వచ్చిన సమయంలో ఆత్మీయులెవరైనా కనిపిస్తే వచ్చే ఏడుపులాంటిది అతని గొంతులోంచి తన్నుకుని వచ్చింది. బోరు బోరున ఏడవడం మొదలుపెట్టాడు.

వరుసలో ఉన్నవారు తోసుకుని వస్తున్నారు.

స్వామి వారు శిష్యులవైపు చూసారు.

అందులో ఒక శిష్యుడు వెనకనున్న వారికి ఇబ్బంది కలగకుండా పాంచజన్యను లైను నుంచి పక్కకు తీసి ఓ పక్కన నిల్చోబెట్టాడు. స్వామి కోసం వచ్చే భక్తుల లైను స్వామికి నమస్కారాలు చేస్తూ ముందుకు కదిలింది.

దుఃఖం తీరేంతవరకు రెండు నిమిషాలు ఏడ్చిన తర్వాత తనంత తాను ఏడుపు నుంచీ బైటపడ్డాడు.

అది గమనించి అక్కడున్న శిష్యుడు పాంచజన్య వివరాలు అడిగాడు.

పాంచజన్య మొత్తం తన వివరాలు చెప్పాడు. తాను స్వామి దగ్గరకు ఎందుకు వచ్చాడన్న విషయాన్ని అతనికి వివరించి "స్వామితో కొన్ని నిమిషాలు మాట్లాడే అవకాశాన్ని దయచేసి నాకు కల్పించండి" అభ్యర్థించాడు.

ఆ శిష్యుడు పాంచజన్యకు ఏమీ సమాధానం చెప్పలేదు.

భక్తుల తాకిడి తగ్గిన తర్వాత స్వామి దగ్గరకు వెళ్ళి దూరంగా ఉన్న పాంచజన్యను చూపించి ఏదో చెప్పాడు. స్వామి ఏమి సమాధానం చెబుతారా అని మనసులో అలజడి పేరుకుని పోయింది.

ఆ తర్వాత ఆ శిష్యుడు దగ్గరకు వచ్చి "స్వామి ఉండమన్నారు" అన్నాడు.

పాంచజన్య మనసులో పేరుకుని పోయిన ఆందోళన అంతా ఎవరో తీసివేసిన విధంగా అయిపోయింది. ఎంతో తేలిక పడిపోయింది.

పాంచజన్య మనసంతా నిస్తేజంగా అయిపోయింది.

స్వామితో మాట్లాడే అవకాశం కలుగుతుందన్న ఆనందం ఒకవైపు సంతోషాన్ని కలిగిస్తుండగా ఉపనిషత్తులు వేదాలు ఔపోసన పట్టిన అంత ప్రముఖమైన వ్యక్తితో తాను ఎలా మాట్లాడగలనన్న దిగులు కూడా మనసంతా నిండిపోయింది.

గంట తర్వాత పాంచజన్యకు పిలుపు వచ్చింది.

సాధారణంగా పీఠాధిపతులు వచ్చిన భక్తులతో సాధారణంగా మాట్లాడుతుంటారు. ప్రైవేటు సంభాషణలకు మొగ్గు చూపించరు కానీ పాంచజన్య విషయంలో ఆ విధంగా మాట్లాడాలని అనుకోవడం అక్కడున్న శిష్యులకు కూడా ఆశ్చర్యం కలిగించింది.

పక్కనున్న గదిలోకి తీసుకుని వెళ్ళారు.

గదిలో కింద పరదా వేసి ఉంది. ఎదురుగా పెద్ద పీఠం ఉంది. అక్కడ ఒక పెద్ద ఆసనం ఉంది. స్వామి అక్కడ కూర్చోడానికి ఏర్పాట్లు ఉన్నాయి.

దర్శనాలు అయిన తర్వాత స్వామి అక్కడికి వచ్చారు.

స్వామిని చూడగానే పాంచజన్య అతని కాళ్ళమీద పడి సాష్టాంగ నమస్కారం చేసాడు. స్వామి అతని తలమీద చేతితో తట్టి లేచి కూర్చోబెట్టారు.

అప్పటికే ఒకలాంటి ట్రాన్సులో ఉన్న పాంచజన్య ఏమీ మాట్లాడలేదు.

రెండు నిమిషాల తర్వాత స్వామి పాంచజన్య వైపు నవ్వుతూ చూసి "ఎందుకో నువ్వు చెప్పాలనుకున్నది వినాలని అనుకుంటున్నాను. నువ్వు ఒకలాంటి బాధలో మునిగి ఉన్నావని అర్ధమైంది" అన్నారు.

స్వామి అలా అనగానే పాంచజన్యకు మరోసారి కన్నీళ్ళు వచ్చాయి.

"స్వామీ నేను చాలా ప్రాంతాలు తిరిగాను. నా సమస్యకు పరిష్కారం కనిపించడంలేదు. తమ వద్దకు వచ్చి నా సందేహం తీర్చుకోవాలని అనుకుంటున్నాను. తమరు నాకు అనుగ్రహం కలిగించినందుకు ఎంతో ఆనందంగా ఉంది. అసలు తమతో ఈ విధంగా మాట్లాడే అవకాశం వస్తుందని కలలో కూడా అనుకోలేదు" అన్నాడు.

స్వామి పాంచజన్యవైపు తేరిపార చూసాడు.

నూనూగు మీసాలతో నూత్న యవ్వనంలో ఉన్నట్లుగా ఉన్నాడు. సాధారణంగా ఆ వయసులో ఉన్నవారు భక్తి గురించి, పీఠాధిపతులు గురించి ఆలోచించరు. కానీ ఏదో బాధతో తన వద్దకు వచ్చిన కుర్రవాడిని సంతృప్తి పరిచి పంపించాలన్న ఆలోచనతో మాత్రమే ఏకాంతంగా మాట్లాడటానికి అవకాశం కలిగించారు.

"స్వామీ ఆరునెలల నుంచి నేను తెలియని బాధలో ఉన్నాను."

స్వామి పాంచజన్యవైపు నిర్లిప్తంగా చూసారు.

"నాకులా అందరూ ఆలోచిస్తారో ఆలోచించరో నాకు తెలియదు కానీ నేను ఆలోచిస్తున్నాను. నా ఆలోచన తప్పో కాదో కూడా నాకు తెలియదు."

‘**మనసులో** ఉన్నదానిని బైటికి చెప్పుకుంటే బాగుంటుంది.‘

స్వామి నుంచి అంగీకారం లభించినట్లుగా అనిపించింది.

వెంటనే తన మనసులో గూడుకట్టుకున్న విషాదాన్ని మాటల్లోకి మార్చి స్వామిముందు ఆవిష్కరించాడు. మొత్తం జరిగిన విషయాలన్నీ ఏకరువు పెట్టాడు. తాను ఎంతమంది వద్దకు ఎలా వెళ్ళాలన్న విషయాలను వివరించాడు.

స్వామి పాంచజన్య చెబుతున్న విషయాలన్నీ విన్నారు.

తన కుటుంబ పరిస్థితులు, చిన్నతనం నుంచి అమ్మను ప్రేమిస్తూ పెరగడం, అమ్మతో అనుబంధం, చివరి దశలో ఆపరేషను చేయలేని భాగంలో కురుపు రావడం, దానిని తగ్గించడానికి తాను వైద్యరంగంలో ఎంతోమందిని కలుసుకోవడం, ఎంతమంది వైద్యులవద్దకు వెళ్ళి అమ్మను వారికి చూపించడం, ఎంతో కష్టపడి శ్రమ పడి ఏజన్సీ ప్రాంతాలకు వెళ్ళి మందులను తీసుకుని రావడం భగవంతుడ్ని ప్రార్థించడం, అయినప్పటికీ అమ్మ బతకకపోవడం, అమ్మకు తగ్గడం కోసం రకరకాల మొక్కులను మొక్కుకోవడం.. వంటి విషయాలన్నీ చెప్పాడు.

"అమ్మకు పూర్తిగా తగ్గిపోయి అందరిలా ఉంటే బ్రహ్మచర్యం పాటించి జీవితాంతం బ్రహ్మచారిగా ఉండిపోయి జీవితంలో మరి పెళ్ళిచేసుకోనని అస్కలిత బ్రహ్మచారిగా ఉండిపోతానని కూడా భగవంతుడి వద్ద ప్రమాణం చేసాను. కానీ నేను నమ్ముకున్న భగవంతుడు నామీద కనికరం కూడా చూపించలేదు. అమ్మను నానుంచి దూరం చేసాడు" అన్నాడు పాంచజన్య ఏడుస్తూ. మాట్లాడుతున్నప్పుడు తడబడలేదు. చెప్పవలసిన విషయాన్ని స్వామికి చెప్పాడు.

స్వామి అన్నీ విన్న తర్వాత నెమ్మదిగా నోరు విప్పారు.

"అమ్మ బ్రతకడం కోసం బ్రహ్మచర్యాన్ని అవలంబిస్తానని అనుకోవడం నీ దృష్టిలో మంచి ఆలోచనగా అనుకుంటున్నావా?" స్వామి ప్రశ్నించారు.

"నాకు తెలియదు స్వామీ. అమ్మ ప్రాణాలతో ఉండాలని కోరుకున్నాను. ఆమె బాధపడకూడదని మొక్కుకున్నాను. ఆమె అందరిలా ఆరోగ్యంగా ఉండాలని నాతో ముందులా సరదాగా ఆనందంగా ఉండాలని మనసులో కోరుకున్నాను. అమ్మకోసం ఏ త్యాగం చేయడానికైనా సిద్ధంగా ఉన్నానని చెప్పడానికి ఆ విధంగా మొక్కుకున్నాను."

"ప్రకృతి ధర్మానికి విరుద్ధంగా నిన్ను నువ్వు త్యాగం చేయడం ద్వారా భగవంతుడ్ని కోరికలు కోరుకోవడం సరికాదు నాయనా? పుట్టిన ప్రతి వ్యక్తి చనిపోక తప్పదు. మీ అమ్మగారు ఎన్నో మంచి పనులు చేసారు వాటి ఫలితాన్ని కూడా అనుభవించారు. ఆమెతో ఉన్న అతి సన్నిహితం వల్ల ఆమె లేకుండా ఉండలేనితనం వల్ల అలా అనుకున్నావు."

"అంటే ఏమిటి స్వామీ?"

"మనిషి చేసిన కర్మలకు అనుగుణంగా అతను ఈ లోకంలో జీవించి ఉన్న సమయంలో వాటికి సంబంధించిన కర్మఫలాన్ని అనుభవించక తప్పదు. మీ అమ్మగారు కర్మానుసారం అన్ని కార్యక్రమాలు జరిగాయి. దానికి అంత బాధపడకూడదు."

"నాకు తెలిసినంతవరకు అమ్మ చాలా మంచిది. ఎంతో మందికి ఉపకారాలు చేసింది. ఎవరికి కష్టం వచ్చినా తట్టుకోలేకపోయేది. ప్రతివారికి సాయపడేది. అందరినీ ఎంతో ప్రేమతో చూసేది. అటువంటి అమ్మ అంత దారుణంగా ఎందుకు చనిపోయిందన్న విషయం నాకు సందేహంగా ఉండిపోయింది."

"అంటే?"

"తన నడుం వెనుక కురుపువల్ల చనిపోవడానికి ఆరునెలల ముందు నుంచీ అమ్మ రోజూ ఎంతో బాధను అనుభవించింది. ప్రతిరోజూ నొప్పిని దిగమింగుకోవడానికి చాలా బాధను అనుభవించింది, ప్రతిరోజూ ఎన్నో కష్టాలు పడింది. చివరిలో చనిపోవడానికి కొద్ది రోజుల ముందు బాధతో మాట్లాడేది. శత్రువులకు పగ వాడికి కూడా అటువంటి బాధ రాకూడదని తన పరిస్థితిని ఎవరికీ కల్పించవద్దని భగవంతుడ్ని వేడుకునేది. తన బాధలను ఇతరులకు బాధలు లేకుండా అనుభవించింది" అన్నాడు పాంచజన్య విచారంగా.

"కర్మఫలం అనుభవించవలసిందే"

"చనిపోవడానికి ముందు చివరి దశలో అమ్మ శరీరంలో ఒక్కొక్క అవయవం క్రమక్రమంగా పనిచేయడం మానేసాయి. ముందు శరీరం అదుపు తప్పింది. లివర్‌లోకి నీరు చేరింది. కిడ్నీ పనిచేయడం మానేసింది. బాధలన్నీ ఆమెను చుట్టుముట్టాయి. క్రమంగా అమ్మ కోమాలోకి వెళ్ళిపోయింది. మాట్లాడలేని చూడలేని స్థితిలో కొన్ని గంటలపాటు ప్రాణంతో ఉండిపోయింది. మేము మాట్లాడిన మాటలు తాను వినగలిగేది కానీ తిరిగి సమాధానం చెప్పలేకపోయేది. కళ్ళ వెంబడి కన్నీరు కార్చేది. తలను పక్కకు వాల్చేసేది. ఈ పరిస్థితిని నేను దగ్గర నుంచి గమనించాను. నేను ఇష్టపడిన వ్యక్తి నన్ను అమితంగా ప్రేమించిన మనిషి ఆ విధంగా అయిపోవడం నేను ఇప్పటికీ కూడా తట్టుకోలేకుండా ఉన్నాను. అటువంటి దయనీయమైన పరిస్థితి అంత మంచి వ్యక్తికి ఎందుకు వచ్చిందో నాకు తెలియడం లేదు. భగవంతుడు ఆమెకు అంత పెద్ద శిక్ష విధించి అంత కష్టం ఎందుకు ఇచ్చాడో నాకు అర్థం కావడంలేదు" పాంచజన్య ఈ మాటలు చెబుతున్నప్పుడు అతని కళ్ళవెంబడి కన్నీళ్ళు కారుతూనే ఉన్నాయి.

"నాయనా అది శిక్షకాదు గత జన్మలో చేసుకున్న కర్మానుసరం అనుభవించి ఉంటుంది. ఈ జన్మలో మంచి పనులు చేయడం వల్ల నువ్వు అనుకున్నంత నీ తల్లి ఇబ్బంది పడలేదు. ఆమె పోషణ భారం చూడటానికి ఎంతోమంది కుటుంబ సభ్యులు ఉన్నారు.

నిరంతరం ప్రేమించే నువ్వు మీ తండ్రిగారు ఆమె పక్కనే ఉన్నారు. చాలామంది వైద్యం చేయించడానికి కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంటారు. అటువంటి వారిలా కాకుండా నువ్వు మీ తండ్రిగారు ఉద్యోగస్తులు. ఆస్తిపరులు కావడం వల్ల మీ వద్ద ఆమె కోసం ఖర్చు పెట్టడానికి డబ్బులు పుష్కలంగా ఉన్నాయి. మీకు మంచి స్తోమత ఉంది. ఎటువంటి ఇబ్బంది లేకుండా అప్పు చేయనవసరంలేకుండా అన్ని పనులు చేయడానికి భగవంతుడు మీకు అవకాశం ఇచ్చాడు. మీరు ఆ పరిస్థితిలో లేకపోతే మీ అమ్మగారి పడిన కష్టాలు తీరేవా? మీ ఆర్థిక స్థితి సరిగా లేకపోతే ఆమె ఆరోగ్య పరిస్థితి మరింత దారుణంగా ఉండేది కదా? అది కూడా ఒక మంచి మనిషి అయిన మీ అమ్మగారికి భగవంతుడు ఇచ్చిన వరం అనుకోవచ్చుకదా?

"అన్నీ ఉన్నప్పటికీ ఎంతో బాధపడుతూ అమ్మ చనిపోయింది"

"భగవంతుడు అనుభవించే కర్మను వంద రూపాయి కాసులుగా ఇచ్చాడనుకుందాం. కర్మానుసారం ఆ వంద రూపాయి కాసుల భారాన్ని ఆ వ్యక్తి జీవితాంతం మోయాలి. అంటే భరించాలి. మీ తల్లిగారికి అదే పరిస్థితి ఉందని అనుకుందాం. ఆమె ఈ జన్మలో చాలా మంచి పనులు చేసారు దేముని కృపలో ఉన్నారు. అందువల్ల భగవంతుడు ఆమెకు కాస్త వెసులుబాటు కల్పించాడు. ఆమె మోయవలసిన ఈ బరువైన వంద కాసులలో యాభై కాసులకు బదులు యాభై రుపాయల కాగితం నోటు ఇచ్చారు. అంటే మోసే వంద రూపాయల భారం తగ్గలేదు. కానీ మోసే విధానం మారిపోయింది. యాభై బరువైన కాసులతోపాటు తేలికగా ఉండే మరో యాభై కాసులకు బదులు నోటును మోసిందని అనుకోవాలి. ఆమె కర్మకు మరెంతో బాధపడవలసిన పరిస్థితి ఉండేది. కానీ ఆమె చేసిన పనుల కారణంగా ఆ బరువును మీ సేవల ద్వారా భగవంతుడు ఆమె కర్మను తగ్గించడానికి ప్రయత్నించాడని అనుకోవాలి. భగవంతుడు ఆమె కర్మఫలాన్ని అనుభవించడానికి మంచి అవకాశం కల్పించాడు. కానీ కర్మఫలాన్ని మాత్రం తగ్గించలేదు. తాము చేసిన పనులకు సంబంధించి కర్మఫలాన్ని అందరూ ఈ లోకంలో బతికి ఉన్నప్పుడే అనుభవించాలి. కానీ భగవంతునిపై ఉన్న భక్తి కొంత మేర దానిని తగ్గిస్తుంది. అదే మీ అమ్మగారి విషయంలో జరిగింది. చుట్టుపక్కలవారు, స్నేహితులు, కుటుంబసభ్యులు అందరి ప్రేమను ఆమె అనుభవించింది. కొద్ది రోజులు కష్టాలను అనుభవించిన తర్వాత మాత్రమే ఆమె చనిపోయింది. ఈ లోకంలోనే తన కర్మఫలాన్ని అనుభవించడానికి మీ అమ్మగారికి భగవంతుడు అవకాశం కల్పించాడు. ఎక్కువ కష్టాలను కలిగించలేదు. ఆ కష్టాలు ఎక్కువగా ఉన్నాయని నువ్వు అనుకుంటున్నావు కానీ అవి తక్కువే" స్వామి వివరించారు.

స్వామి వివరణ కొంతవరకూ అర్థమై అర్థం కానట్లుగా అనిపించింది.

పాంచజన్య సందేహంగా మొహం పెట్టాడు.

తర్వాత "స్వామీ ఎంతోమందికి ఎన్నో ఉపకారాలు చేసిన అమ్మ అన్ని బాధలు పడుతూ ఎందుకు చనిపోయిందో నాకు సరిగా అర్థంకావడంలేదు" అన్నాడు.

స్వామి పాంచజన్య వైపు తీక్షణంగా చూసారు.

ఆ చూపులకు అర్థం ఏమిటో పాంచజన్యకు తెలియలేదు. స్వామి వైపు చూడలేక తలను కిందకు దించుకుని అలా ఉండిపోయాడు.

"ప్రతి దానికీ ఒక కారణం ఉంటుంది. ఏ కారణం లేకుండా ఏమీ జరగదు."

పాంచజన్య నోటి వెంబడి మాటలు రాలేదు.

"అమ్మవారు అనుగ్రహిస్తే ఆ కారణం కూడా నీకే తెలుస్తుంది."

స్వామి సమాధానం పాంచజన్యకు అర్థం కాలేదు. అయిన ఏమీ సమాధానం చెప్పకుండా ప్రశ్నలు అడగకుండా ఆయనవైపు చూస్తుండిపోయాడు.

స్వామి అక్కడున్న ఒక వ్యక్తిని పిలిచి చెవిలో ఏదో చెప్పారు.

ఏమి చెప్పారో పాంచజన్యకు అర్థం కాలేదు.

పదినిమిషాల తర్వాత శిష్యుడు ఒక జిలేబీని తీసుకుని వచ్చి స్వామి చేతికి అందించాడు. దానిని అందుకుని ఆయన పాంచజన్యకు చూపించారు.

"చూసావా ఈ జిలేబీ గుండ్రంగా ఉంది. కానీ దీని మధ్యలో ఎన్ని మలుపులు ఉన్నాయో మనిషి జీవితంలో కూడా అన్ని మలుపులు ఉంటాయి. ఎన్ని కష్టాలు వచ్చినా బాధపడకుండా పదిమందికి తీపిని పంచేవాడంటేనే భగవంతుడికి ఇష్టం. పదిమందికి సేవచేయడం కోసం ఈ శరీరం ఇవ్వబడింది. ప్రాణం శరీరంలో ఉన్నంతకాలం ఇతరులకు ఉపకారం చేస్తూ ఉండాలి. అదే పరమార్థం"

"కర్మ గురించి" పాంచజన్య మాటలు పూర్తికాలేదు.

స్వామి సాలోచనగా చూస్తుండిపోయారు.

తర్వాత పాంచజన్య ఆయనవైపు వినమ్రంగా చూస్తూ "స్వామీ మా అమ్మకు మోక్షం లభించిందంటారా? చెప్పండి స్వామి?"

"మోక్షం కావాలంటే మనిషి జీవితంలో మంచీ చెడూ ఉండకూడదు. మంచి ఎక్కువ అయినా మంచి తక్కువైనా దానిని అనుభవించడానికి భగవంతుడు అవకాశం కల్పిస్తాడు రెండూ సమానంగా ఉంటే మోక్షం వస్తుంది."

స్వామి చెబుతున్న మాటలు తాత్వికతతో నిండి ఉండటంతో అర్థమయ్యీ కానట్టుగా ఉన్నాయి. పాంచజన్య వాటిని జాగ్రత్తగా వింటున్నాడు. ఎదురు ప్రశ్నించడం తన వంటి చిన్నవాళ్ళకు తగదని తెలుసుకున్నాడు. అయితే తన మనసును కొన్ని రోజులుగా కలవరపెడుతున్న విషయాన్ని కూడా స్వామి వద్ద ప్రస్తావించి తెలుసుకోవాలని అనుకున్నాడు.

ఆ పీఠంలో చాలామంది ఉన్నారు. వారు వివిధ పనులలో నిరంతరం నిమగ్నమై ఉంటారు. ఎవరితోనూ ఎక్కువ సమయం మాట్లాడని స్వామి ఏకాంతంతో పాంచజన్యతో మాట్లాడటాన్ని వారిలో చాలామంది ఆశ్చర్యంగా చెప్పుకుంటున్నారు. పెద్ద పెద్ద వేదపండితులు ప్రముఖులు వచ్చినప్పుడు కూడా వారితో కూడా చర్చలు జరపడానికి ఎక్కువ సమయాన్ని కేటాయించలేని స్వామి ఇరవై సంవత్సరాల కుర్రవాడితో సుదీర్ఘంగా మాట్లాడటం వారికి ఎందుకో అర్థంకావడంలేదు.

స్వామి ఏమి చేసినా అందులో అర్థం పరమార్థం ఉంటుందని వారి సరిపెట్టుకుని అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

"స్వామీ మరో విషయం. తమరు చెప్పిన విషయాలు నాలాంటి చిన్నవాళ్ళకు అర్థమవుతాయో లేదో తెలియదు కానీ నేను ఈ విషయాలను అర్థం చేసుకుంటున్నాను. తమరు చెప్పిన వాటిలో కొన్ని అంశాలు నాకు తెలుస్తున్నాయి. కానీ స్వామీ..." ఆగిపోయాడు.

"చెప్పు నాయనా?"

"నేను ఎవరి కోసం బతకాలి? ఎందుకు బతకాలి. అనిపిస్తోంది. అమ్మలేకుండా నేను ఎందుకు ఉండాలన్న ప్రశ్న నా మనసుని తొలిచేస్తోంది. నాకు ఈ ప్రపంచంలో అత్యంత ఇష్టమైనది అమ్మే. ఆమే లేనప్పుడు నేను బ్రతికి ప్రయోజనం ఏమిటి? అని అనిపిస్తోంది. అంతేకాకుండా అమ్మ చనిపోయే సమయంలో నోటివెంబడి మాటలు రానప్పుడు నాతో ఏదో మాట్లాడాలని అనుకుంది కానీ ఆ మాటలు ఏమిటో నాకు తెలియడంలేదు వాటిని తెలుసుకోవాలని నా మనసు తహ తహలాడుతోంది" మెల్లమెల్లగా చెప్పాడు.

స్వామి ఏమీ మాట్లాడలేదు.

పాంచజన్య వైపు తేరిపార చూసాడు.

తర్వాత దూరంగా ఉన్న శిష్యులవైపు చూసారు.

ఇంతలో ఒక వ్యక్తి పాంచజన్య దగ్గరకు వచ్చాడు.

నేలమీద పరదాపై కూర్చున్న పాంచజన్య లేచి నిలబడ్డాడు.

"స్వామికి వేరే పని ఉంది. ఆశ్రమంలో రథయాత్ర కోసం ఏర్పాట్లు చేయాలి. తమరు విశ్రాంతి తీసుకోండి" అని పాంచజన్య వైపు చూస్తూ చెప్పాడు ఆ వ్యక్తి.

అతను అలా అనగానే స్వామి లేచి నిల్చుని పక్కకు తిరిగారు.

స్వామి ఎప్పుడు లేస్తారా అని ఎదురు చూస్తున్న పీఠంలో ఉన్న ఇతర వ్యక్తులు స్వామిని అనుసరించారు. స్వామి ముందు సాగిపోయారు.

పాంచజన్య ఉండిపోయాడు వంటరిగా.

పాంచజన్యకు ఎంతో అసహనంగా ఉంది.

ముందురోజు స్వామితో జరిపిన సంభాషణ పదే పదే గుర్తుకు వస్తోంది.

కర్మఫలం గురించి స్వామి చెప్పిన విషయం అమ్మ విషయంలో నిజమేనేమో అనిపించింది. గత జన్మ ఉందో లేదో తెలియదు కానీ అమ్మ చేసిన కర్మఫలాన్ని ఈ జన్మలో అనుభవించింది. అందుకే చివరలో ఎంతో బాధపడుతూ చనిపోయింది అనుకున్నాడు.

చాలామందితో పోలిస్తే అమ్మ అదృష్టవంతురాలే అనిపించింది.

మంచం మీద లేవలేని పరిస్థితుల్లో ఎటువంటి సేవలను అమ్మ చేయించుకోలేదు. కొంతమంది బతికి ఉన్నప్పుడు అందరి ప్రేమను పొందుతారు. ఎంతోమంది ఇష్టపడతారు. అటువంటి వ్యక్తి అనారోగ్యం పాలై లేవలేని స్థితిలో మంచానికి పరిమితం అయిపోతే కొంతకాలం ఇబ్బంది లేకుండా సేవలు చేస్తారు. తామంతా ఎంతగానో ప్రేమించిన వ్యక్తికోసం రకరకాల సేవలు చేస్తారు. తామంతా ఎంతగానో ప్రేమించిన వ్యక్తికోసం రకరకాల సేవలు చేస్తారు. అలా కొంతకాలం అయిన తర్వాత వారిలో ఒకలాంటి విసుగు వస్తుంది ఈ సేవలు చేయించుకుంటున్న వ్యక్తి ఎంత తొందరగా చనిపోతుందా అని అందరూ కోరుకునే పరిస్థితి చాలామంది విషయంలో వస్తుంది మంచానికే పరిమితం అయిపోయి అన్ని పనులు కూడా మంచం మీదే చేస్తున్న వ్యక్తికి కూడా నాకు ఈ జీవితం ఎందుకు భగవంతుడా నన్ను తొందరగా ఈ లోకం నుంచి తీసుకుని పో అని కోరుకుంటారు. అటువంటి వారికి కూడా తొందరగా చావు వచ్చే అవకాశం కూడా భగవంతుడు కల్పించడు. అటువంటి వారి పరిస్థితి ఎంతో దుర్భరంగా ఉంటుంది.

కానీ అమ్మకు మాత్రం ఎక్కువ బాధలు పడకుండా చనిపోయే అవకాశం కల్పించడం కూడా భగవంతుని ఆలోచనేనా అనిపించింది.

స్వామి చెప్పిన మాటలలో ఇదే అర్థం గోచరించింది.

చివరిలో తన ప్రశ్నలకు స్వామి ఎందుకు సమాధానం చెప్పలేదు తమ మధ్య సంభాషణను అర్ధాంతరంగా ఎందుకు ముగించారన్న విషయం చెప్పలేదు తమ మధ్య సంభాషణను అర్ధాంతరంగా ఎందుకు ముగించారన్న విషయం అర్థం కాలేదు.

తన ప్రశ్నలకు స్వామి వద్ద సమాధానం లేదా?

లేదా తనకు చెప్పడానికి స్వామి ఇష్టపడటం లేదా?

ఆలోచనలతో పాంచజన్య తల వేడెక్కిపోయింది.

రూంలో కూర్చున్నా ఇవే ఆలోచనలు తిరుగుతున్నాయి.

ఈ హోటలులో దిగిన సమయంలో మాట్లాడిన విరించి గుర్తుకు వచ్చాడు.

అతడిని అడిగితే ఏమైనా తెలుస్తుందేమో?

ఆలోచన వచ్చింది తడవుగా కౌంటరు వద్దకు వెళ్ళి విరించిని కలుసుకున్నాడు.

స్వామితో జరిగిన సంభాషణ తన ప్రశ్నలకు ఆయన ఇచ్చిన సమాధానాలు అన్నీ చెప్పి అమ్మగురించి అడిగిన దానికి ఏమీ సమాధానం చెప్పలేదు. కారణం ఏమై ఉంటుందని విరించిని అడిగాడు.

దానికి విరించి సాలోచనగా రెండు నిమిషాలు ఆలోచించాడు.

తర్వాత "స్వామి తాత్వికతకు చెందిన నీ సందేహాలను తీర్చారు. మిగిలిన ప్రశ్నలకు జవాబులు అవసరంలేదని స్వామి అనుకోవడం వల్ల వాటికి సమాధానం చెప్పలేదు. మరోసారి ప్రయత్నం చేస్తే మంచిదేమో? ఎందుకంటే నీతో స్వామి అంత ఎక్కువ సమయం మాట్లాడారు. అంటే ఆయనకు నీ మీద మంచి అభిప్రాయం ఏర్పడి ఉంటుంది. లేకపోతే అంత సమయం నీకోసం వెచ్చించే అవకాశం ఉండదు. అంతేకాకుండా అందరిని లైనులో వచ్చే సమయంలో మాత్రమే అడిగిన వాటికి సమాధానలు చెబుతుంటారు కానీ నిన్ను ఏకాంతంలో తీసుకుని వెళ్ళి మాట్లాడారు అంటే నీ మీద ఎంతో కొంత మంచి అభిప్రాయం కలిగి ఉంటుంది. "

విరించి మాటలు కొంతవరకు నిజమే అనిపించాయి.

ఆలోచనలతో మనసంతా చికాకుతో నిండిపోయింది.

మరో రెండు రోజులు అక్కడే ఉంటానని విరించితో చెప్పాడు.

మరోసారి స్వామిని కలుసుకోవాలి అనుకున్నాడు.

రూం నుంచి బైటపడి ఆశ్రమం వైపు అడుగులు వేసాడు.

అక్కడంతా హడావుడిగా ఉంది. భక్తులు రకరకాల తోరణాలను కడుతున్నారు కొంతమంది ఆశ్రమానికి అక్కడున్న మండపానికి అలంకరణ చేస్తున్నారు. అక్కడంతా పండగ వాతావరణంలా కనిపించింది. కేవలం ఒక రోజులో ఇంతటి మార్పు ఎందుకు వచ్చిందో అర్థం కాలేదు. అరగంట పాటు అటూ ఇటూ తిరిగాడు. చాలా అసహనం అనిపించింది. ఏదో తెలియని వేదన మనసులో పేరుకుని పోయింది. పక్కన వెళుతున్న వ్యక్తిని అడిగాడు.

ఆ వ్యక్తి పాంచజన్య వైపు ఎగాదిగా చూసాడు.

"రథయాత్ర ఉంది. తెలియదా?" ప్రశ్నించాడు.

పాంచజన్య అయోమయంగా మొహం పెట్టాడు. తర్వాత "స్వామి దర్శనం ఉంటుందా?" నెమ్మదిగా అడిగాడు.

ఇక్కడంతా అందరూ రథయాత్ర నిర్వహణ హడావుడిలోనే ఉంటారు. బహుశా స్వామి భక్తులను కూడా కలుసుకోకపోవచ్చు"

పాంచజన్యలో నిరాశ మరింతగా ఆవరించింది.

ఎదురుగా పుస్తకాల దుకాణం కనిపిస్తే అందులోకి వెళ్ళాడు.

అక్కడ చాల పుస్తకాలు ఉన్నాయి. పెద్ద పెద్ద వారి జీవిత చరిత్రలు ఆధ్యాత్మిక గ్రంధాలు భక్తి సంబంధమైన పుస్తకాలు వరుసగా పేర్చి ఉన్నాయి. అన్ని పుస్తకాలుచూస్తూ పేజీలను తిరగేయడం మొదలుపెట్టాడు పాంచజన్య.

రమణ మహర్షి జీవిత చరిత్ర పుస్తకం కనిపించింది.

పేజీలను తిప్పాడు చదవాలని అనిపించింది. వెంటనే దానిని కొనుక్కుని బైటికి వచ్చాడు. పుస్తకంలో అక్కడక్కడా పేజీలు తిప్పిన తర్వాత దానిమీద ఆసక్తి ఏర్పడింది.

దూరంగా కొండవారి పెద్ద తోట ఉంది. దాని పక్కన విశాలమైన బండరాయి ఉంది. పక్కనున్న పెద్ద చెట్టు నీడ ఆ రాయిమీద పడుతోంది. పాంచజన్య అక్కడికి వెళ్ళి దానిపైన కూర్చుని రవణ మహర్షి జీవిత చరిత్ర పుస్తకాన్ని విప్పాడు. మొదటి పేజీ చదివాడు. తర్వాత అప్రయత్నంగా పుస్తకంలో ఉన్న విషయాలపై అతని దృష్టి మరలింది. అతని కళ్ళు పుస్తకంలో అక్షరాల వెంట పరుగులు పెట్టాయి. పుస్తకం అంతా చదివిన వరకూ ఆగలేదు. పుస్తకంలో ఉన్న అన్ని అధ్యాయాలను చదివిన వరకు ఆ రాయి నుంచి పైకి లేవలేదు.

పుస్తకం పూర్తి అయిన తర్వాత ఒకలాంటి సంతృప్తి కలిగింది అలసి పోయిన వ్యక్తికి దాహం తీరినట్లుగా అయింది.

పుస్తకంలో చదివిన విషయాలు మనసులో పదేపదే తిరుగుతున్నాయి.

రమణ మహర్షి. మహాజ్ఞాని. కానీ అతను చివరి దశలో బోను కేన్సరుతో బాధపడ్డాడు. ఆయనకు నాలుగుసార్లు ఆపరేషన్లు జరిగాయి. అయినా బాధను దిగమింగుకున్నారు. చివరి వరకు ఎంతో బాధపడుతూ ఆయన చనిపోయారు. పుస్తకంలో ఆయన పడుతున్న బాధలు చదువుతుంటే పాంచజన్యకు అమ్మ రమణి పదే పదే గుర్తుకు వచ్చింది. గతంలో తను రామకృష్ణ పరమహంస గురించి కూడా పుస్తకం చదివాడు. అతను ఎంతో జ్ఞాని గొప్ప వ్యక్తిగా ప్రపంచమంతా కీర్తించబడినవారు. ఆయనకూడా గొంతు కేన్సరుతో బాధపడుతూ చనిపోయారన్న విషయం గుర్తుకు వచ్చింది. ఆ ఇద్దరు మహానుభావులు కూడా లోకానికి ఎన్నో మంచి పనులు చేసి ఆదర్శపురుషులుగా ఉన్నారు. అయినప్పటికీ వారికి కూడా ఎందుకు అంత ఇబ్బందికరమైన చావు వచ్చిందన్న విషయం పాంచజన్యలో ప్రశ్నగా మిగిలిపోయింది.

వారితో పోల్చుకుంటే అమ్మ ఎంత?

నువ్వు మంచిగా బతికినంత మాత్రాన ఎల్లవేళలా మంచే జరగదు అనే సందేశం వారి జీవితాల ద్వారా తనకు లభించిందని పాంచజన్యకు అనిపించింది. ఈ విషయాలను మానవాళికి తెలియజేయడానికి మహానుభావులు తమ చావును కూడా ఆ విధంగా ఎంచుకున్నారన్న విషయం పాంచజన్య మనసులో నాటుకుని పోయేలా అర్థమైంది.

ముందురోజు స్వామిని కలుసుకున్నప్పుడు "అన్ని మంచిపనులు చేసిన అమ్మ రకరకాల బాధలు పడుతూ ఎందుకు చనిపోయిందని తాను అడిగిన ప్రశ్నకు స్వామి సమాధానం ఏమీ చెప్పలేదు. అమ్మవారి అనుగ్రహంతో అన్నీ తెలుస్తాయి అన్నారు అంటే తాను ఆ పుస్తకం చదవడానికి తనకు బాధలు అందరికీ ఉంటాయన్న కారణం తెలియడానికి అమ్మవారి అనుగ్రహం ద్వారా పుస్తకాలు చదివే అవకాశాన్ని తనకు ఈ విధంగా స్వామి కలిగించారా అని అనిపించింది. అది నిజమేనేమో అనికూడా అనుకున్నాడు.

పాంచజన్య ఈ విధంగా అనుకోగానే గొప్ప సంతృప్తి కలిగింది.

అమ్మ బాధపడుతూ చనిపోవడం వెనుక కర్మ అనే కారణం ఉందన్న విషయం అర్థం అయింది. దాంతో అతని మనసంతా తేలిక పడినట్లయింద్ది.

ఈ విషయం స్వామికి వెంటనే చెప్పాలి అనుకున్నాడు.

అలా చెప్పే అవకాశం మర్నాడు కానీ పాంచజన్యకు కలగలేదు.

**పాంచజన్య** శక్తి పీఠం ఆశ్రమంలోకి ఉత్సాహంగా ప్రవేశించాడు.

అతని మనసు ఎంతో తేలికగా అయిపోయింది.

భక్తుల లైను ఎక్కువగా ఉంది. రథయాత్రకోసం వచ్చిన చాలామంది భక్తులు స్వామిని దర్శనం చేసుకోవాలని ఉండిపోయారు.

లైనులో స్వామి దగ్గరకు వెళ్ళడానికి గంట పట్టింది.

సాధారణంగా ఆ సమయం అంత ఎక్కువ కాదు. కానీ పాంచజన్యకు ఎంతో ఆలస్యం అయినట్లుగా అనిపించింది. ఎంత తొందరగా స్వామిని కలుసుకోవాలా తాను పొందిన అనుభూతిని స్వామికి చెప్పాలా అనే ఆత్రుత అతనిలో నిండిపోయింది.

స్వామి దగ్గరకు రాగానే అతని కాళ్ళమీద పడి నమస్కారం చేసాడు.

స్వామి అతనివైపు చూసి చిరునవ్వు నవ్వారు.

ఆ నవ్వులో ఎన్నో అర్థాలు కనిపించాయి పాంచజన్యకు

"మా అమ్మగారు బాధపడుతూ చనిపోయారని అనుకున్నాను. కానీ ఆమెకన్నా ఎంతో ఉన్నతులు మహోన్నతులలో కొంతమంది ఆమెకన్నా చాలా బాధలు పడుతూ చనిపోయారన్న విషయాలను తెలుసుకున్నాను. తమరు నాకు చెప్పకపోయినా నాకు తెలిసేటట్టు చేసారు. ఈ విషయం తెలియక ఎన్నో రోజులుగా మథనపడుతున్నాను. తమరు కలిగించిన అనుభవం వల్ల కొత్త సంగతిని తెలుసుకున్నానన్న సంతోషం నన్ను నిలువనీయడంలేదు.."

పాంచజన్య మొహంలో కొత్త వెలుగుని స్వామి గుర్తించారు.

"అన్ని విషయాలు స్వతహాగా తెలుసుకోవడం వల్ల ఎంతో ఆనందం కలుగుతుంది. ఏ సందేహానికైనా సమాధానం ఉంటుంది. కొంతమంది తక్కువ కాలంలో తెలుసుకుంటారు. మరి కొందరు అదే విషయాన్ని తెలుసుకోవడానికి చాలాకాలం పడుతుంది."

"స్వామీ. స్వామీ" అనే మాటలు తప్ప పాంచజన్య నోటి వెంబడి ఇతర మాటలురావడంలేదు. ఏదో తాదాత్మ్యంలో ఉన్నట్లుగా ఉంది.

"ఈ లోకంలో అమ్మను మించిన దైవం ఉండదని అనుకుంటున్నాను. దేముడు ఎలా ఉంటాడో ఎవరికీ తెలియదు. ఒకొక్కరు ఒకో విధంగా చెప్పుకుంటారు. దేవుడు అమ్మలా ఉంటాడని నేను అనుకుంటాను స్వామి."

స్వామి ఏమీ సమాధానం చెప్పలేదు.

"అమ్మే జీవితం అనుకుంటూ ఇంతవరకు బతికాను. ఇప్పుడు అమ్మలేదు నా జీవితాన్ని ఎందుకోసం ఎవరికోసం అని అనిపిస్తోంది."

దానికి కూడా స్వామి సమాధానం చెప్పలేదు.

ఈలోపు మరి కొంతమంది భక్తులు వస్తే వారితో మాట్లాడుతూ స్వామివారి సందేహాలను తీరుస్తున్నారు.

"స్వామీ నా సమస్యలకు పరిష్కారం లేదా?"

"నాయనా! నువ్వు అనుకుంటున్నావు కాని నీవి అసలు సమస్యలు కాదు. ఈ రోజు సమస్య అనిపించినది రేపు అసలు సమస్యగా కనిపించదు. ఆ మరుసటి రోజు అది సాధారణమైన విషయం అయిపోతుంది"

"స్వామీ వివరంగా చెప్పండి"

"మీ అమ్మను ఎంతగానో ప్రేమించడంవల్ల నువ్వు చాలా బాధపడుతున్నావు. కానీ కొన్నిరోజులు గడిచిపోయిన తర్వాత నీ బాధకు నీ సమస్యకు నీ మట్టుకు నీకే పరిష్కారం లభిస్తుంది అమ్మే జీవితం కాదని తెలుసుకుంటావు. నీ భార్యలో కానీ నీ కూతురిలో కానీ అమ్మను చూసుకుంటావు" స్వామి చెప్పారు.

పాంచజన్య అయోమయంగా చూసాడు.

"అమ్మను ఎంతో ఇష్టపడ్డావు, ప్రేమించావు, అభిమానించావు. అమ్మ చెప్పిన విధంగా నడుచుకో మంచి జరుగుతుంది"

"అమ్మ ఏమి చెప్పాలని అనుకున్నదో తెలియదు కదా స్వామీ?"

"మీ అమ్మగారి జీవితం ద్వారా నువ్వు చాలా విషయాలు ఇప్పటికే తెలుసుకున్నావు. ఇతరులకు సేవ చేయాలని అందరితో మంచిగా ఉండాలని నువ్వు ఎప్పుడో గుర్తించావు. నీ తోటివారికి సాయపడాలని ఆమె జీవితం ద్వారా తెలుసుకున్నావు కదా?"

"అవును స్వామీ అదే నేను ఆచరిస్తున్నాను"

"మీ అమ్మగారు చనిపోయిన తర్వాత నువ్వు చాలా ప్రాంతాలు తిరిగానని, చాలా చూసానని అన్నావు. కాశీ వెళ్ళడం ద్వారా అన్నదానం ఎంతమంచిదో ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ఎంత గొప్ప విషయమో తెలుసుకున్నావు. దానిని ఆచరించావు. బాబాగారి ఆశ్రమానికి వెళ్ళావు. అక్కడ సేవలను స్వయంగా చేసావు. నీకున్న డబ్బులో కొంతదనాన్ని నిరుపేద అమ్మాయి వివాహం కోసం దానం చేసావు. నీకున్న దానిలో కొంతైనా ఇవ్వడం ద్వారా ఇతరులకు సాయపడాలన్న జ్ఞానాన్ని ఆచరించావు. అనాధ శరణాలయానికి వెళ్ళి అక్కడున్న వారిని కలుసుకోవడం పదిమందికీ ఉపయోగపడేలా ప్రేమను పంచాలని తెలుసుకున్నావు. అమ్మ ప్రేమలాంటి ప్రేమను అందరికీ పంచాలని అనుకున్నావు. పంచావు"

"నిజమే స్వామీ"

"ఇటువంటి మంచిపనులు నిరంతరం చేయడం ద్వారానే మీ అమ్మగారి ఆశయాలను నెరవేర్చినవాడవు అవుతావు."

స్వామి చెబుతున్న విషయాలు వింటున్న పాంచజన్యకు అవి నిజమేకదా అనిపిస్తున్నాయి. ఆ విషయాలు అతనిలో ఆలోచనలు రేకెత్తిస్తున్నాయి. తర్వాత నెమ్మదిగా "మా అమ్మగారు చనిపోయే చివరి క్షణాలలో నాతో చెప్పాలని అనుకున్నది ఏమిటో తెలియడంలేదు? ఏమై ఉంటుందా అనుకుంటున్నాను."

"ఇన్ని విషయాలు నీకు నువ్వుగా తెలుసుకున్నావు కదా అది కూడా ఊహించలేకపోతున్నావా నాయనా?"

పాంచజన్య సందేహంగా మొహం పెట్టాడు.

"అనుభవం ద్వారా తెలుసుకోగలవు. నీ వ్యక్తిగతం గురించి నీ సుఖం గురించి నువ్వు అందరిలా ఎలా ఉండాలో ఆమె కోరుకున్న విషయాలు నువ్వు గ్రహించాలి. అందరి అందరి యువకులు ఎలా ఆలోచిస్తారో నువ్వు కూడా అలానే ఆలోచించాలని ఆ మాదిరిగనే నీ జీవితాన్ని మలచుకోవాలని మీ అమ్మగారు అనుకుని ఉండవచ్చు. ఆ విషయాలను నీతో చెప్పి వాటిని ఆచరించాలని కోరుకుని ఉంటుంది. అంతకన్నా ఏ తల్లి అయినా ఏమి చెప్పాలని అనుకుంటుంది?" స్వామి వివరించారు.

స్వామి మాటలు పాంచజన్యలో ఆలోచనలు రేపాయి.

పాంచజన్య ఏమీ మాట్లాడలేకపోయాడు.

ఇంతలో స్వామి పక్కనున్న శిష్యుడ్ని పిలిచి అమ్మవారి ప్రసాదాన్ని తెప్పించారు. దానిని చిన్న ఆకులో పెట్టి పాంచజన్యకు ఇస్తూ "నాయనా ఈ ప్రసాదం తీసుకో. అమ్మవారి ఆశీర్వాదం నీకు ఉంటుంది. మీ అమ్మగారి మనోభీష్టం మేరకు నడుచుకో. నువ్వు ఎక్కడి నుంచివచ్చావో అక్కడికి వెళ్ళిపో. మనిషి జీవితంలో ఉన్న అన్ని ధర్మాలను ఆచరించుకో. నీకు అంతా మంచి జరుగుతుంది. మీ అమ్మగారి ఆత్మ సంతోషపడుతుంది" అన్నారు.

పాంచజన్య ఆ ప్రసాదాన్ని కళ్ళకు అద్దుకుని తిన్నాడు.

మరోసారి స్వామికి నమస్కారం చేసి ఆశీర్వచనం తీసుకున్నాడు.


కౌముది

తర్వాత రూముకు బయలుదేరాడు.

4

ఇరవై సంవత్సరాల తర్వాత

సాయంకాలం వాతావరణం ప్రశాంతంగా ఉంది. చెట్లనుంచి వీస్తున్న గాలి చల్లగా శరీరానికి తాకుతుంటే హాయిగా అనిపిస్తోంది.

వనంలో ఎవరి పనులు వారు చేసుకుంటున్నారు.

అందులో రకరకాల పూలమొక్కలు ఉన్నాయి. అందానికి ప్రతీకగా ఉన్న ఆ మొక్కలను పెంచడానికి చాలామంది అక్కడ పనిచేస్తున్నారు. వివిధప్రాంతాల నుంచి తీసుకుని వచ్చిన మొక్కలను సంరక్షించడానికి ఎంతోమంది అక్కడ పనిచేస్తున్నారు. కొంతమంది అంట్లు కడుతున్నారు మరికొంతమంది ప్లాస్టిక్ సంచులలో ఉన్న మొక్కలకు నీరు పోస్తున్నారు. చాలామంది ఆ నర్సరీలో వివిధరకాల పనులు చేస్తున్నారు.

మూడుఎకరాల్లో విస్తరించి ఉన్న ఆ ప్రాంతం ఎంతో ఆహ్లాదంగా ఉంది.

పూల గుబాళింపు ఆ ప్రాంతాన్ని వ్యాపించి కొత్త సువాసనలు ఇస్తున్నాయి.

చుట్టూ ప్రహరి ఉంది. మధ్యలో వనం ఉంది ఎవరైనా రావాలంటే గేటు తీసుకుని లోపలికి రావాలి. లోపల ఉన్నవారికి ఎవరు వస్తున్నా దూరం నుంచి కనిపిస్తుంది.

ఓ పక్క మొక్కలను తీసుకుని వెళ్ళడానికి చిన్న ఆటో కూడా ఉంది.

ఇంతలో ఒకామె గేటును తోసుకుని లోపలికి వచ్చింది.

రోజూ అలా చాలామంది వస్తుంటారు. అందువల్ల అక్కడివారు పెద్దగా పట్టించుకోలేదు. ఆమెకు యాభై సంవత్సరాల వయసు ఉంటుంది. హేండ్ బేగ్ తగిలించుకుని ఉంది. ఆ లోపలికి వచ్చి ఆ ప్రాంతాన్ని కలియ తిరుగుతూ మొక్కలను అంట్లు కట్టిన పూలమొక్కలను పరిశీలించింది.

"ఎవరు కావాలండీ?" నర్సరీలో పనిచేసే అమ్మాయి అడిగింది.

ఆవిడ ఏమీ సమాధానం చెప్పలేదు "పూలు చాలా బాగున్నాయి. ఈ పూలతోట ఎంతో అందంగా ఉంది."

"పూల మొక్కల కోసం వచ్చాను" అంది.

"ఎక్కడినుంచి వస్తున్నారు?" ప్రశ్నించింది.

"ఒకప్పుడు ఈ ప్రాంతంలోనే ఉండేదానిని ఉద్యోగరీత్యా ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నాను. నా పేరు పద్మావతి" అంది ఆమె.

"రండి ఈ వనంలో చాలా రకాల మొక్కలు ఉన్నాయి వాటిని చూపిస్తాను. వారానికి ఒకసారి కొత్త నారు వస్తుంది వాటిని మట్టి వేసి బుట్టలలో పెట్టి పెంచుతుంటాం. ఇక్కడ పెరిగిన మొక్కలు పూల చెట్లు చాలా ప్రాంతాలలో పూలు ఫలాలు ఇస్తుంటాయి."

పద్మావతి ఆ ప్రాంతాన్ని చూస్తూ "పళ్ళ మొక్కలు కూడా ఇక్కడ చాలా ఉన్నాయి వాటిని కూడా అమ్ముతారా?" పద్మావతి ప్రశ్నించింది.

"ఇక్కడ చాలా పూల మొక్కలు పళ్ళ మొక్కలు ఉన్నాయి. వేటిని కూడా డబ్బులకు అమ్మడం ఉండదు. మీకు కావాలంటే ఉచితంగా తీసుకుని వెళ్ళండి. లోపల దూరంగా ఉన్న రూములో మా మేనేజరుగారు ఉన్నారు. ఆయన వద్దకు వెళ్ళి మీ వివరాలు చెబితే రాసుకుని ఏం కావాలన్నా ఇస్తారు" అంది ఆ అమ్మాయి.

"అవును ఉచితంగానే ఇస్తారు"

"పూల నారు తీసుకుని రావడానికి చాలా ఖర్చు అవుతుంది వీటిని పెంచడానికి ఎంతోమంది పనిచేస్తున్నారు. వారికి జీతాలు భత్యాలు ఇవ్వాలి. దీని నిర్వహణకు కూడా ఎంతో వ్యయం అవుతుంది. అయినా ఉచితంగా ఇస్తున్నారా?" అంది.

"అవును ఉచితంగా ఇస్తున్న వనం ఇది. అయితే ఎన్ని కావాలంటే అన్ని ఇవ్వడం కుదరదు. ఎవరికైనా అయిదు మొక్కలు మాత్రం ఉచితంగా ఇస్తాం. అదికూడా వారి నామా ఆధార్‌కార్డు వంటి వివరాలు అందివ్వాలి. ఇంకా ఎక్కువ పూల మొక్కలు కొనుగోలు చేస్తామని అన్నా ఇక్కడ అమ్మడం లేదు. తీసుకున్న మొక్కలను ఎలా వేసారు ఎలా పెంచుతున్నారన్న విషయాలను ఈ వనం నిర్వాహకులు మీ చిరునామా ఆధారంగా పరిశీలిస్తుంటారు."

"నిజమా? చాలా ఆశ్చర్యంగా ఉంది. రకరకాల సేవా కార్యక్రమాలను చూసాను. కానీ ఇటువంటిది వినలేదు. చూడలేదు" పద్మావతి విస్మయంతో చెప్పింది.

ఇంతలో దూరం నుంచి మేనేజరు దగ్గరకి వచ్చాడు.

పనిచేసే అమ్మాయి వైపు చూస్తూ "ఎంతసేపూ వచ్చిన వారితో కబుర్లు చెప్పుకుంటూ ఉండిపోతావు. ఇక్కడున్న గులాబీ నారును బుట్టల్లో ఎత్తవలసిన పని ఇంకా చేయలేదు వెంటనే ఆ పని చూడు" అన్నాడు.

పక్కనున్న పద్మావతి వైపు చూస్తుంటే "సార్ నేను ఒకప్పుడు ఈ ప్రాంతంలో ఉండేదానిని. ఇక్కడే చదువుకున్నాను. ఈ మధ్య ఇంగ్లీష్ పేపరులో ఒక ఆర్టికల్ చదివాను ఎలాగూ ఇక్కడికి వస్తున్నానని ఈ వనాన్ని చూడటానికి వచ్చాను"

"మీరు ఏం చేస్తుంటారు?"

"నేను జర్నలిస్టుగా పనిచేస్తున్నాను. వివిధ ప్రాంతాలలో మానవీయ కథనాలను రాయడం నాకు ఎంతో ఇష్టం. ఈ వనం గురించి ఎవరో రాసిన ఆర్టికల్ చదివాను. నేను పుట్టి పెరిగిన ప్రాంతం అయినందున నాకు ఒకలాంటి ఆసక్తి కలిగింది. విశాఖపట్నంలో ఉన్న మా ఆఫీసులో పనివుండి అక్కడికి వచ్చాను. పనిలో పనిగా ఈ క్షేత్రాన్ని కూడా చూడాలని అనుకున్నాను. అందుకే ఇక్కడికి వచ్చాను."

"చూసారు కదా ఏమనిపించింది?"

"దీనిని నిర్వహిస్తున్నవారు మంచి మనసుతో ఈ కార్యక్రమాన్ని చేస్తున్నారని అనిపించింది. నిజమేనా?"

ఆ వ్యక్తి ఏమీ మాట్లాడలేదు. చుట్టూ చూస్తూ " ఇటువంటి సేవా కార్యక్రమాన్ని చేయాలన్న ఆలోచన ఏ కొద్దిమందికో ఉంటుంది. చాలామంది డబ్బులు సంపాదిస్తుంటారు కానీ వాటిని తమ పిల్లలకోసమో వారసుల కోసం వినియోగించాలని అనుకుంటారు. ఆ డబ్బును కూడబెట్టుకోవడం తప్ప వినియోగించే పరిస్థితి ఉండదు."

" నిజమే ఏ కొద్దిమంది మాత్రమే తమ సంపాదనను సద్వినియోగపడేలా వినియోగిస్తారు" పద్మావతి నెమ్మదిగా చెప్పింది.

"మనం అమితంగా ఇష్టపడిన వారు ఈ లోకం నుంచి సెలవు తీసుకుని వెళ్ళిపోతే వారి పేరుతో చాలా సేవా కార్యక్రమాలను చేపడుతుంటాం వారి వర్ధంతులు జయంతిలను చేస్తుంటారు అన్నదానాలు చేస్తారు పిల్లలకు పుస్తకాలు పంచుతుంటారు. కానీ ఇటువంటి సేవలను చేసేవారు అరుదుగా ఉంటారు" అని అన్నాడు.

తర్వాత ఆమెను దూరంగా ఉన్న చిన్న కుటీరం వైపు తీసుకుని వెళుతూ "మీరు చాలా దూరం నుంచి వచ్చారు. సాయంత్రమైంది. టీ తీసుకుందురుకాని రండి" అతను పద్మావతిని ఆహ్వానించాడు.

పద్మావతికి ఇదంతా ఆశ్చర్యంగా ఉంది. వనం చూడటానికి వచ్చిన తనను టీ కోసం ఆహ్వానించడం ఆమెకు ఏదోలా అనిపించింది. అదే విషయాన్ని అడిగింది. "నేను ఎవరో తమకు తెలియదు కానీ చూడటానికి వచ్చిన నన్ను ఈ విధంగా ఆహ్వానించడం నాకు విడ్డూరంగా ఉంది"

"ఇక్కడకు వచ్చిన వారు సంతృప్తిగా వెళ్ళాలని మా సార్ చెబుతుంటారు. వచ్చిన వారు భోజన సమయానికి వస్తే వారికి భోజనం ఏర్పాట్లు కూడా ఉంటాయి. టీ సమయానికి వచ్చిన వారందరికీ నిరంతరం టీ అందిస్తూనే ఉంటాం" అతను చెప్పాడు.

ఇంతలో పని కుర్రవాడు టీ తీసుకుని వచ్చాడు.

"టీ చాలా బాగుంది, చిక్కని పాలతో చేసినట్లున్నారు"

"అవును పాలును కూడా కొననవసరంలేదు ఆ మూలన చిన్న డెయిరీ ఉంది. దానివల్ల నాలుగు కుటుంబాల బతుకుతున్నాయి. వారికి గేదెలను కొని అన్ని సదుపాయాలను సమకూర్చారు. వారు పాలన్నీ తీసుకోవచ్చు కానీ ఇక్కడికి వచ్చేవారికి టీ పెట్టడానికి అవసరమైన పాలు ఇస్తే సరిపోతుంది. వారు ఈ పనిని ఎంతో ఆనందంగా చేస్తున్నారు."

ఈ విషయాలు వింటుంటే పద్మావతికి ఎంతో ఆశ్చర్యం కలిగింది.

"మీ సార్ చాలా మంచి పనులు చేస్తున్నారు"

"ప్రత్యక్షంగా కనిపిస్తున్నది ఈ వనం మాత్రమే కానీ ఇతరపనులు కూడా, చాలా జరుగుతున్నాయి"

"నేను పేపర్లో వార్త చదివినప్పుడు ఇటువంటి వ్యక్తులు ఉంటారా అనిపించింది కానీ ఇక్కడ చూస్తుంటే నేను చదివిన దానికన్నా చాలా ఎక్కువగా ఉంది."

ఆయన గదిలోకి తీసుకుని వచ్చి ఒక ఆల్బం అందించాడు.

అందులో చాలా ఫోటోలు ఉన్నాయి. కొన్ని భవంతులు కూడా ఉన్నాయి. పద్మావతి వాటిని చూస్తూ "ఏమిటి ఇవి?" అడిగింది.

"ఈ ప్రాంతంలో చాలా సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి. అనాధల కోసం ఒక శరణాలయం ఉంది. వృద్ధుల కోసం ఒక ఆశ్రమం ఉంది నెలవారి గ్రామీణ ప్రాంతాలలో వైద్య శిబిరాలను నిర్వహిస్తుంటారు. వాటికి సంబంధించిన ఫొటోలు ఇవి" అతను వివరంగా పద్మావతికి చెప్పాడు.

పద్మావతికి ఎంతో ఆశ్చర్యం అనిపించింది. "చాలామంది విరాళాలను సేకరించి వాటితో ఇటువంటి పనులు చేస్తుంటారు మరి కొంతమంది బాగా ధనవంతులు తమ సొమ్ములో బ్లాక్‌మనీని సేవ రూపంలో చూపించుకోవడానికి సేవా కార్యక్రమాలను చేస్తుంటారు ఇటువంటి వారు నాకు చాలామంది తెలుసు."

"కానీ మా సార్ అటువంటి వారు కాదు"

"మంచి స్థితిపరులుగా లేదా లక్షల ఆస్థికి వారసులుగా ఉండి ఉంటారు లేదా మంచి ఉద్యోగంలోనో వ్యాపారంలోనో ఉండి ఉంటారు" అంది.

అప్పుడు ఆ వ్యక్తి నవ్వుతూ "మా సార్ ఉద్యోగం చేయడం లేదు. ఇంతకుముందు చేసేవారు ఇప్పుడు అది మానివేసి కేవలం సేవకు అంకితం అయిపోయారు."

పద్మావతి మరింత ఆశ్చర్యపోయింది "ఉద్యోగాన్ని వదులుకుని ఇటువంటి పనులు చేస్తున్నారా? మీ సార్‌ని కలుసుకోవలసిందే"

ఆమె మాట పూర్తికాకముందే కొంతమంది పూలమొక్కలకోసం అక్కడికి వచ్చారు. వారి దగ్గర అడ్రసులు ఆధార్ కార్డు జిరాక్సు కాపీలను తీసుకుని చిన్న స్లిప్పును అందించారు ఆ స్లిప్పును తీసుకుని మొక్కలు అందించే వారి వద్దకు వెళ్ళి అక్కడున్న పూలమొక్కలలో తమకు కావల్సినవి ఎంచుకుని తీసుకుని వెళుతున్నారు.

"మా సార్ చాలా సిస్టమేటిక్‌గా ఉంటారు. శని ఆదివారాలు కేవలం ఇంటికే పరిమితం అయిపోతారు కుటుంబ సభ్యులతో గడుపుతారు. మిగతా రోజులలో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తుంటారు."

"ఆయన్ని కలుసుకోవాలని ఉంది. ఇటువంటి కార్యక్రమాలను చేయడానికి ఆయనకు స్ఫూర్తి ఎక్కడినుంచి వస్తుందో తెలుసుకోవాలి."

"వీలుంటే రేపు రండి. ఈ వనానికి సార్ రేపు వస్తారు."

"రేపు సాయంత్రం హైదరాబాద్ వెళ్ళిపోతున్నాను. ఉదయం విశాఖ ఆఫీసులో కొంత పని ఉంది. అందువల్ల కుదరకపోవచ్చు" సాలోచనగా అంది.

ఆ వ్యక్తి పద్మావతి వైపు సాలోచనగా చూస్తుండిపోయాడు.

"సార్ ఇందాక చూపించిన ఫొటోలన్నింటిలోనూ ఒకే పేరు ఉంది. ఆ పేరు రమణి... రమణి... రమణి అని ఎవరామె?"

ఆయన వెంటనే సమాధానం చెప్పలేకపోయారు

తర్వాత "ఆ పేరు అంటే అతనికి ఎంతో ఇష్టం. రమణి మా సార్ కన్నతల్లి. ఆమెను ఎంతగానో ప్రేమించాడు. ఆమె కూడా ఇతడిని అంతగానే ప్రేమించింది. ఇతనికి ఉద్యోగం వచ్చిన ఏడాదిలోనే అనారోగ్యంతో చనిపోయింది. అప్పటినుంచీ అమ్మ ప్రేమకు తపించిపోతూ ఎన్నో కార్యక్రమాలను చేస్తున్నారు. మంచి ఉద్యోగం చేసారు. ఆ ఉద్యోగం ద్వారా వచ్చిన ఆదాయాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. ఉద్యోగం తనకు అడ్డంకి అని దానిని కూడా వదులుకున్నారు. ఇక్కడికి వచ్చి ఈ వనాన్ని స్థాపించారు. రమణి టీచరుగా ఎంతోమందికి పాఠాలు చెప్పేవారు. ఈ ప్రాంతంలోనే పనిచేసేవారు" అన్నాడు.

పద్మావతి ఆలోచనల్లోకి జారిపోయింది.

"నేను ఆరునుంచి పదవ తరగతి వరకు తాళ్ళవలస హైస్కూల్లో చదువుకున్నాను. ఆ సమయంలో మా తాతగారిల్లు ఇక్కడ ఉండేది. పదవ తరగతికి అమ్మానాన్నా నన్ను హైదరాబాదు తీసుకుని వెళ్ళిపోయారు. ఆ సమయంలో మాకు సైన్సు చెప్పడానికి వెంకటరమణి అనే టీచరు ఉండేవారు. బహుశా ఆమె ఈమె ఒకరు కాదు కదా?"సందేహాన్ని వెలిబుచ్చింది.

అతను వెంటనే గదిలో ఉన్న రమణి ఫోటోను తీసుకుని వచ్చి చూపించాడు. అది ఆమె చనిపోవడానికి ముందు తీయించుకున్న ఫొటో నీలం రంగు చీరలో చాలా అందంగా ఉంది. ఫొటోను తీసుకుని చూసి పద్మావతి విషయంలో కళ్ళు ఎగరవేసింది.

"అవును ఈవిడే ఆనాటి మా రమణి టీచరుగారు" అలా అంటున్నప్పుడు పద్మావతి కళ్ళు ఆనందంతో మెరిసాయి.

"మేము చదువుకున్న సమయంలో మాకు ఇష్టమైన టీచర్ ఈమె. చాలామందికి పుస్తకాలు కొని తీసుకుని వచ్చేవారు. పిల్లలకు దుస్తులు కూడా చాలాసార్లు తెచ్చారు. రోజూ సాయంత్రం పూట అమ్మాయిలను తన చుట్టూ కూర్చోపెట్టుకుని చాలా కథలు చెప్పేవారు. ఆమె ఒకరోజు స్కూలుకు సెలవు పెట్టినా మాకు ఏదోలా ఉండేది. అనుకోకుండా నేను ఈ ప్రాంతానికి రావడం మా టీచరుగారి గురించి తెలుసుకోవడం జరిగింది." అంటూ పద్మావతి ఎంతో ఆనందపడిపోయింది.

"అమ్మగారి వద్ద చదువుకున్న వ్యక్తి వచ్చారంటే సార్ ఎంతో సరదా పడతారు ఫోను చేయండి. ఒకవేళ ఆయన వస్తే కలుసుకుని మాట్లాడి వెళ్ళిపోతాను."

అతను ఫోను చేసి మాట్లాడాడు. తర్వాత పద్మావతి వైపు తిరిగి "సార్ వస్తామని అన్నారు. ఉండమన్నారు" అన్నాడు.

"థాంక్యూ సార్. నేను పేపర్‌లో ఎవరి గురించి చదివానో వారు వస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. మా టీచరుగారి ఫోటో చూపించి నాకు ఎంతో మేలుచేసారు. ఆమె ఫొటోను ఫొటో తీసుకుంటాను" అని సెల్ ఫోనులో రమణి ఫొటోను తీసింది.

"మీ టీచరుగారంటే మీకు అంత ఇష్టమా?"

"ఆ కాలంలో మా టీచర్ గారు మా రోల్ మోడల్. ఇతరులకు సేవ చేయాలని ఎన్నో విషయాలు చెప్పేవారు ఆ విషయాలు ఆమె కుమారుడికి కూడా అబ్బినట్లుంది"

"ఆయన అమ్మకోసం ఏమైనా చేస్తారు. ఈ రోజు ఈ పూలవనానికి వచ్చే అవకాశం లేదు. కానీ వారి అమ్మగారి శిష్యురాలు అని మీ గురించి చెప్పగానే వెంటనే వస్తానని అన్నారు. తల్లి అంటే ఎంతో గౌరవం" అన్నాడు.

పద్మావతి ఆయనవైపు తిరిగి "నాతో ఇంత వివరంగా మాట్లాడుతున్నారు. అన్ని విషయాలు చెబుతున్నారు. మీరు ఇక్కడే ఉంటారా మీ పేరేమిటి?" అని అడిగింది.

అతను కొద్ది నిమిషాలు ఏమీ మాట్లాడలేదు.

తర్వాత దూరంగా ఉన్న పూల మొక్కల వైపు చూస్తూ "చాలాకాలంగా ఈ వనంలోనే ఉంటున్నాను. నాకు ఎవరు లేరు వంటరివాడిని. మొక్కల్లో ప్రాణముందని చెప్పిన విషయం నా మనసులో నాటుకుని పోయింది. ఈ మొక్కల్ని చెట్లను పళ్ళ మొక్కల్ని ప్రాణమున్న వాటి మాదిరిగా పెంచడంలో ఒకలాంటి ఆనందాన్ని పొందుతున్నాను. నా జీవనమంతా ఇక్కడే చాలాకాలం శృంగేరిలో ఉన్నాను. సార్ అక్కడికి చాలాసార్లు వచ్చేవారు. తాను చేయబోయే సేవా కార్యక్రమాలను నాకు చెప్పినప్పుడు ఎంతో ఆనందం కలిగింది. అమ్మ పేరుతో సేవ చేయాలన్న ఆయన ఆశయం నాకు నచ్చింది. నాకూ నా చిన్నతనంలోనే అమ్మా నాన్న ఇద్దరూ పోయారు. అందుకే ఆయన కోరిక మేరకు ఇక్కడికి వచ్చేసాను. ఈ వనంలోనే ఆ మూల గదిలో ఉంటున్నాను. ఆయన ఆలోచనలకు నా వంతు సహాయాన్ని అందజేస్తున్నాను. ఈ వనం ఏర్పాటు చేయడానికి అయిన ఖర్చు అంతా ఆయన భరించినప్పటికీ దీని నిర్వహణ అంతా నేను చూస్తుంటాను" అన్నాడు ఆయన.

"మీరు కూడా గొప్పవారే సార్ ఇంతకీ మీ పేరు చెప్పలేదు" అడిగింది.

అతను నవ్వుతూ చెప్పాడు "విరించి" అని.

"సార్ వస్తున్నారు"

విరించి మాటలకు గేటువైపు చూసింది.

ఆరు అడుగుల ఎత్తులో నిండైన విగ్రహంతో దగ్గరకు వచ్చాడు

పద్మావతి అతనివైపు చూస్తూ నమస్కారం చేసింది

అతనుకూడా ప్రతి నమస్కారం చేస్తూ "పాంచజన్య సన్ ఆఫ్ రమణి టీచర్" నవ్వుతూ పరిచయం చేసుకున్నాడు.

పద్మావతి తాను పరిచయం చేసుకుని "చిన్నతనంలో నేను తాళ్ళవలస హైస్కూలులో చదివాను మీ అమ్మగారు మాకు టీచరుగా ఉండేవారు"

"విరించి ఫోనులో చెప్పిన తర్వాత మిమ్మల్ని కలుసుకోవాలని అనుకుని వేరే ప్రోగ్రాం ఉన్నా దానిని మార్చుకుని వచ్చేసాను."

"థాంక్యూ సార్"

"చెప్పండి పద్మావతిగారూ?"

"మీ గురించి ఇంగ్లీషు మేగ్‌జైనులో వ్యాసం చదివాను అమ్మకోసం ప్రేమతో మీరు చాలా కార్యక్రమాలు చేసారని అందులో రాసారు. నేను కూడా హైదరాబాదు నుంచి వస్తున్న తెలుగు పేపరులో జర్నలిస్టుగా పనిచేస్తున్నాను విశాఖపట్నానికి ఆఫీసు పనిమీద వచ్చాను. అక్కడికి దగ్గరగా ఉందని ఈ ఆనందపురం మీవనం చూడటానికి వచ్చాను. మీరు చాలామంచి కార్యక్రమాలను చేస్తున్నారు. మీ అమ్మగారు కూడా మంచి పనులు సేవా కార్యక్రమాలు చేయమని మాకు క్లాసులో ఎప్పుడూ చెబుతుండేవారు."

చాలా సంవత్సరాల తర్వాత తల్లిని తెలిసిన వ్యక్తిని కలుసుకోవడం ఆమెద్వారా అమ్మ గురించి వినడం అతనికి ఎంతో ఆనందం కలిగించింది ఆనాటి విషయాలను పద్మావతి ద్వారా తెలుసుకున్నాడు. పద్మావతి చెబుతున్న విషయాలు వింటుంటే పాంచజన్య కళ్ళవెంబడి నీరు వచ్చింది.

అతని కంటిలో తడి చూసి పద్మావతి ఆశ్చర్యపోయింది.

"ఇన్ని సంవత్సరాలు అయిన తర్వాత కూడా మీ అమ్మగారిని మీరు మరిచిపోలేదంటే మీమీద మరింత గౌరవం పెరిగింది"

విరించి రెండు కుర్చీలను తెప్పించి వేసాడు.

పాంచజన్య ఒక కుర్చీలో కూర్చుని పద్మావతికి మరో కుర్చీ ఆఫర్ చేసాడు.

ఆమె కూడా కూర్చుంది.

"ఎన్ని సంవత్సరాలు అయినా అమ్మని మరిచిపోయింది లేదు. నిరంతరం అమ్మ నాతోనే ఉంటుంది. ఉంది. నా ప్రతి ఆలోచన వెనుక అమ్మ ఉంటుంది. ఏ రోజు కూడా ఆమెను తలుచుకోకుండా నేను ఏ పనీ చేయను"

"తల్లి అంటే అందరికీ ఇంతటి ప్రేమ ఉంటుందా?"

"ఉంటుందనే అనుకుంటాను కానీ చాలామంది వ్యక్తం చేయలేరు. ఇతరుల పరిస్థితి ఏమిటో నాకు తెలియదు. కానీ నాకు అమ్మ అంటే ఎనలేని ఇష్టం. ఆమె చనిపోయి ఇరవై సంవత్సరాలు దాటిపోయింది. ప్రతి సంవత్సరం ఆమెకు సంబంధించిన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను చేస్తుంటాను ఆమె నాకు ఎన్నో మంచి విషయాలను నేర్పించింది. ఇతరులకు సేవ చేయడంలో ఆనందం ఉందని ఆమె ద్వారానే నేను తెలుసుకున్నాను. చీమకు కూడా అపకారం చేయని మనస్థత్వాన్ని ఆమె నుంచే అలవరచుకున్నాను."

"అందుకేనా సేవా కార్యక్రమాలన్నీ ఆమె పేరుతో చేస్తున్నారు"

"కర్మయోగి అనేపదానికి అర్థం ఎంతమందికి తెలుసో నాకు తెలియదు కానీ నేను అటువంటి స్థితిలోకి వెళ్ళిపోయాను. అమ్మ ఉన్నప్పుడు అమ్మ విలువ తెలియదు ఆమె పోయిన తర్వాత తెలుస్తుంది కాని ఏమీ చేయలేం. చాలామంది ఈ విధంగా బాధపడుతుంటారు మనం ఈ భూమి మీదకు రావడానికి మన జన్మకు ప్రధానకారణం అమ్మ. అందువల్ల అమ్మ ప్రేమలో కల్తీ ఉండదు. ఆమె కోసం ఏమి చేసినా తక్కువే"

పద్మావతి హేండ్‌బాగ్‌లో నుండి చిన్న రైటింగ్ పేడ్ తీసుకుని కొన్ని విషయాలను రాసుకుంది. "వీటిని మా పత్రికలో వేస్తాను" అంది.

"నాకు పేరు తాపత్రయం లేదు డబ్బుల తాపత్రయం లేదు. ఈ లోకంలో మనిషి బతికినంతకాలం మంచి పనులు చేయాలి. మనకన్నా పేదవారికి ఉపకార్మ చేయాలి. సాయపడాలి. మనకున్న దాంట్లో కొంత లేనివారికి ఇవ్వాలి. నేను ఈ పనులు చేయడం ద్వారా నాకు ఎంతో మానసిక సంతృప్తి కలుగుతోంది. ఉదయం నుంచీ సాయంత్రం వరకూ చేస్తున్న పనులను చూసుకుంటే ఈ రోజు మంచి పనులు చాలా చేసాను. రేపు కూడా చేస్తాను అనుకుంటాను. "

"మీలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలి సార్"

"ఆదర్శం అనను కానీ మంచి పనులు చేయాలి. అమ్మ ప్రేమ చాలా పవిత్రమైనది. అటువంటి ప్రేమను నీ చుట్టుపక్కల వారికి పంచాలి"

ఆమె రాసుకున్న పుస్తకాన్ని బేగ్‌లో పెట్టుకుంటూ "మిమ్మల్ని కలుసుకోవడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ రోజు నా డైరీలో రాసుకుంటాను."

"మీరు ఏమి రాసుకున్నా లేకపోయినా పర్వాలేదు కానీ అమ్మలా ప్రేమను అందరికీ అందించండి. మీ రమణీ టీచరుగారు మీ చిన్నతనంలో చెప్పిన విషయాలను తప్పకుండా ఆచరించండి. అదే నేను కోరుకున్నది" అన్నాడు పాంచజన్య.

తర్వాత విరించిని పిలిచి మూడు పళ్ళమొక్కలు మూడు పూల మొక్కలను తెప్పించి ఆమెకు అందించాడు "వీటిని బాగా పెంచండి. వీటి అందాన్ని అందరికీ పంచండి" అన్నాడు.

వాటిని అందుకుంటూ "ఇటువంటి పూల మొక్కలు మా హైదరాబాద్‌లో కూడా దొరుకుతాయి. వీటిని నా వెంట తీసుకుని వెళ్ళడం కూడా కష్టం అయినా మా టీచరుగారి కోసం వేయించిన ఈ వనంలో పూలు మా ఇంటిలో కూడా గుబాళించాలని తీసుకుని వెళుతున్నాను" పద్మావతి ధృఢంగా చెప్పింది.

వాటిని అందుకుంటున్నప్పుడు "వీటిని తీసుకుని వెళ్ళడానికి నావద్ద ఆధార్‌కార్డు లేదు చిరునామా మాత్రం ఇస్తాను" అంది.

"మీరు ఆధార్ కార్డు ఇవ్వకపోయినా పర్వాలేదు. మీరు ఈ పూల మొక్కల్ని పెంచుతారన్న నమ్మకం ఉంది. ఈ పండ్ల మొక్కలు కూడా మీకు మంచి ఫలాలను ఇస్తాయనికూడా నమ్ముతున్నాను. మీరు ఈ ప్రాంతానికి ఎంతో శ్రమతో వచ్చారు. అందువల్ల ఇక్కడికి వచ్చిన గుర్తుగా మీ టీచరుగారి జ్ఞాపకం కోసం మీరు ఎటువంటి అడ్డంకులు లేకుండా తీసుకుని వెళ్ళండి" పాంచజన్య అన్నాడు.

పద్మావతి లేచి నిల్చుంది.

విరించి ఆ మొక్కలను అందుకుని ఆటోలో పెట్టాడు "జంక్షను వరకు ఆటో వస్తుంది. అక్కడ మిమ్మల్ని ఆటో డ్రైవరు బస్సు ఎక్కిస్తాడు" అన్నాడు.

పాంచజన్య పద్మావతికి వీడ్కోలు పలికాడు.

మొక్కలతో పాటు ఆటో ఎక్కింది. ఆటో ముందుకు కదిలింది.

ఆటో గేటు దాటిన తర్వాత పద్మావతి వెనక్కి తిరిగి చూసింది.

గేటు పైన పెద్ద అక్షరాలతో బోర్డు ఉంది.

ఆ బోర్డుమీద..

"అమ్మవనం... రమణీ వనం" అని రాసి ఉంది.

ఊఊఊ